అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

బుధవారం 9-8-2023

సమగ్ర తెలుగు దినపత్రిక



## ఏకపక్ష చర్చ

- యూసీసీపై కేరళ అసెంబ్లీ తీర్మానం
- ఉపసంహరించుకోవాలని కేంద్రానికి వినతి

వివరాలు 9లో..

సంపుటి : 9 | సంచిక : 171 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

## మందు పోయను... పైసలు పంచను

### ప్రజల దయ ఉంటే ఎమ్మెల్యేగా గెలుస్తా...

- లేకపోతే ఇంట్లో ప్రశాంతంగా కూర్చుంటా : రాజన్నసిరిసిల్ల జిల్లాలో మంత్రి కేటీఆర్ కీలకవ్యాఖ్యలు
- వేములవాడలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం
- బీసీబంధు, డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలు పంపిణీ



మాట్లాడుతున్న కేటీఆర్..

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'ఓట్ల కోసం మందు పోయించి, పైసలు పంచే వారిని నమ్మొద్దు. ఓట్ల కోసం నా జీవితంలో మందు పోయలేదు. పైసలు పంచలేదు. వచ్చే ఎన్నికల్లోనూ మందుగానీ, పైసలుగానీ పంచబోను. మీ దయ ఉంటే మళ్లీ ఎమ్మెల్యేగా గెలుస్తా. లేదంటే ఇంట్లో ప్రశాంతంగా కూర్చుంటా' అంటూ ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ తన నియోజకవర్గమైన రాజన్నసిరిసిల్లలో కీలకవ్యాఖ్యలు చేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో మంగళవారం ...9లో

# నోరు విప్పరేం...!

## మోడీని రప్పించేందుకే లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం

### మణిపూర్ కోసం న్యాయ పోరాటం : కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్





నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై చర్చ మంగళవారం లోక్ సభలో ప్రారంభమైంది. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ చర్చను ప్రారంభిస్తూ, తప్పనిసరి పరిస్థితుల్లోనే తాము ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టవలసి వచ్చిందన్నారు. ఇది సంఖ్యా బలానికి సంబంధించినది కాదని, కేవలం మణిపూర్ రాష్ట్రానికి న్యాయం జరగడం కోసమేనని స్పష్టం చేశారు. ఇండియా కూటమి ఈ తీర్మానాన్ని మణిపూర్ రాష్ట్రం కోసం తీసుకొచ్చిందని, మణిపూర్ న్యాయం కోరుతోందని తెలిపారు. మణిపూర్ తగులబడుతోందంటే భారత దేశం తగులబడినట్లేనన్నారు. వివిధ వర్గాల మధ్య ఇంత తీవ్రమైన విద్వేషాన్ని మునుపెన్నడూ చూడలేదన్నారు. మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్ బీరేన్ సింగ్‌ను ఆ పదవి నుంచి ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. బీజేపీ రాజకీయాలు మణిపూర్‌లో రెండు మణిపూర్‌లను సృష్టించాయని దుయ్యబట్టారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాల జాఢ్యం పెరిగిందని ఆరోపించారు. గంజాయి సాగు పెరుగుతోందన్నారు. పార్లమెంటులో మాట్లాడరాదనే మౌనవ్రతాన్ని ప్రధాని మోడీ చేపట్టారని, ఆ వ్రతాన్ని భగ్నం చేయాలనే తాము ఈ అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించామని చెప్పారు. ఇప్పటి వరకు మణిపూర్‌లో ఎందుకు పర్యటించలేదు? దాదాపు 79 రోజుల తరువాత మాట్లాడినపుడు కేవలం 30 సెకండ్లు మాత్రమే ఎందుకు మాట్లాడారు? మణిపూర్ ముఖ్యమంత్రిని ఆ పదవి నుంచి ఎందుకు తొలగించడం లేదు? అనే మూడు ప్రశ్నలు మోడీని అడుగుతున్నామని చెప్పారు. మణిపూర్ ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసం కోల్పోయారన్నారు. వైఫల్యాలను బీజేపీ అంగీకరించవలసిన సమయం ఆసన్నమైందన్నారు. మణిపూర్‌లోని బీజేపీ ప్రభుత్వాన్ని కాపాడటం కోసమే మోడీ మౌనంగా ఉన్నారని దుయ్యబట్టారు. ఈ తీర్మానంపై నిషికాంత్ దుబే, నారాయణ్ రణే, సునీతా దుగ్గల్, కిరణ్ రిజిజు (బీజేపీ), మనీష్ తివారీ (కాంగ్రెస్), టిఆర్ బాలు (డీఎంకే), సౌగత్ రాయ్ (టీఎంసీ), ...2లో

### ఓట్ల కోసం దేశాన్ని తగల బెడుతున్నారు

- ప్రధాని మోడీ పార్లమెంట్‌కు రాకుండా...ప్రజలను ఎలా విభజించాలో ఆలోచిస్తారు
- ఆయన్ని పార్లమెంట్‌కు రప్పించడమే అవిశ్వాస లక్ష్యం
- తక్కువ సమయం సభకు హాజరైన ప్రధానిగా మోడీ రికార్డు : అవిశ్వాస తీర్మానంపై చర్చలో సీపీఐ(ఎం) ఎంపీ ఎఎం ఆరీఫ్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

అవిశ్వాస తీర్మానానికి సీపీఐ(ఎం) తరఫున పూర్తిగా మద్దతు ఇస్తున్నామని ఆ పార్టీ ఎంపీ ఎ ఎం ఆరీఫ్ తెలిపారు.. ప్రధానిని సభకు రప్పించడం కోసం ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం దేశ పార్లమెంట్ చరిత్రలో ఇదే తొలిసారి అని అన్నారు. ప్రధాని సభకు రావాలని తాము నినాదాలు చేస్తుంటే, ఆయన పార్లమెంట్‌కు రాకుండా, ...2లో

## నిక్కర్ పార్టీ, లిక్కర్ పార్టీ రెండూ ఒక్కటే..

### ఇది నాకు గద్దర్ చెప్పిన మాట

- బీఆర్ఎస్‌కు 25 సీట్లకు మించి రావు
- అందుకే కాంగ్రెస్‌పై కేసీఆర్ దాడి
- చిల్లర రాజకీయాలకు అసెంబ్లీని వేదికగా మార్చారు
- నన్ను దూషించేందుకే కాంగ్రెస్‌ను దోషిగా మారుస్తున్నారు
- తెలంగాణకు చేసిన ద్రోహంపై చర్చకు సిద్ధమా? : సీఎం కేసీఆర్‌కు రేవంత్ సవాల్



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి..

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నిక్కర్ పార్టీ, లిక్కర్ పార్టీ రెండూ ఒక్కటయ్యాయని గద్దరన్న తనతో చెప్పారని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. యుద్ధం వ్యూహాత్మకంగా చేయాలని ఆయన సూచించినట్టు తెలిపారు. సీఎం కేసీఆర్ క్రిమినల్ పొలిటీషియన్ అనీ, జాగ్రత్తగా ఉండాలంటూ గద్దర్ అప్పుడే చెప్పారని వివరించారు. లక్ష్యాన్ని చేరేవరకు ...9లో

## ఆయన పలుకే బంగారం ...



**చట్టసభలో పెదవి విప్పని ప్రధాని**

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వంపై ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో వాడి వేడిగా చర్చ జరుగుతోంది. అయితే ప్రధాని మోడీ 2014లో పదవిని చేపట్టినప్పటి నుంచీ ఇప్పటి వరకూ ఏ నాడూ చట్టసభను పెద్దగా ఖాతరు చేసిన దాఖలాలు లేవు. కీలకమైన అంశాలపై ఓ వైపు సభలో చర్చ జరుగుతుంటే ఆయన గైర్హాజరు అయిన సందర్భాలు అనేకం. పార్లమెంట్ కంటే ఆయనకు ప్రాధాన్యత కలిగిన విషయాలు చాలానే ఉన్నాయి. ఉదాహరణకు 2021లో పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పుడు ఆయన 11 గంటల 33 నిమిషాల పాటు అనర్గళంగా ప్రచార సభలలో ప్రసంగించారు. అయితే అదే సంవత్సరం ఆయన పార్లమెంట్ బడ్జెట్, వర్షాకాల, శీతాకాల సమావేశాలకు హాజరైన మొత్తం సమయం నాలుగు గంటల కంటే తక్కువే. చట్టసభలు ప్రజాస్వామ్యానికి దేవాలయాల వంటివని ప్రవచనాలు చెప్పే ప్రధాని పార్లమెంటుకు హాజరైన సమయం కంటే ప్రకటనలు,ప్రచార కార్యక్రమాల్లోనే నిత్యం తలమునకలై ఉంటారు.తద్వారా తన ప్రాధాన్యతలను చాటిచెప్పారు. అయితే పార్లమెంటులో ప్రతిపక్షాలు అడిగే ప్రతి ...2లో

## మంత్రి ఎర్రబెల్లి హామీతో సమ్మె విరమణ

### డిమాండ్ల పరిష్కార హామీని స్వాగతిస్తున్నాం

- ఆర్థికపరమైన డిమాండ్లపై 15 రోజుల్లో స్పష్టతివ్వాలి
- లేకుంటే మరో పోరాటానికి సిద్ధం: తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ
- మంత్రి, ముఖ్య కార్యదర్శులకు సమ్మెవిరమణ లేఖలు అందించిన జేఏసీ నేతలు




మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్...

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీ మేరకు పంచాయతీ కార్మికుల సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్టు తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ప్రకటించింది. బుధవారం నుంచి కార్మికులు విధుల్లో పాల్గొంటారని తెలిపింది. సమ్మె విరమిస్తే సత్వరమే ఈఎస్ఐ, పీఎఫ్, వీక్లీ ఆఫ్, ఏటా రెండు యూనిఫారాలు అందజేత, పోస్టల్ బీమా, వారంలో ఒక రోజు సెలవు, 8 గంటల పని, తదితర హామీలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇవ్వడాన్ని స్వాగతించింది. అయితే, పర్మినెంట్, వేతనాల పెంపు, తదితర ఆర్థికపరమైన డిమాండ్లు, మల్టీపర్పస్ విధానం రద్దు వంటి వాటిపై 15 రోజుల్లో స్పష్టతనివ్వాలని ...9లో

## మైనార్టీలకు 16నుంచి చెక్కులిస్తాం

### మొదటి దశలో 10వేల మందికి రూ. లక్ష ఆర్థిక సాయం

- జనాభా దామాషా ప్రకారం లబ్దిదారుల ఎంపిక : మంత్రి హరీశ్‌రావు వెల్లడి



మాట్లాడుతున్న మంత్రులు హరీశ్‌రావు,గంగుల...

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మైనార్టీలకు ప్రభుత్వం ప్రకటించిన లక్ష రూపాయల ఆర్థిక సాయంలో భాగంగా ఈ నెల 16నుంచి చెక్కులను పంపిణీ చేయాలని ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. మొదటి దశలో భాగంగా ఎంపిక చేసిన 10వేల మంది లబ్దిదారులకు వాటిని పంపిణీ చేయాలని సూచించారు. ఇదే సమయంలో జనాభా దామాషా ప్రకారం లబ్దిదారులను ఎంపిక చేయాలని కోరారు. మైనార్టీల జనాభా ఎక్కువగా ఉన్న నియోజక వర్గాలపై మరింత దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఈ మేరకు బీసీ, ఎస్టీ, మైనార్టీ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించాలంటూ సీఎస్ శాంతకుమారిని ఆదేశించారు. మైనార్టీలకు సంబంధించిన వివిధ సమస్యలపై చర్చించేందుకు మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో హరీశ్ రావుతో పాటు మంత్రులు మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస యాదవ్, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, సీఎస్ శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, మైనారిటీ ఆర్థిక శాఖ కార్యదర్శి ఉమర్ జలీల్ ఇతర అధికారులు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మైనారిటీలకు ...9లో

## గృహలక్ష్మి దరఖాస్తు గడువు పెంచాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువును నెలరోజుల వరకు పెంచాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్వంత ఇంటి జాగా ఉండి ఇల్లు నిర్మించుకునే పేదలు గృహలక్ష్మి పథకం కోసం ఈనెల 10లోపే దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం గడువు విధించిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మీసేవా కేంద్రాలు అందుబాటులో లేకపోవడం, సాంకేతిక ...2లో

## రేషన్ డీలర్ల కమీషన్ రూ.1,400కు పెంపు

- అతి తక్కువ కాలంలో 700 శాతం పెంచిన ఏకైక రాష్ట్రం తెలంగాణ
- కేంద్రం పెంచకున్నా ఆదుకున్న సర్కార్ : రేషన్ డీలర్లతో మంత్రులు హరీశ్‌రావు, గంగుల చర్చలు సఫలం

వివరాలు 2లో..

# పత్తికి బూజు... మిర్చిపై మోజు





### ఇప్పటికీ రైతుల ఇండ్లల్లోనే కాటన్ నిల్వలు

- వర్షాలకు డ్యామేజ్
- గతేడాది ఆశించిన ధర లేక.. ఇప్పుడు తగ్గిన సాగు విస్తీర్ణం
- క్వింటాల్ రూ.25వేలు పలికిన మిర్చి
- కోల్డ్‌స్టోరేజీల్లో గణనీయంగా తగ్గిన మిరప నిల్వలు
- మద్దతు ధరపై నోరు మెదపని కేంద్రం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

'పిండి కొద్దీ రొట్టె..' అనే మాదిరిగానే 'ధర కొద్దీ పంట' అనే రీతిలో పత్తి, మిర్చి సాగు విస్తీర్ణాలు ఉన్నాయి. గతేడాది మిర్చి ధర ఆశాజనకంగా ఉండటం.. పత్తికి ధర లేక ఇప్పటికీ పంట ఇండ్లల్లోనే నిల్వ ఉండటం వల్ల ఈసారి రైతులు ఎక్కువగా మిర్చి సాగుకు మొగ్గుచూపుతున్నారు. క్వింటాల్ మిర్చికి రూ.25వేల వరకూ పలకడంతో వచ్చిన దిగుబడిని వచ్చినట్టే అమ్మేశారు. అదే పత్తి విషయానికొస్తే గతేడాది మొదట్లో క్వింటాల్ రూ.10వేల మార్క్‌ను తాకిన పంట ఆ తర్వాత క్రమేణా తగ్గింది. పంట ఉత్పత్తి ఊపందుకునే దశలో అసలు సీసీఐ కొనుగోళ్లే చేయకపోవడం.. ప్రయివేటు వ్యాపారులు క్వింటాల్ పత్తి రూ.6వేల వరకే కొనుగోలు చేయడంతో ఎక్కువ మంది రైతులు ఇండ్లల్లోనే పత్తిని నిల్వ చేసుకున్నారు. ఎప్పటికైనా ధర పెరగకపోదా అని ఎదురుచూస్తున్నారు. ఇంతలో వరుసగా 19రోజుల పాటు వర్షాలు రావడంతో నిల్వ చేసిన పత్తిలో తేమ శాతం పెరిగి బూజు పట్టిందని రైతులు వాపోతున్నారు. ఎప్పటికప్పుడు పత్తి తిరగేసినా ...9లో

### దూదికి బూజు పడుతోంది..



గతేడాది ఐదెకరాల్లో పత్తి వేసినా. మొదట్లో రూ.9వేల వరకు ధర ఉండటంతో రెండు, మూడు క్వింటాళ్లు అమ్మిన. ఆ తర్వాత పత్తినంతా నిల్వ చేశా. కనీసం రూ.8వేల ధర పెట్టినా అమ్ముదామని 8 నెలలుగా ఎదురుచూస్తున్నాను. నిల్వ చేసిన పత్తి వర్షాలకు బూజు పడుతోంది కానీ ధర మాత్రం రావడం లేదు. భారీగా నష్టాలు వచ్చేలా ఉన్నాయి.

- రాయబారపు వీరబాబు, పమ్మి, ముదిగొండ

## ఆర్జీయూకేటీలో విద్యార్థి ఆత్మహత్య

- హైదరాబాద్ ఐఐటీలో మరో విద్యార్థిని..
- మానసిక ఒత్తిడితోనే..



(ఫైల్)

నవ తెలంగాణ- బాసర/మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు ఆర్జీయూకేటీ, ఐఐటీహెచ్‌లో మంగళవారం జరిగాయి. ఈ రెండు క్యాంపస్‌ల్లో మూడు నెలల్లో సుమారు పది మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడటం రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టిస్తోంది. అసలు ...9లో



**హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | | |
|---|---|---|
| 24 క్యారెట్లు | - 60,060 | ▲ 100 |
| 22 క్యారెట్లు | - 55,050 | ▲ 100 |
| కిలో వెండి | - 77,300 | ▲ 1000 |



**చికెన్ ధరలు హైదరాబాద్**

**బ్రాయిలర్ చికెన్**

| | |
|---|---|
| ఫారం రేటు | రూ. 84 |
| రిటైల్ (లైవ్) | రూ. 106 |
| స్కిన్‌తో | రూ. 154 |
| స్కిన్‌లెస్ | రూ. 175 |

# పేదల కష్టాలు కనిపించలేదా?

- కోవిడ్ సమయంలో ఛిద్రమైన బతుకుల సంగతేంటి? • 'పేదరికం'పై వాస్తవాలను విస్మరించిన నిటి ఆయోగ్

**న్యూఢిల్లీ :** దేశంలో పేదరికం తగ్గిపోయిందా? అవునట. నిటి ఆయోగ్ గత నెలలో విడుదల చేసిన నివేదిక ప్రకారం 2015-16లో 24.85 శాతంగా ఉన్న పేదరికం 2019-21 నాటికి గణనీయంగా... అంటే 14.96 శాతానికి తగ్గిపోయిందట. అయితే గత కొన్ని సంవత్సరాలుగా వివిధ సంస్థలు విడుదల చేస్తున్న నివేదికలను, గణాంకాలను పరిశీలిస్తే నిటి ఆయోగ్ నివేదికపై అనుమానాలు తలెత్తడం సహజం. పైగా నిటి ఆయోగ్ విడుదల చేసిన నివేదిక ఏం చెప్పిందంటే అత్యంత నిరుపేద రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్‌లో కూడా పేదరికం తగ్గిపోయిందట.

ఈ నివేదిక ప్రకారం గడచిన ఐదు సంవత్సరాలలో దేశంలోని 13.5 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారు. ఇదే నిజమైతే 2030 నాటికి నిర్దేశించుకున్న అభివృద్ధి లక్ష్యం దిశగా దేశం సాగుతున్నట్లే. పురుషులు, మహిళలు, చిన్నారులు... వారు ఏ వయసువారైనప్పటికీ ప్రజానీకంలో సగం మందిని 2030 నాటికి పేదరికం నుంచి గట్టెక్కించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.



వాస్తవానికి కోవిడ్ కష్టకాలంలో ప్రజల ఆర్థిక స్థితిగతులు చిన్నాభిన్నమై పోయాయి. పట్టణాలు, నగరాలలో ఉపాధి కోల్పోయిన ప్రజలు గ్రామాల బాట పట్టి వందలాది కిలోమీటర్లు నడిచి, రాష్ట్రాలను దాటి స్వస్థలాలకు చేరుకున్నారు. కోవిడ్ మహమ్మారి ప్రభావం తగ్గిన తర్వాత వారు మళ్లీ పట్టణాలు, నగరాలకు చేరుకొని జీవనోపాధి కోసం ప్రయత్నించారు. ఆశ్చర్యకరమైన విషయమేమంటే పేదల బతుకులు ఛిద్రమైన ఆ సమయంలో సైతం దేశంలో పేదరికం తగ్గిందని నిటి ఆయోగ్ చెబుతోంది.

## అంచనాలలో లోపాలు

నిటి ఆయోగ్ నివేదిక విశ్వసనీయతపై ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యులు సైతం అనుమానాలు వ్యక్తం చేశారు. 2011 నాటి జనగణనకు సంబంధించిన నమూనాలలో ఇటీవల చేసిన ప్రధాన మార్పులను ఈ నివేదిక పట్టించుకోలేదని వారు ఎత్తిచూపారు. పైగా 2012 తర్వాత ప్రభుత్వం వినియోగ సర్వే చేపట్టలేదు. దీనివల్ల ప్రభుత్వం పేదరికాన్ని సరిగా అంచనా వేయలేకపోయింది. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన 28 కోట్ల మంది కార్మికులలో 94 శాతం మంది తమ నెలసరి వేతనం పది వేల రూపాయల కంటే తక్కువేనని డిక్లరేషన్ ఇచ్చారు. అంటే అసంఘటిత రంగంలో పని చేస్తున్న చాలా మంది కార్మికులు దారిద్ర్య రేఖకు సమీపంలోనే ఉన్నారని అర్థమవుతుంది. ఆరోగ్యం, విద్య సూచికలలోనే కాదు... అనేక ఇతర అంశాలలో కూడా కోవిడ్ కాలంలో పేదల బతుకులు చిన్నాభిన్నమైపోయాయి.

### కోవిడ్ సమయంలో...

2020-21కి సంబంధించిన సమాచారాన్ని 2020 జనవరి నుంచి 2021 ఏప్రిల్ మధ్యకాలంలో సేకరించారు. ఈ సమయంలోనే కోవిడ్ మహమ్మారి దేశాన్ని అతలాకుతలం చేసింది. ఈ కాలంలోనే పేదలు పెద్ద ఎత్తున పట్టణాలు, నగరాల నుంచి గ్రామాలకు వలస పోయారు. ప్రజలు అనారోగ్య కారణాలతో వైద్యం పైన ఎక్కువ సొమ్మును ఖర్చు చేయాల్సి వచ్చింది. కోవిడ్ కారణంగా చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. లాక్‌డౌన్‌తో చిన్న చిన్న వ్యాపారాలు మూతపడ్డాయి. కొన్ని ఇప్పటికీ ప్రారంభం కాని పరిస్థితి. కొందరైతే వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తెచ్చి వ్యాపారాలు మొదలు పెట్టారు. పరిశ్రమలు మూతపడడం అంటే యజమానులే కాదు వాటిలో పని చేసే కార్మికులు కూడా ఉపాధి కోల్పోయినట్లే. ధనికులైనా, పేదలైనా విద్యార్థుల చదువులు అటకెక్కాయి. విద్యా సంస్థలను మూసేశారు. ఆన్‌లైన్ క్లాసులతో నెట్టుకొచ్చారు. కానీ అవి పేద విద్యార్థులకు అందుబాటులో లేకుండా పోయాయి. గ్రామీణ ప్రాంతాలకు తల్లిదండ్రులతో పాటే వలస పోయిన విద్యార్థుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఒక్క మాటలో చెప్పాలంటే 2020-21లో పేదల ఆదాయాలు, ఉపాధి, విద్య, ఆరోగ్య ప్రమాణాలకు గట్టి విఘాతం ఏర్పడింది. ఇలాంటి ప్రతికూల పరిస్థితులు నెలకొని ఉంటే పేదరికం తగ్గిపోయిందని చెబుతున్న నిటి ఆయోగ్ నివేదికను ఎలా విశ్వసించగలం?

### ఎలా నిర్ణయిస్తారు?

ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలు అనే మూడు అంశాలను ఆధారంగా చేసుకొని పేదరిక సూచికను రూపొందిస్తారు. ఈ మూడింటికి సమాన ప్రాధాన్యత ఇస్తారు. ఈ మూడు అంశాలను తిరిగి 12 సూచికలుగా విభజిస్తారు. వీటిలో మూడు ఆరోగ్యానికి, రెండు విద్యకు, ఏడు జీవన ప్రమాణాలకు సంబంధించినవి. కోవిడ్ రాక ముందే అంటే 2019-20లోనే 70% సమాచారాన్ని సేకరించామని నిటి ఆయోగ్ తెలిపింది. ఇదే నిజమైతే 2019-20 సమాచారంతో 2015-16 సమాచారాన్ని పోల్చి చూడాల్సింది. కానీ మరి ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైన అసాధారణ కాలంతో ఎందుకు పోల్చారు? అధికారిక గణాంకాల ప్రకారమే 2019-20లో ఉన్న జీడీపీ (4.8 శాతం) 2022-23 నాటికి కానీ తిరిగి ఆ స్థాయికి చేరుకోదు. అంటే మూడు సంవత్సరాల అభివృద్ధిని దేశం కోల్పోయింది. ఆర్థికాభివృద్ధి పది శాతం పడిపోయింది. కోవిడ్ ప్రభావం తగ్గిపోయిన తర్వాత సంఘటిత రంగం సంక్షోభం నుంచి కోలుకుంది. కానీ పేదలు ఎక్కువగా పని చేసే అసంఘటిత రంగం మాత్రం నిదానంగా కోలు కుంటోంది. అయితే ఈ వాస్తవాన్ని నిటి ఆయోగ్ విస్మరించింది.

## ఆయన పలుకే బంగారం ...

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నకూ సమాధానం చెబుతానని మాత్రం ఆయన పలు సందర్భాలలో ప్రకటిస్తుంటారు.. మోడీ ప్రధాని అయిన తర్వాత ప్రధాని కార్యాలయం (పీఎంఓ) కేవలం 13 ప్రశ్నలకు మాత్రమే సమాధానం చెప్పింది. అసలు ప్రశ్నించే గొంతుకలంటేనే ఆయనకు గిట్టదు. విదేశీ పర్యటనల నుండి తిరిగి వచ్చిన తర్వాత ఆయన ఎన్నడూ వాటిపై సభలో ప్రకటన చేయలేదు. సభ్యుల ప్రశ్నలకు సమాధానాలూ ఇవ్వలేదు. ఏదైనా విషయంపై చర్చ జరిగినా ఆయన ఎన్నడూ జోక్యం చేసుకునే వారు కాదు. కేవలం ఒకే ఒక్క సందర్భంలో... అది కూడా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సంవత్సరంలో మాత్రం చర్చలో భాగస్వామి అయ్యారు. ఓ ఎన్నికల ప్రచార సభలో సాధ్వి నిరంజన్ జ్యోతి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ప్రతిపక్ష సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేసినప్పుడు స్పందించారు. అదే మొదటి సారి...చివరిసారి కూడా.

ఇక గత ఏడు సంవత్సరాల కాలంలో చర్చ సందర్భంగా ఆయన పార్లమెంటులో పెదవి విప్పింది ఒకే ఒక్క సందర్భం లో. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు 2017 ఫిబ్రవరిలో ఆయన సమాధానం ఇచ్చారు. పార్లమెంట్ సమావేశాలు జరగడానికి ముందు ప్రతిసారీ ఆయన మీడియాకు ఓ సందేశం చేర వేస్తుంటారు. ఉభయ సభలలో అర్థవంతమైన చర్చలు జరగాలని ఆశా భావం వ్యక్తం చేస్తారు. కానీ ఆయన మాత్రం ఎన్నడూ ఏ చర్చలోనూ క్రియాశీలకంగా వ్యవహరించిన పాపాన పోలేదు. సభ్యుల ప్రశ్నలకు మంత్రులే సమాధానాలు ఇస్తుంటారు. ప్రధానిని ఉద్దేశించి అడిగే ప్రశ్నలకు సైతం పీఎంఓ సహాయ మంత్రే జవాబు ఇస్తుంటారు. గడచిన ఏడు సంవత్సరాలలో ఆయన ఒక్క పత్రికా సమావేశాన్ని కూడా నిర్వహించలేదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన ఇంటర్వ్యూలలో సైతం ప్రశ్నలు అడిగేందుకు అవకాశం ఇచ్చే వారు కాదు. తాను చెప్పింది రాసుకోవడమే పాత్రికేయుల విధి అని అనుకునే వారు. ప్రధాని అయిన తర్వాత ఇచ్చిన ఇంటర్వ్యూలు కూడా తనను పొగిడే భజనపరులకు ఇచ్చినవే. మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు అరుణ్ శౌరి వంటి పరిశీలకులు ఆయనది అధ్యక్ష తరహా పాలన అని అంచనా వేశారు. జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే వారి అభిప్రాయంతో ఏకీభవించక తప్పదేమో!.

## ఎయిర్‌పోర్టులో 1.527 కిలోల బంగారం పట్టివేత

**నవతెలంగాణ-శంషాబాద్**



శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో పెద్ద ఎత్తున బంగారం పట్టుబడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. హైదరాబాద్ కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు వేర్వేరు కేసుల్లో రూ.93.26 లక్షల విలువైన 1.527 కిలోల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన ఒక ప్రయాణికుడి నుంచి రూ.49,47,480 విలువైన 810 గ్రాములు, అదే విమానంలో మరో ప్రయాణికుని నుంచి రూ.43,79,436 విలువ చేసే 717 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

## ఎస్‌బీఐ 'పిఎం స్వనిధి' క్యాంపెయిన్




**హైదరాబాద్ :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ సర్కిల్ పిఎంస్వనిధి పబ్లిసిటీ క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. మంగళవారం దీన్ని కోటిలోని ఆ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ జింగ్రన్, చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ లాంచనంగా ప్రారంభించారు. వీధి వ్యాపారులు, సూక్ష్మ ఎంటర్‌ప్రినూర్స్‌ను చేరడమే లక్ష్యంగా.. వారికి రుణాలు అందించే ఉద్దేశ్యంతో ఈ క్యాంపెయిన్ చేపడుతున్నామని జింగ్రన్ పేర్కొన్నారు. వీధి వ్యాపారులకు ఎలాంటి తనఖా లేకుండానే రూ.50,000 వరకు రుణం అందిస్తున్నామని రాజేష్ కుమార్ తెలిపారు. ఆ పథకం వివరాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ బ్యాంక్ జీఎం (ఎన్‌డబ్ల్యు-2) దేబాషిస్ మిత్రా, డిజిఎం జి భువనేశ్వరి, ఇతర ఉన్నతాధికారులు, స్టాఫ్ పాల్గొన్నారు.

## బాలికా సాధికారతే బీబీజీ లక్ష్యం

**హైదరాబాద్ :** బాలికల సాధికారతే లక్ష్యంగా కృషి చేస్తున్నామని బీబీజీ చైర్మెన్, ఎండీ ఎంవి మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. 2040 నాటికి 20 లక్షల ఆడపిల్లలను శక్తివంతం చేయడం ద్వారా నిజమైన సంపదను సృష్టించాలని నిర్దేశించుకున్నామన్నారు. తెలంగాణలోని పెద్దంబర్‌పేట, ఎల్‌బినగర్, వనస్థలిపురంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 'ప్రేరణ' కార్యక్రమం నిర్వహించినట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఆయా పాఠశాలల్లోని 1500 పైగా విద్యార్థులు, 50 మంది ఉపాధ్యాయులకు చేరువయినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా 'బాల దుర్వినియోగం', 'సామాజిక బాధ్యత', 'డిజిటల్ డిటాక్స్', 'స్టడీ స్కిల్స్' అంశాలపై అవగాహన సెషన్‌లను ఉషా కస్తూరి, నీరజ నేతృత్వంలో నిర్వహించినట్లు వెల్లడించింది. ప్రేరణ అనేది పేద పిల్లలకు నాణ్యమైన విద్యను, వ్యక్తిగత వద్ధికి అవకాశాలను అందించడం ద్వారా వారికి సాధికారత కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు పేర్కొంది.

# ఓట్ల కోసం దేశాన్ని తగల బెడుతున్నారు

(మొదటిపేజీ తరువాయి)

క్యాబిన్‌లో కూర్చొని ప్రజలను ఎలా విభజించాలని పదే పదే ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విభజనను ఎలా చాకచక్యంగా వచ్చే ఎన్నికల్లో గెలుపుకోసం ఉపయోగించుకోవాలో కూడా 50 మంది బీజేపీ ఎంపీలకు ఆయన సూచిస్తున్నారని విమర్శించారు. "ప్రధాని పార్లమెంట్‌కు రావడానికి ఎందుకు వెనుకాడుతున్నారు? పార్లమెంట్‌లో ఎదుటి సభ్యులందరూ మీకు శత్రువులని మీరు అనుకుంటున్నారు. కానీ మేము కూడా మీలాగే ప్రజలచే ఎన్నుకోబడ్డాం" అని గుర్తు చేశారు.

"ప్రపంచ ప్రఖ్యాత అమెరికా టైమ్ మ్యాగజైన్ ప్రధాని ముఖచిత్రాన్ని ప్రచురించి, ఆయనను విభజన నాయకుడిగా అభివర్ణించింది. అదేవిధంగా రోమన్ సామ్రాజ్యం మండుతున్నప్పుడు తన పియానో వాయించిన నీరో చక్రవర్తిగా మన దేశంలోను, వెలుపల ఉన్న ప్రముఖ మీడియాలన్నీ ప్రధాని మోడీని పోల్చాయి" అని తెలిపారు. పార్లమెంట్ చరిత్రలో అతి తక్కువ సమయం సభకు హాజరైన ప్రధానిగా మోడీ రికార్డు సృష్టించారని తమకు తెలుసని, ఈ రికార్డును మరెవరూ బద్దలు కొట్టలేరని తాను భావిస్తున్నానని అన్నారు. మణిపూర్‌లో హింస మొదలైన 79 రోజుల తరువాత మాత్రమే ప్రధాని సభ వెలుపల నోరు విప్పారని, ఇది సిగ్గుచేటని ధ్వజమెత్తారు. టెలిగ్రాఫ్ వార్తాపత్రిక ప్రధాని స్పందనను మొసలి కన్నీరుగా చిత్రీకరించిందని తెలిపారు. మణిపూర్ అంశం మీ 56 అంగుళాల ఛాతిలోకి చొచ్చుకుపోవడం చాలా కష్టం కాబట్టి, ఇది మొసలి కన్నీరుగా అభివర్ణించిందని అన్నారు.

మణిపూర్ తగలబడుతుంటే మన ప్రధాని ఫ్రాన్స్‌కు వెళ్లి ప్రపంచ శాంతి గురించి ప్రసంగించారని,"ఆయన దుర్వాసన వెదజల్లుతూ సుగంధ ద్రవ్యాలు అమ్ముతారు" అని అన్నారు. మణిపూర్ దహనమవుతుంటే, ప్రధాని మోడీ విదేశాల్లో ప్రపంచ శాంతి గురించి మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అతీతంగా ఒక రాష్ట్రం (మణిపూర్)పై సుప్రీంకోర్టు కూడా జోక్యం చేసుకోవడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి. ఈ ప్రభుత్వానికి సిగ్గుంటే, ప్రధాని, హౌంమంత్రి తమ పదవికి రాజీనామా చేయాలన్నారు.

మణిపూర్ వివాదం తరువాత మరో మతపరమైన అల్లర్లు హర్యానాకు విస్తరించి ఇంకా కొనసాగుతూనే ఉన్నాయన్నారు. హింసను అరికట్టేందుకు రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం ఏమీ చేయలేదని అన్నారు. మణిపూర్ మండుతున్నప్పుడు ప్రధాని యూసీసీ అనే మరో అంశంతో ప్రజల్లో చర్చకు ప్రయత్నించారని విమర్శించారు. బాబ్రీ మసీదు తరువాత వారణాసిలో మరో మసీదు (జ్ఞానవాపి) కూల్చివేసేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. దీని తరువాత కాశీ, మధుర మసీదులకు వెళతారని తమకు తెలుసన్నారు. ఇవన్నీ ఒక్కొక్కటిగా వస్తాయని, ఓట్ల కోసం ఈ దేశాన్ని తగలబెడతారనడంలో సందేహం లేదని ధ్వజమెత్తారు.

దేశంలోని లౌకిక శక్తులు ఈ విభజన శక్తుల నుంచి దేశాన్ని కాపాడతాయని, బీజేపీ ఈ దేశానికి చేసిన వినాశనం నుంచి దేశాన్ని రక్షించడానికి అన్ని ప్రతిపక్ష పార్టీలు కలిసి ఇండియా కూటమిగా ఏర్పడ్డాయని అన్నారు. ఇండియా కూటమిని ఓడించేందుకు ఈడీ జీవిత కాల డైరెక్టర్‌గా మిశ్రాను నియమించారని, కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి లోక్‌సభలో మీ ఇంటికి ఈడీ వస్తుందని ప్రతిపక్షాలను హెచ్చరిస్తోందని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల కోసం ఈడీ ఇప్పటికే తన ఎంపిక విధిని ప్రారంభించిందని విమర్శించారు. కేరళలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమను ఓడించేందుకు సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ, ఆదాయపు పన్ను, సెంట్రల్ విజిలెన్స్, కస్టమ్స్, కాగ్ వంటి తొమ్మిది ఏజెన్సీలను పంపారని, కానీ అక్కడి లెఫ్ట్ ప్రభుత్వాన్ని ఓడించలేకపోయారని పేర్కొన్నారు. ఇప్పుడు ప్రధాని మోడీ కూడా ఇండియా కుటమిని ఓడించేందుకు అనేక కుట్రలు పన్నుతున్నారని, అయితే ఆ పప్పులేవీ ఉడకవని స్పష్టం చేశారు.ఆర్ఎస్ఎస్ నాయకత్వం స్వాతంత్ర్య ఉద్యమా నికి వ్యతిరేకం ఉండటం వల్లే, క్విట్ ఇండియా గురించి ప్రధాని మోడీకి తెలియదని ఎద్దేవా చేశారు. ఈ పార్లమెంట్‌లో జర్నలిస్టులు ప్రవేశించడానికి అనుమతి లేదని, దీనికి కారణం ప్రధాని మోడీకి మీడియా అంటే ద్వేషం, భయం అని పేర్కొన్నారు. ఈ సభలో మెజార్టీతో అవిశ్వాస తీర్మానాన్ని ఓడించ వచ్చని, కానీ దేశంలోని ప్రజల బలంతో బీజేపీ ప్రభుత్వంపై అసలు అవిశ్వాసం పెట్టగలమని తమకు గట్టి నమ్మకం ఉందన్నారు.

## రేషన్ డీలర్ల కమీషన్ రూ.1,400కు పెంపు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రేషన్ డీలర్ల కమిషన్‌ను మెట్రిక్ టన్నుకు రూ.1,400కు రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. తెలంగాణ ఏర్పాటు సమయంలో రూ.200గా ఉన్న కమిషన్‌ను దశల వారీగా పెంచుతూ వచ్చారు. ఈ పెంపుతో రాష్ట్రంలోని 17,227 మంది రేషన్ డీలర్లు లబ్ది పొందనున్నారు. ఇందు కోసం ప్రతి ఏటా అదనంగా రూ.139 కోట్లను ప్రభుత్వం వెచ్చించనుంది. కరోనా సమయంలో చనిపోయిన 100 మంది రేషన్ డీలర్ల వారసులకు షాపులను కేటాయిస్తూ సర్కారు నిర్ణయించింది. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్‌తో డిప్యూటీ స్పీకర్ పద్మారావు, రేషన్ డీలర్ల సంఘం గౌరవాధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి, జేఏసీ ప్రతినిధులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, కమిషన్‌ను అతి తక్కువ సమయంలో 700 శాతం పెంచిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. ఏకమొత్తంలో రెండింతలు పెంచడమే కాకుండా ప్రధానమైన 13 అంశాలను పరిష్కరించినట్టు వారు తెలిపారు.

డీలర్ల కమిషన్ పెంపు సహా తమ ఇతర సమస్యలను పరిష్కరించిన ప్రభుత్వానికీ, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రేషన్ డీలర్లు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు సహకరించిన మంత్రులు, డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డిలకు సమావేశంలోనే ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాలశాఖ కమిషనర్ వి.అనిల్ కుమార్, రేషన్ డీలర్ల జేఏసీ ప్రతినిధులు నాయికోటి రాజు, మల్లిఖార్జున్, రవీందర్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**రేషన్ డీలర్ల కొన్ని అంశాల పట్ల మంత్రులు సానుకూలత వ్యక్తం చేశారు. ఆ డిమాండ్లు ఇవే...**

- కరోనా సమయంలో సేవలందిస్తూ మరణించిన 100మంది రేషన్ డీలర్ల వారసులకు కారుణ్య నియామకం కింద డీలర్‌షిప్ మంజూరు చేయడం
- రాష్ట్రంలో అమలవుతున్న రైతు, నేత, గౌడ తదితర బీమాల తరహాలో రేషన్ డీలర్లకు రూ.5 లక్షల బీమా అమలు
- ఆరోగ్యశ్రీ పరిధిలోకి ప్రతీ డీలర్‌ను తీసుకురావడం
- ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద ఖచ్చితమైన తూకం వేసేలా వేబ్రిడ్జిల ఏర్పాటు
- డీలర్‌షిప్ రెన్యూవల్ కాలాన్ని ఐదేండ్లకు పెంచడం
- రేషన్ డీలర్‌షిప్ వయోపరిమితిని 40 నుండి 50 ఏండ్లకు పెంపు
- అంత్యక్రియల నిర్వహణకు తక్షణ సాయం రూ.10 వేలు,
- 1.5 క్వింటాళ్ల వేరియేషన్లు కేసుల పరిధినుంచి తీసేయడం,
- హైదరాబాద్‌లో రేషన్ భవన్ నిర్మాణానికి భూకేటాయింపు

## నోరు విప్పరేం...!

(మొదటిపేజీ తరువాయి)

ఎంఎం ఆరీఫ్ (సీపీఐ(ఎం), సుప్రియా సూలే (ఎన్‌సీపీ), డింపుల్ యాదవ్ (ఎస్‌పీ), ఎన్‌కె ప్రేమ్ చంద్రన్ (ఆర్ఎస్‌పీ), అరవింద్ గణపత్ సవంత్ (శివసేన (ఠాక్రే)), సర్దార్ సిమ్రాన్‌జిత్ సింగ్ (ఎస్ఏడీఎం), తిరుమవలవన్ (వీసీకే), పినాకి మిశ్రా (బీజేడీ), శ్రీకాంత్ షిండే (శివసేన (షిండే)), నవనీత్ రాణ (ఇండిపెండెంట్ ఎంపీ) తదితరులు మాట్లాడారు.

**బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబేపై కాంగ్రెస్ ప్రివిలేజ్ నోటీస్**

లోక్‌సభలో బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబేపై కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ ప్రివిలేజ్ నోటీస్ ఇచ్చారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై నిషికాంత్ దూబే 'పూర్తి కల్పితం' అని ఆరోపణలు చేశారని నోటీసులో పేర్కొన్నారు.

# గృహలక్ష్మి దరఖాస్తు గడువు పెంచాలి

(మొదటిపేజీ తరువాయి)

కారణాలతో పనిచేయకపోవడం వల్ల ఈ గడువు సరిపోదని పేర్కొన్నారు. ఫలితంగా కొంతమంది అర్హులు ఈ పథకానికి దూరమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి దరఖాస్తు గడువును మరో నెలరోజుల వరకు పొడిగించాలనీ, ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా ఈ పథకాన్ని అమలు చేయాలని కోరారు. మొదటి విడత గృహలక్ష్మి పథకం ద్వారా ప్రతి నియోజకవర్గానికీ మూడువేల ఇండ్లు మంజూరు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. అయినప్పటికీ మార్గదర్శకాల్లో పేర్కొన్న కొన్ని అంశాల వల్ల కొంతమంది అర్హులు దూరమవుతున్నారని వివరించారు. వేలాది ఆహార భద్రత కార్డుల దరఖాస్తులను పరిష్కరించకుండా ప్రభుత్వం తన దగ్గర పెండింగ్‌లో పెట్టుకోవడంతో చాలామంది అర్హులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏండ్ల తరబడి ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు, చిన్నచిన్న రేకుల రూములు వేసుకుని నివసిస్తున్న పేదలు 59 జీవో కింద ఇంటి స్థలాలు పొందారని తెలిపారు. వారికి ప్రభుత్వం మొండిచెయ్యి చూపడం సరైందికాదని విమర్శించారు. ఎన్నికల ముందు డబుల్‌బెడ్రూం ఇండ్లకు రూ.ఐదు లక్షలిస్తామన్న హామీని రూ.మూడు లక్షలకు కుదించడంతో పేదల ఇంటి నిర్మాణం భారంగా మారనుందని తమ్మినేని పేర్కొన్నారు. అర్హులందరికీ ఈ పథకంలో అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

**20 రోజులు పొడిగించాలి : ప్రజాపంథా**

గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువును 20 రోజులు పొడిగించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. ఇండ్లులేని నిరుపేదలందరికీ షరతుల్లేకుండా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసేందుకు మూడు రోజులే గడువు ఇచ్చారని తెలిపారు. కులం, నివాసం, ఆదాయం, భూమి పేపర్లు, ఫొటోలు, ఓటర్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ ఇవన్నీ తయారు చేసుకునే వరకు మూడు రోజులు గడిచిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి చూస్తుంటే దరఖాస్తుకు అవకాశం ఇచ్చినట్టే ఇచ్చి ఈ పథకాన్ని అటకెక్కించే ఉద్దేశం కనిపిస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లబ్దిదారులకు ఎలాంటి అక్నాలెడ్జ్‌మెంట్ కార్డు ఇవ్వకుండా బాక్సుల్లో వేయించడం సరైంది కాదని తెలిపారు.

దరఖాస్తు ఏమైందో తెలుసుకుని ప్రజలు ప్రశ్నించే అవకాశం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పొందిన వారిని అనర్హులుగా ప్రకటిస్తే లక్షలాది మంది పేదలు అన్యాయానికి గురవుతారని తెలిపారు. వాటికి సంబంధం లేకుండానే ఈ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తగిన సమయం ఇవ్వకపోతే పేదల పక్షాన పోరాటాలు చేయకతప్పదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

# ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

**లేనిపక్షంలో ప్రగతిభవన్‌ను ముట్టడిస్తాం**

- తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా, క్యాబ్ డ్రైవర్ల సంఘాల జేఏసీ హెచ్చరిక
- ఆర్టీఏ కమిషనర్ ఆఫీస్ ముట్టడి
- ఆఫీస్‌లోకి దూసుకెళ్లడానికి ప్రయత్నించిన డ్రైవర్లు
- అడ్డుకుని ఈడ్చుకెళ్లి అరెస్టు చేసిన పోలీసులు




**నవతెలంగాణ-సిటీబ్యూరో/బంజారాహిల్స్**

వందశాతం పెరిగిన ఇంధన ధరలు, ఆదాయం పతనంతో రవాణారంగం కార్మికులు అనేక సమస్య లు ఎదుర్కొంటున్నారని, వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఆటో రిక్షా అండ్ క్యాబ్ డ్రైవర్ల సంఘాల జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గతంలో అనేకసార్లు విజ్ఞాపనలు, ధర్నాలు, పోరాటా లు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తుందని, ముఖ్యమంత్రి కేసీఆర్ తక్షణమే స్పందించి ఆటో రిక్షా, క్యాబ్ డ్రైవర్లు సమస్యలు పరిష్కరించాలంది. లేనిపక్షంలో ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించింది. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాష్ట్ర ఆటో రిక్షా అండ్ క్యాబ్ డ్రైవర్ల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని రవాణాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ఆటో రిక్షా, క్యాబ్ డ్రైవర్లు ముట్టడించారు. పెద్దఎత్తున నినాదాలు చేస్తూ కమిషనరేట్ లోకి దూసుకెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. డ్రైవర్లకు పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ క్రమంలో నిరసనకారులు రహదారిపై బైటాయించగా పోలీసులు బలవంతంగా ఈడ్చుకుంటూ తీసుకెళ్లి వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు బి.వెంకటేశం (ఏఐటీయూసీ), వి. మారయ్య (బీఆర్‌టీయూ), శ్రీకాంత్(సీఐటీయూ), ఏ.సత్తిరెడ్డి (టిఏడిఎస్), కిరణ్ (ఐఎఫ్‌టీయూ), షేక్ సలావుద్దీన్, సతీష్, నగేష్(క్యాబ్స్ యూనియన్) మాట్లాడారు.

ఆటో, క్యాబ్ డ్రైవర్లు పేదరికంలో జీవిస్తున్నారని, 2014 నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఆటో మీటర్ చార్జీలు పెంచకపోవడం దారుణమని అన్నారు. నిత్యావసర వస్తువులతోపాటు, పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు వంద శాతం పెరగడంతో రవా ణారంగ కార్మికులు దయనీయ పరిస్థితులను ఎదు ర్కొంటున్నారని తెలిపారు. అసంఘటిత రంగంలోని ఆటో కార్మికులు కార్మిక చట్టాల పరిధిలో లేరని, వారికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటివి లేవని, ప్రభుత్వం నుంచి ఎలాంటి సామాజిక భద్రత ప్రయోజనాలూ పొందడం లేదని తెలిపారు. ఆటో కార్మికుల మనో వేదనలను ప్రభుత్వం అర్థం చేసుకొని, తక్షణమే ఆటో మీటర్ చార్జీలు పెంచి, కార్మికుల సంక్షేమానికి రవాణారంగ కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్త ఆటో పర్మిట్ల జారీ నిషేధం వల్ల నిరుద్యోగ యువతకు ఉపాధి దొరకకుండా పోతుందని, నిషేధం ఎత్తివేసి 25 వేల కొత్త ఆటో పర్మిట్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్ ట్యాక్స్, గ్రీన్ ట్యాక్స్‌లు, నూతన మోటర్ వాహన చట్టాన్ని రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్, ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చేందుకు కేంద్రపై ఒత్తిడి తేవాలని కోరారు. ఆటోరంగ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే పోరాటాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ముట్టడిలో ఏఐఆర్‌టీడబ్లూఎఫ్-సీఐటీయూ నగర కార్యదర్శి అజయ్ బాబు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ నేతలు కొంరెల్లి బాబు, సీహెచ్. జంగయ్య, ఎండీ. ఒమర్ ఖాన్, ఎస్.కే. లతీఫ్, కృష్ణమూర్తి, ఐఎఫ్‌టీ యూ ప్రవీణ్, బీఆర్‌టీయూ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యవిధాన పరిషత్ విభాగంలో 3,124 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

వైద్యవిధాన పరిషత్‌లోని 3,124 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు మంగళవారం ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి హరిత కల్లెపు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేశారు. 968 పోస్టులను కాంట్రాక్టు, 2,029 పోస్టులను పొరుగుసేవల, 127 పోస్టులను ఎంటీఎస్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఆమోదం తెలిపింది.

## డబుల్ ఇండ్ల సర్వేకు

# తొమ్మిదేండ్లు పడుతుందా..!



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

గ్రేటర్ హైదరాబాద్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం తొమ్మిదేండ్లుగా సర్వే చేయకుండా ఏం చేస్తుందని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ప్రశ్నించారు. ఇప్పటికైనా సర్వే చేసి నిజమైన లబ్దిదారులను గుర్తించి ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద మంగళవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేటర్ పరిధిలో ప్రస్తుతం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు మాత్రమే పరిశీలిస్తూ.. ఆఫ్‌లైన్ దరఖాస్తులను పూర్తిగా విస్మరించారన్నారు.

దీని కారణంగా కలెక్టర్ ఆఫీసులో అందజేసిన ఆఫ్‌లైన్ దరఖాస్తుదారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ జిల్లాలోనే కలెక్టర్ ఆఫీస్‌కు నేరుగా 2,84,000 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరంతా ఇండ్ల సర్వేలో భాగస్వాములు కాకుండా దూరంగా ఉంచారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు అప్పట్లో పేదలు పెద్దసంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారని, అప్పుడు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ అంటూ ప్రభుత్వం చెప్పలేదన్నారు. ఇప్పుడు ఆన్‌లైన్ దరఖాస్తులను మాత్రమే సర్వే చేయడం వల్ల 2.84లక్షల మంది పేదలకు అన్యాయం చేయడమే అవుతుందన్నారు. ఆఫ్‌లైన్‌లో నేరుగా రెవెన్యూ కార్యాలయాల్లో ఇచ్చిన దరఖాస్తులన్నిటినీ తక్షణమే పరిశీలన చేయాలని కోరారు. గ్రేటర్ పరిధిలో మూడేండ్ల కిందట నిర్మించిన లక్ష ఇండ్లకు సంబంధించి త్వరగా అర్హులను గుర్తించి కేటాయించాలని, వీలైనంత త్వరగా సర్వే చేసి లబ్దిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.కొల్లూర్‌లో కట్టిన 16వేల ఇండ్లకు ఇటీవల సీఎం కేసీఆర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి.. నేటికీ లబ్దిదారులకు కేటాయించకుండా మర్చిపోయారని విమర్శించారు. మరోవైపు మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఇవ్వాల.. రేపు అంటూ నిరుపేదల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు.

రాజీవ్ గృహకల్ప స్కీం కింద ఇండ్లు ఇస్తామని 2005లో అప్పటి ప్రభుత్వం ఒక్కొక్కరి నుంచి రూ.వెయ్యి వసూలు చేసి.. నేటికీ ఇండ్లు ఇవ్వలేదన్నారు. వీరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో అవకాశం కల్పించకపోవడం సమంజసం కాదన్నారు. రాజీవ్ గృహకల్ప లబ్దిదారులకు ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రెండు నెలల్లోపు ఇండ్ల కేటాయింపు చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో కొంతమంది దళారులున్నారని.. డబుల్ ఇండ్ల కేటాయింపు పేరుతో లక్షల్లో వసూలు చేస్తున్నారని, అలాంటివి నమ్మి మోసపోవద్దని పేదలకు సూచించారు. దీనిపై కలెక్టర్, సంబంధిత అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.నాగలక్ష్మి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మురికివాడలు లేకుండా చేస్తానని.. అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఇంతవరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు.

ఇండ్ల కోసం అవసరమైతే మరో పోరాటానికి అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మహేందర్, ఎం. దశరథ్ మాట్లాడుతూ.. తహసీల్దార్, ఆర్డీవో ఆఫీసుల్లో పెట్టుకున్న దరఖాస్తులను వెంటనే పరిశీలించాలని, రెండు నెలల్లో వాటిని పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.అనంతరం సీపీఐ(ఎం) ప్రతినిధులు కలెక్టర్‌రేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సునీల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో సీపీఐ(ఎం) నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్‌రావు, కె.ఎన్.రాజయ్య, సభ్యులు ఎం.అజయ్ బాబు, ఆర్.వెంకటేష్, సి.మల్లేష్, ఎస్.మారన్న, జి.కిరణ్, ఆర్.అశోక్, ఏ.పద్మ, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

### ఇన్నేండ్లుగా ప్రభుత్వం ఏం చేస్తుంది..?

- ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్ దరఖాస్తుల పరిశీలన చేయాలి
- ఎన్నికల్లోపు ఇండ్లు ఇవ్వకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం : సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్

## గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ తేదీని పొడిగించాలి

- ఎన్నికల వాగ్దానం మేరకు ప్రతి ఇంటికీ రూ.5.5 లక్షలివ్వాలి
- ఆదాయం, కులం, సదరం సర్టిఫికెట్లు తప్పనిసరనే నిబంధనను ఎత్తేయాలి
- గుడిసె వాసులందర్నీ అర్హులుగా గుర్తించాలి : వ్యకాస

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

గృహలక్ష్మి కింద దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల పదో తేదీని తుది గడువుగా నిర్ణయించడం సరిగాదనీ, గడువును పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. కుల, ఆదాయ, సదరం ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా జమచేయాలనే నిబంధన లబ్దిదారులను కుదించే చర్య అని విమర్శించారు. ఆ నిబంధనను వెంటనే ఎత్తేయాలని డిమాండ్ చేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే వారం నుంచి పది రోజులు పడుతుందని పేర్కొన్నారు. కేవలం రెండు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలనీ, ఆ ధ్రువీకరణ పత్రాలను జతచేయాలనటం దారుణమని పేర్కొన్నారు. గత ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇంటి స్థలమున్న వారికి రూ.5.5 లక్షలు ఇస్తామంటూ బీఆర్ఎస్ ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని కోరారు. రూ. 3 లక్షలతో ఇల్లు ఎలా పూర్తవుతుందో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలను ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. వారికి నివాసస్థల పట్టా ఇవ్వడంతో పాటు గృహలక్ష్మి లబ్దిదారులుగా గుర్తించాలని కోరారు. వ్యక్తిగత వాంగ్మూలం ఆధారంగా గుడిసె వాసుల దరఖాస్తులను అధికారులు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఎంపికను గ్రామ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టాలనీ, అందులో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉండే విధంగా చూడాలని కోరారు.

## కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న.. రెండో ఏఎన్ఎం, ఎంపీహెచ్ఏ(ఎఫ్)లను రెగ్యులరైజ్ చేయాలి

- రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయండి : సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఆరోగ్య సిబ్బంది నిరసన



**నవతెలంగాణ-కంఠేశ్వర్**

వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న తమను రెగ్యూలర్ చేయాలని, కొత్తగా రిక్రూట్‌మెంట్ కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని రెండో ఏఎన్ఎంలు, ఎంపీహెచ్ఏ(ఎఫ్)లు పోరుబాట పట్టారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో 48 గంటల నిరసన కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 1520 ఎంపీహెచ్ఏ (ఎఫ్) పోస్టుల భర్తీ కోసం జారీ చేసిన నోటిఫికేషన్ 2/2023ను రద్దు చేసి రెండో ఏఎన్ఎంలను రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. 20 ఏండ్లుగా పని చేస్తున్న వీరి సర్వీస్‌కి.. ఉద్యోగాల భర్తీలో 20 శాతం వెయిటేజీ ఇస్తున్నట్టు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో వీరిని 'రూల్ ఆఫ్ రిజర్వేషన్' మెరిట్ రోస్టర్ ప్రకారం ఎంపిక చేశారని, మళ్లీ పరీక్ష రాయమనడం సరికాదని తెలిపారు. ఇప్పటికే చాలా మందికి వయసు దాటి పోతుందని, వీరిని ఖాళీలు ఉన్న పోస్టులో రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒక వేళ ప్రభుత్వం పట్టించుకోకుంటే 15వ తేదీ నుంచి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంపీహెచ్ఏ(ఎఫ్)లందరూ సమ్మెలోకి వెళ్తారని స్పష్టంచేశారు. కార్యక్రమం టీయూఎంహెచ్ఈయూ జిల్లా అధ్యక్షుడు సంజూ జార్జ్, వర్కింగ్ ప్రసిడెంట్ ప్రవీణ్ రెడ్డి, సలహాదారు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి పుష్ప, షాదుల్లా, గంగజమున, వీణ, సరోజ, ప్రమీలతో పాటు జిల్లాలో ఉన్న 32 పీహెచ్‌సీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## లౌకిక, ప్రజాస్వామిక శక్తులకు తీరని లోటు

- జహీరుద్దీన్ అలీఖాన్ మరణం పట్ల ఆవాజ్ సంతాపం

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

సియాసత్ ఉర్దూ దిన పత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీ ఖాన్ మృతి పట్ల ఆవాజ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్బాస్ మంగళవారం ఒక ప్రకటనలో సంతాపాన్ని ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలీఖాన్ అభ్యుదయ వాదిగా , లౌకిక, ప్రజాస్వామిక విలువల కోసం తన జీవితాంతం కృషి చేశారని పేర్కొన్నారు. దేశంలో పెరుగుతున్న మతోన్మాద, నియంతృత్వ ప్రమాదాన్ని నిలువరించడానికి అనేక ప్రజా సంఘాలు లౌకిక, వామపక్ష, ప్రజాస్వామిక, సామాజిక శక్తులతో కలిసి పనిచేశారని గుర్తుచేశారు. ఆయన మృతి లౌకిక, ప్రజాస్వామిక, సామాజిక శక్తులకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఈ ఏడాదిలో అసెంబ్లీ 14 రోజులేనా?

- బీజేపీ ఎమ్మెల్యేలకు రూమ్ఇవ్వకపోవడందారుణం : ఈటల

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

అసెంబ్లీ సమావేశాలను ఈ ఏడాది 14 రోజుల పాటే నిర్వహించడం దారుణమని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. గతంలో 55 నుంచి 60 రోజులు నడిచేవని గుర్తుచేశారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నాలుగున్నరేండ్ల పాటు అన్ని పార్టీల సభ్యులూ సహకరించారనీ, తెలంగాణలో ప్రశాంతంగా సమావేశాలు నిర్వహిస్తున్నామనే కితాబు వస్తుందని స్పీకర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో అన్ని పార్టీల సభ్యులకూ అసెంబ్లీ ఆవరణంలో రూములను కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. బీజేపీ ఎమ్మెల్యేలం ముగ్గురమున్నా రూమ్ కేటాయించకపోవడం అన్యాయమన్నారు. తమ హక్కులను కాపాడాల్సిన స్పీకర్ బాధ్యతను మరిచారనీ, దీంతో తాము సెక్యూరిటీల రూముల్లో కూర్చొని నోట్లు రాసుకున్నామని తెలిపారు. అధికార పార్టీ సభ్యులు ఎంత సేపు మాట్లాడినా అవకాశమిచ్చారనీ, తాము లేవగానే సీఎం, మంత్రుల వైపు చూస్తూ స్పీకర్ బెల్ మోగించడం దారుణమని విమర్శించారు. బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు మిత్రపక్షాలు అని సీఎం అంటున్నారన్నారు. అలాంటప్పుడు సభలో ప్రతిపక్ష పార్టీ ఎలా అవుతుందని ప్రశ్నించారు. పోలీసులకు, ఆఫీసర్లకు ఫోన్లు చేసేవారిగా ఎమ్మెల్యేలను మార్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని బట్టే సీఎం కేసీఆర్‌కు చట్టసభల మీద విశ్వాసం లేదని అర్థమవుతున్నదని విమర్శించారు. వరద బాధితులకు సహాయం చేయాలని అడిగితే తాము 100 మంది సభ్యులమున్నామంటూ ర్యాగింగ్ చేయడం దారుణమన్నారు. కాగ్ రిపోర్టు ఎత్తి చూపిన లోపాలపై కనీసం చర్చకుపెట్టకపోవడాన్ని తప్పుబట్టారు. కోకాపేటలో రూ.100 కోట్లకు ఎకరం అమ్మడం వెనుక ఏదో లోపాయికారి ఒప్పందం ఉందని ఆరోపించారు. గ్రామాల్లో కూడా రూ.40 లక్షలకు ఎకరం పలుకుతున్నదనీ, కంపెనీల కోసం రైతుల నుంచి సేకరిస్తున్న భూములకు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకే పరిహారం ఇవ్వడమేంటని ప్రశ్నించారు. దళితుల నుంచి 5800 అసైన్డ్ భూములను బెదిరించి ప్రభుత్వం లాక్కున్నదని విమర్శించారు. కలెక్టర్లకు టార్గెట్లు పెట్టి భూములను అమ్మించడం దారుణమన్నారు.

## సాగునీటి విడుదలపై స్పష్టతివ్వాలి

### రుణమాఫీని వెంటనే అమలు చేయాలి

- గృహలక్ష్మి పథకం దరఖాస్తుకు గడువు పెంచాలి : మాజీ ఎమ్మెల్యే జూలకంటి



**నవతెలంగాణ-మిర్యాలగూడ**

నాగార్జునసాగర్ ఎడమకాలకు నీటి విడుదలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వర్షాకాలం సీజన్‌లో నీటి విడుదలపై అనుమానాలు ఉన్నాయన్నారు. ఆశించిన మేరకు వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, దీనివల్ల బోర్లు, బావులు, చెరువులు ఎండిపోతున్నాయని చెప్పారు. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద నీరు వస్తోందని, ఆ నీటిని దిగువన సాగర్‌కు వదిలి తద్వారా ఎడమకాలువకు విడుదల చేసినట్టయితే ఆయకట్టుకు కొంత మెరకు జీవం పోసినట్టవుతుందన్నారు. ఇప్పటికే ఆయకట్టులో బోర్లు, బావుల కింద వరి నాట్లు వేసుకున్నారన్నారు. వాటిని కాపాడేందుకు సాగర్ కాలువ నీటిని విడుదల చేయాలన్నారు. సాగర్‌లో మరమ్మతులు చేస్తున్నామని, నీళ్లు తక్కువగా ఉన్నాయని సాకులు చూపి నీటి విడుదలపై జాప్యం చేయడం సరికాదన్నారు.

అదేవిధంగా, రుణమాఫీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం సీజన్ ప్రారంభం కావడం వల్ల రైతులకు పెట్టుబడులు అవసరం ఉందని, రుణమాఫీ వెంటనే చేస్తే మళ్ళీ రుణాలు తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సొంత స్థలం ఉన్న వారికి గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకంలో నిబంధనలు గందరగోళంగా ఉన్నాయని చెప్పారు. స్పష్టమైన నిబంధనలు పెట్టి గతంలో వేరే లబ్ది పొందిన వారిని కూడా ఈ పథకంలో అర్హులుగా గుర్తించాలని సూచించారు. దరఖాస్తులకు మూడ్రోజులు మాత్రమే సమయం ఇవ్వడం సరికాదన్నారు. నెలాఖరు వరకు గడువు పొడిగించాలని కోరారు.

34 రోజులుగా గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె చేస్తున్నారని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ విషయంపై మంత్రి దయాకర్‌రావును కలిసి వివరించామని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారని తెలిపారు. త్వరితగతంగా కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) నాయకులు ముడావత్ రవినాయక్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, నాయకులు భావండ్ల పాండు, పరుశరాములు, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి రామ్మూర్తి, లక్ష్మీనారాయణ, కె.రమేశ్‌బాబు, బాబునాయక్ తదితరులు ఉన్నారు.

## స్పెషల్ పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో అవకతవకలు

- కానిస్టేబుల్ అభ్యర్థుల నిరసన
- జీవో నెంబర్ 46 ను రద్దు చేయాలని డిమాండ్



**నవతెలంగాణ-వనస్థలిపురం**

రాష్ట్రంలో స్పెషల్ పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో అవకతవకలు జరిగాయని, జీవో నెంబర్ 46ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం 14 మంది కానిస్టేబుల్ అభ్యర్థులు నిరసన తెలిపారు. హైదరాబాద్ వనస్థలిపురం డివిజన్ పరిధిలోని చింతలకుంట ప్రసారభారతి ఆకాశవాణి రేడియో టవర్ ఎక్కడానికి అభ్యర్థులు యత్నించగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. అనంతరం వారిని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అరెస్టు అయిన వారిలో నవీన్, కృష్ణ, లక్ష్మణ్, శివకుమార్, నాగచారితో పాటు మరో తొమ్మిది మంది ఉన్నారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ అభ్యర్థులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ జిల్లాల వారీగా ఉండేదని, ఇప్పుడు మూడు జిల్లాలను ఒక జోన్‌గా ఏర్పాటు చేశారని తెలిపారు. మార్కుల ప్రతిపాదికన ఎంపిక చేయకుండా, జనాభా ప్రతిపాదికన ఎంపిక చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీని వల్ల 100 శాతం మార్కులు తెచ్చుకున్న వివిధ సామాజిక తరగతుల అభ్యర్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 46ను రద్దు చేయాలని ప్రభుత్వానికి తెలియచేయడానికే ఈ నిరసన చేపట్టినట్టు తెలిపారు.




## అమరుల ఆశయాలకనుగుణంగా ఆర్టీసీ విలీన ప్రక్రియ

- విలీనానికి ముందే బకాయిలు విడుదల చేయాలి
- ఆర్టీసీ జేఏసీ నాయకుల డిమాండ్
- సూర్యాపేట డిపోలో అమరులకు నివాళి

**నవతెలంగాణ-సూర్యాపేట**

ఆర్టీసీ సమ్మె సందర్భంగా 2019లో అమరులైన కార్మికుల ఆశయాలకు తగ్గట్టుగా సంస్థ విలీన ప్రక్రియ చేపట్టి విధివిధానాలు ఖరారు చేయాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిన సందర్భంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డిపోలో కార్మికులు అమరుల చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. పలువురు ఆర్టీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసీ కార్మికుల పాత్ర ఎనలేనిదని, బస్సు చక్రం ఆగితేనే తెలంగాణ సాధించుకోగలిగామని గుర్తు చేశారు. సాధించుకున్న తెలంగాణలో కూడా హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు తప్పలేదన్నారు. 2015, 2019లో సమ్మె చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, ఈ పోరాటంలో 35 మంది కార్మికులు అమరులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు సంస్థను, కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందడం స్వాగతిస్తున్నామని తెలిపారు. కానీ అమరులు ఆశించిన విధంగా విలీన ప్రక్రియ చేపట్టి కార్మికుల హక్కులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. 2017, 2021 వేతన సవరణ చేసి, 2013 వేతన సవరణ బకాయిలు, సీసీఎస్, పీఎఫ్ తదితర బకాయిలను విలీనానికి ముందే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వేసిన ఉపసంఘం కార్మిక సంఘాలతో చర్చించి మెరుగైన వేతనాలు, సర్వీస్ కండిషన్స్ ఇవ్వాలన్నారు. ఆర్టీసీ విస్తరణ కోసం కొత్తబస్సులను కొనుగోలు చేసి ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు బత్తుల సుధాకర్, డోన్‌వాన్ రవికుమార్, లచ్చయ్య, పీఎం రావు, సేవ్య, లక్ష్మయ్య, రాఘవులు, హనుమంత్, శ్రీకంట్లం, రమేశ్, నాగిరెడ్డి, పరుశరాములు, ఇంద్రయ్య, పీసీ శేఖర్, అజారుద్దీన్, స్వామి వెంకన్న, టీజే ఎం రెడ్డి, నాగేందర్, మంజుల, సైదమ్మ, రూపావతి, ఇందిర పాల్గొన్నారు.

## సైబర్ కరెంట్ నేరగాళ్ళతో జాగ్రత్త

- వినియోగదారులకు టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎమ్‌డీ ఏ గోపాలరావు హెచ్చరిక

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

"మీ ఇంటి కరెంటు బిల్లు ఇంకా కట్టలేదు. బిల్లు పెండింగ్‌లో ఉన్నందున కరెంట్ కట్ చేస్తున్నాం. తక్షణం ఈ క్రింది నెంబర్‌కు ఫోన్ చెయ్యండి" అని సైబర్ నేరగాళ్లు విద్యుత్ వినియోగదారులకు పంపే మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎన్పీడీసీఎల్) సీఎమ్‌డీ ఏ గోపాలరావు హెచ్చరించారు. ఈ తరహా మోసాలు తమ దృష్టికి వచ్చాయనీ, ఆ మెసేజ్‌లకు, తమ సంస్థకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తమ సంస్థ ఈ తరహా మెసేజ్‌లు ఎప్పుడు పంపదని స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్లు పంపే మెసేజ్‌లు ఓపెన్ చెయ్యకూడదని, అందులో ఉన్న ఫోన్ నెంబర్లకు కాల్స్ చేయొద్దని సూచించారు. విద్యుత్ వినియోగదారులు సంస్థ అధికారిక వెబ్‌సైట్ టిఎస్ఎన్‌పిడిసిఎల్.ఇన్ లో బిల్ డెస్క్ ద్వారా సర్వీస్ నెంబరు నిర్ధారించుకొని బిల్లులు చెల్లించాలని కోరారు. గూగుల్ పే, ఫోన్ పే ద్వారా కూడా బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్ల నుంచి ఏవైనా తప్పుడు మెసేజ్‌లు వస్తే సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు.



## ఆర్‌జీఐ ఎయిర్‌పోర్టులో హై అలర్ట్

**నవతెలంగాణ-శంషాబాద్**

ఈ నెల 15న జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శాంతి భద్రతల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. ఇందులో భాగంగా సందర్శకుల పాసులను నిలిపివేశారు. సీఐఎస్ఎఫ్ డాగ్స్ స్కాడ్, బాంబుస్కాడ్, క్లూస్ టీంలతో అణువణువునా తనిఖీలు చేపట్టారు. పార్కింగ్, వాహనాల రద్దీ, తదితర ఏరియాల్లో క్షుణ్ణంగా పరిశీలన చేస్తున్నారు. ఏయిర్‌పోర్టులోకి వచ్చే వాహనాల రాకపోకలపై మరింతా నిఘా పెంచారు. హై అలర్ట్‌తో సందర్శకులు ఎవరు కూడా ఎయిర్‌పోర్టుకు రావొద్దని అధికారులు తెలిపారు.

## ప్రభుత్వ డాక్టర్ల డిమాండ్లను పరిష్కరించాలి

- తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ప్రభుత్వ వైద్యుల డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ప్రతినిధుల బృందం రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ కె.రమేశ్ రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించింది. తమ డిమాండ్లను ప్రభుత్వానికి నివేదించాలని కోరింది. టైంబాండ్ ప్రమోషన్లకు సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌ను కలిసి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినట్టుగానే వైద్య విధాన పరిషత్ ఉద్యోగులను కూడా ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. వైద్యారోగ్యశాఖలో ఆర్డీవోల పెత్తనాన్ని సహించేది లేదనీ, వారిని పర్యవేక్షణ అధికారులుగా నియమించే యోచనను విరమించుకోవాలని కోరారు.

సంపాదకీయం

# సభకు రాహుల్...

'మోడీ' ఇంటి పేరు వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సూరత్ కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్షను గత శుక్రవారం సుప్రీం కోర్టు నిలుపుదల చేయడం ద్వారా... కింది కోర్టులు చేసిన తప్పిదాలను సరి చేసింది. 'సుప్రీం' మంజూరు చేసిన స్టే రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి భారీ ఊరట. కేంద్రంలో ఉన్న ప్రజా కంటక బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించే

> రాహుల్‌ను దోషిగా పేర్కొన్న సూరత్ కోర్టు గరిష్టంగా రెండేళ్ల జైలుశిక్ష విధించడానికి కారణాలను పేర్కొన లేదని సుప్రీం కోర్టు తప్పుబట్టింది. గతంలో 'దేశ్‌కా చౌకీదార్ చోర్ హై' అన్న వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు రాహుల్‌ను మందలించిం దన్న అంశాన్ని మాత్రమే ప్రస్తావించిందని పేర్కొంది. అప్పిలేట్ కోర్టు, హైకోర్టు సైతం రాహుల్ స్టే అభ్యర్ధనను తోసిపుచ్చడంపై కేంద్రీ కరించాయి తప్ప గరిష్ట కాల శిక్ష విధింపునకు కారణాలు తెలపలేదు.

లక్ష్యం ప్రాతిపదికగా పని చేస్తున్న విపక్ష 'ఇండియా' సంగమం వైపు నుంచి పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్షాలకు చెందిన కీలక నాయకులపై ఉద్దేశపూర్వక ఎజెండాతో ఒక పథకం ప్రకారం అక్రమ కేసులు బనాయిస్తున్న బీజేపీకి సుప్రీం మధ్యంతర ఉత్తర్వులు మింగుడు పడని వ్యవహారం. ఈ కేసులో తప్పించుకున్నా రాహుల్‌పై మరెన్నో కేసులు న్నాయని కేంద్ర బీజేపీ మంత్రులు, నేతలు ఆడిపోసుకుంటున్నారు. పరువునష్టం కేసులో ఈ ఏడాది 23న సూరత్ ట్రయల్ కోర్టు రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష విధించిన కొన్ని గంటల్లోనే ప్రజాప్రాతినిధ్య చట్టం నిబంధనలను ఉటంకిస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పుడు సుప్రీంకోర్టు స్టే ఇచ్చిన మూడు రోజుల తర్వాత తీరిగ్గా, అదీ కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాల డిమాండ్ తర్వాత సోమవారం రాహుల్ సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ నోటిఫై చేయడం గమనార్హం.



2019 సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో మోడీ అనే ఇంటి పేరు ఉన్నవాళ్లందరూ దొంగలంటూ బీజేపీ జమానాలో బ్యాంకులకు రూ.వేల కోట్లు ఎగనామం పెట్టి దేశాన్ని విడిచి పారిపోయిన కరడు గట్టిన ఆర్థిక నేరస్తులు లలిత్ మోడీ, నీరవ్ మోడీ, తదితరుల పేర్లను రాహుల్ ప్రస్తావించారు. వాస్తవానికి రాహుల్ చేసింది కేవలం రాజకీయ ఆరోపణ. ఒక నిర్దిష్ట కులానికి, ఇంటి పేరు కలిగిన వారికి అస్సలు వర్తించదు. ఎక్కడో కర్నాటక కోలార్ లో రాహుల్ విమర్శ చేస్తే గుజరాత్‌లోని సూరత్ కోర్టులో బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోడీ కేసు వేయడం ఒక వింత అయితే, రాష్ట్ర వ్యాప్తంగా కోట్లల్లో ఉన్న ఒబిసి కులస్తులందరి పరువుకూ రాహుల్ వ్యాఖ్యలు నష్టం కలిగించాయని క్రిమినల్ కేసు వేయడం వింతల్లో వింత. కాగా రాజకీయ విమర్శకు సూరత్ కోర్టు రాహుల్‌కు రెండేళ్ల జైలు విధించింది. ఇటువంటి కేసుల్లో రెండేళ్ల జైలు పడటం ఇదే తొలిసారి. సూరత్ మెజిస్ట్రేట్ నియామకం, హడావుడిగా సెలవుల్లే కుండా కేసు విచారణ, రెండేళ్ల జైలుశిక్ష విధింపు అసాధారణం. ఈ ప్రహసనాన్ని బట్టే రాజకీయ ప్రేరేపితం అని స్పష్టమైపోతుంది.

ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఏదైనా కేసులో దోషిగా నిర్ధారణై రెండేళ్లు, అంత కంటే ఎక్కువ శిక్ష పడితే అటు వంటి వ్యక్తి రాజ్యాంగ పదవులకు అనర్హుడవుతాడు. శిక్షాకాలంతో పాటు మరో ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హత కోల్పోతారు. ఐపిసి సెక్షన్ 499 కేసులో దోషిగా నిర్ధారణ అయిన వ్యక్తికి గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా లేదా కొన్ని సందర్భాల్లో ఆ రెండూ విధించే అవకాశం ఉంది. రాహుల్‌ను దోషిగా పేర్కొన్న సూరత్ కోర్టు గరిష్టంగా రెండేళ్ల జైలుశిక్ష విధించడానికి కారణాలను పేర్కొన లేదని సుప్రీం కోర్టు తప్పుబట్టింది. గతంలో 'దేశ్‌కా చౌకీదార్ చోర్ హై' అన్న వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు రాహుల్‌ను మందలించిం దన్న అంశాన్ని మాత్రమే ప్రస్తావించిందని పేర్కొంది. అప్పిలేట్ కోర్టు, హైకోర్టు సైతం రాహుల్ స్టే అభ్యర్ధనను తోసిపుచ్చడంపై కేంద్రీ కరించాయి తప్ప గరిష్ట కాల శిక్ష విధింపునకు కారణాలు తెలపలేదు. సదరు గరిష్ట కాలశిక్షే లోక్‌సభలో రాహుల్‌పై అనర్హత వేటు వేయడానికి సాధనం అయిందని కింది కోర్టుల విచారణ, పరిశీలనపై సుప్రీం తీవ్రంగా వ్యాఖ్యా నించడం గమనార్హం.

ఇటువంటి శిక్షలు విధించినప్పుడు ఆయా వ్యక్తులు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల ప్రజల గురించి కూడా ఆలోచించాలని పేర్కొనడం అభినందనీయం. ప్రతిపక్షాలపై ఇ.డి, సిబిఐ వంటి దర్యాప్తు సంస్థలను ప్రయోగించి కక్ష సాధిస్తున్న మోడీ ప్రభుత్వం సరికొత్తగా పరువు నష్టం (క్రిమినల్) కేసులను బనాయించే సరికొత్త మార్గాన్ని ఎంచుకుంది. అందులో భాగమే రాహుల్‌పై కేసు. కేంద్ర ప్రభుత్వ ఈ తరహా వేధింపులు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు.

# చైనాపై అమెరికా సరికొత్త ప్రచార దాడి!

పెట్టుబడిదారీ విధానాన్నే అస్త్రంగా మార్చి అమెరికాను దెబ్బతీసేందుకు చైనా ఎలా చూస్తున్నదో చూడండి, మన పెట్టుబడులనే మన నాశనానికి వాడుతున్నది అంటూ అమెరికాలో విశ్లేషకులు కొందరు అక్కడి పాలక వర్గాన్ని హెచ్చరించారు. ఇది ఒక్కరిద్దరి అభిప్రాయం అనుకుంటే పొరపాటు, అమెరికాలో పెట్టుబడిదారీ విధాన మీద తలెత్తిన ఆగ్రహాన్ని పక్కదారి పట్టించేందుకు అక్కడి పాలకవర్గ మేధావులు ముందుకు తెచ్చిన సరికొత్త ప్రచార దాడిలో అదొక అస్త్రం.అదే విధంగా అమెరికా స్కూళ్లలో చైనా ప్రవేశించి కమ్యూనిస్టు పాఠాలు చెబుతు న్నదని ఆధారం లేని ఆరోపణలతో ఒక నివేదికను విడుదల చేశారు. ఈ రెండూ అక్కడి పాలకవర్గంలో ఉన్న చైనా, కమ్యూనిస్టు వ్యతిరేకత, దాన్ని జనం మెదళ్లలోకి ఎక్కించే ప్రయత్నం కనిపిస్తున్నది.



ఎం కోటేశ్వరరావు
8331013288

విశ్లేషకుల కథన సారం ఇలా ఉంది. "ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికి కమ్యూనిస్టు సిద్ధాంత మార్గ దర్శకత్వంలో పని చేసే చైనా నుంచి ముప్పు తీవ్రం అవుతున్నది. అందువలన దానితో ఆర్థిక లావాదేవీలను పునఃవిశ్లేషణ చేసుకోవాల్సిన అత్యవసరం ఎన్నటి కంటే మరింత పెరిగింది. అమెరికా పెట్టుబడులతో అపార సంపదలను చైనా పోగేసుకుంది. మన సొంత పెట్టుబడిదారీ వ్యవస్థను మన వ్యతిరేక ఆయుధంగా మార్చింది. పెన్షన్ నిధులు, ఇతర మార్గాల ద్వారా దాదాపు పది కోట్ల మంది అమెరికన్లు తమకు తెలియకుండానే తమను దెబ్బతీసే ఆర్థిక ప్రత్యర్థి చైనాలో పెట్టుబడులు పెట్టారు. ప్రపంచాధిపత్యం కోసం చూస్తున్న దాని మిలిటరీ బలపడేందుకు అవకాశం కల్పించారు. ఆర్థిక సరళీకరణను ప్రారంభించిన 1978 నుంచి చైనా ఒక పద్ధతి ప్రకారం పశ్చిమ దేశాల పెట్టుబడి మార్కెట్లను లక్ష్యంగా చేసుకుంది. చైనా కమ్యూనిస్టు పార్టీపై అమెరికా పార్లమెంటు ఏర్పాటు చేసిన సెలెక్ట్ కమిటీ ముందు సాక్ష్యమిచ్చిన పెట్టుబడి మార్కెట్ల భద్రతా కమిషనర్ రోజర్ రాబిన్సన్ మాట్లాడుతూ పరాకుగా ఉన్న అమెరికా చైనా కమ్యూనిస్టు పార్టీ నియంత్రణలో ఉన్న ఐదు వేల కంపెనీల్లో లక్షల కోట్ల డాలర్లను పెట్టుబడులుగా పెట్టేందుకు సాధారణ అమెరికన్లను అనుమతించింది. ప్రపంచమంతటి నుంచి చైనా వచ్చే పెట్టుబడుల్లో అరవై శాతం డాలర్లు అమెరికా వనరుల నుంచే ఉన్నాయి గనుక అవి నిలిచిపోతే అక్కడి ఆర్థికరంగం పూర్తిగా దెబ్బతిని చైనా ప్రభుత్వానికి ముప్పు ఏర్పడుతుంది.

పెట్టుబడులు పెట్టినందుకు దోహదం చేసిన బ్లాక్‌రాక్ వంటి అగ్రశ్రేణి ఆస్తుల నిర్వహణ సంస్థలు ఇప్పుడు సాకులు చెబుతున్నాయి. అమెరికా పర్యావరణ, సామాజిక, పాలన ప్రమాణాలను పక్కన పెట్టి పెట్టుబడులు పెట్టాయి. ఇలాంటి కంపెనీలు వాటిని గట్టిగా పాటించి ఉంటే చైనా కంపెనీలకు పెట్టుబడులు వెళ్లేవి కాదు. ప్రపంచంలోని ఏ దేశంలోనూ పెట్టనన్ని పెట్టుబడులను బ్లాక్‌రాక్ కంపెనీ సిఇఒ లారీ ఫింక్ ప్రవహింపచేశాడు. పెట్టుబడి సంస్థలు చైనాలో పెట్టుబడులు పెడితే సంభవించే ఆపదల గురించి పట్టించుకోకపోగా పైకి కనిపించినంత చెడుగా చైనా సంస్థలు లేవని యుబిఎస్ గ్లోబల్ వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థ చెప్పింది. నిర్బంధ శిబిరాలు, బలవంతంగా కార్మికులను తరలించే, మారణ కాండ, చైనా మిలిటరీకి ఆధునిక ఆయుధాలను సరఫరా చేసేందుకు దోహదం చేసేవిగా చైనా కార్పొరేట్ కంపెనీలు ఉన్నాయి. ప్రపంచ ప్రజాస్వామిక ఆర్థిక వ్యవస్థ లున్న దేశాలన్నీ చైనా సంస్థలతో చేతులు కలిపితే వచ్చే ముప్పును గ్రహిస్తున్నాయి. చైనా మీద ఆధారపడితే తలెత్తే ముప్పును తొలగించుకొనేందుకు, నూతన సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు జి7 దేశాల కూటమి పూనుకుంది. ఇది చాలదు, అమెరికా స్టాక్ ఎక్సేంజ్‌లలో ఉన్న చైనా కంపెనీలను జాబితా నుంచి తొలగించాలి, రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి. చైనా కంపెనీలకు రుణాలు ఇచ్చే సంస్థలను నిషేధించాలి. డాలర్ల రూపంలో ఇస్తున్న చైనా ప్రభుత్వ బాండ్ల మీద నిషేధం విధించాలి. గతంలో సోవియట్ ముప్పును వమ్ము చేసేందుకు అనుసరించిన ఆర్థిక పద్ధతులను ఇప్పుడు చైనా మీద అనుసరించాలి. మనం దీర్ఘకాలంగా ప్రేక్షకుల మాదిరి ఉన్నాం, మన పెట్టుబడిదారీ వ్యవస్థను నియంత్రించేందుకు ఇది సరైన తరుణం."



అమెరికా గడ్డ మీద, వెలుపలా అమెరికా మీద చైనా నిరంతర నిఘాను ఉపేక్షించరాదని ఆగస్టు మొదటి వారంలో జరిగిన పార్లమెంటు సెలెక్ట్ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన రిపబ్లికన్ పార్టీ ఎంపీ మైక్ గాలఘర్ డిమాండ్ చేశాడు. ఇప్పుడే మేలుకున్నా మని కూడా అన్నాడు. దానిలో భాగంగా ప్రపంచ మంతటా రహస్య పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసిందని ప్రచారం చేస్తున్న సంగతి తెలిసిందే.చైనాలో ప్రయివేటు కంపెనీలంటూ లేవు, ప్రతి ఒక్కరూ, ప్రతిదీ, ప్రతి సంస్థ షీ జిన్‌పింగ్ కోరుకున్నదాని ప్రకారమే ఉంటుందని గాలఘర్ ఆరోపించాడు. చైనాలో పెట్టుబడులపై పరిమితులను మరింతగా విస్తరించాలని జో బైడెన్‌ను గాలఘర్ కోరాడు. ఉత్తరువుల ద్వారా వాటిని వెంటనే అమల్లోకి తేవాలంటూ ఒక లేఖను కూడా రాశాడు. ప్రభుత్వ పెట్టుబడులకే పరిమితం గాకుండా ప్రయివేటు పెట్టుబడుల మీద ఆంక్షలు విధించాలని కోరాడు. చైనా మిలిటరీ కంపెనీ లకు మన పెట్టుబడులు తరలటం అంటే మన నాశనానికి మనమే సహకరించినట్లు అవుతుందన్నాడు. చైనా బాండ్లు, కంపెనీల వాటాల్లో 1.1లక్షల కోట్ల డాలర్లు, ప్రైవేటు పెట్టుబడిదారులు 200బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టినట్లు పేర్కొన్నారు. దీనిలో ఎక్కువ భాగం చైనా మిలిటరీతో సంబంధాలున్న కంపెనీలలో ఉందని ఆరోపించాడు. తైవాన్ విలీనం షీ జిన్‌పింగ్ జీవిత లక్ష్యమని అందుకుగాను సన్నాహాలకు గాను అవసరమైన సమాచారం మొత్తాన్ని సేకరిస్తున్నారన్నాడు. దాన్ని ఎదుర్కొనేందుకు ఇండో పసిఫిక్ ప్రాంతానికి తరలించేందుకు అవసరమైన మిలిటరీ, పరికరాలను సమీకరించే మన సామర్ధ్యాన్ని దెబ్బ తీసేందుకు చైనా చూస్తున్నదని, చైనాతో ఘర్షణకు దిగాల్సి వస్తే మనం భూమ్యాకాశాలను కదిలించాల్సి ఉంటుందని, ఎంతో వినాశకరంగా ఉంటుందని అన్నాడు. అమెరికా నిషేధిత జాబితాలో ఉంచిన చైనా కంపెనీల్లో పెట్టుబడులు ఎందుకు పెట్టారంటూ బ్లాక్ రాక్, ఎంఎస్‌సిఐ కంపెనీలకు సెలెక్ట్ కమిటీ అడిగిన సంజాయిషీకి తాము చట్ట ప్రకారమే తమ వాణిజ్య పద్ధతుల్లో భాగంగానే పెట్టుబడులు పెట్టినట్లు ఆ కంపెనీలు చెప్పాయి.

ఇలా సాగిన విశ్లేషణలు, పార్లమెంటరీ కమిటీ చైనా మీద చేసిన విచారణ అంతా అమెరికా ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలకు, రాజకీయంగా ప్రపంచంలో తింటున్న ఎదురుదెబ్బలకు కారణం చైనా అని తమ జనాన్ని నమ్మించేందుకు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు ముందుకు తెచ్చిన కొత్త ప్రచార ఎత్తుగడ. గతంలో సోవియట్ యూనియన్ ఉన్నపుడు దానితో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవు. కమ్యూనిజం విస్తరణను అడ్డుకొనే పేరుతో ప్రచ్ఛన్న పోరు పేరుతో సాగించిన ప్రత్యక్ష ప్రచార దాడిలో భాగంగా సోషలిజం, కమ్యూనిజం వ్యతిరేకతను రెచ్చగొట్టారు. ఆ పోరులో విజయం సాధించినట్టు మూడు దశాబ్దాల క్రితం స్వయంగా ప్రకటించుకున్నారు. మరోవైపు చైనాలో పెట్టుబడులు పెట్టడంతో పాటు అక్కడి నుంచి భారీ ఎత్తున సరుకులు దిగుమతి చేసుకున్నది. దాంతో అనేక మంది చైనా తమ ఉపాధిని హరించిందనే ప్రచారాన్ని అమెరికాలో పెద్దఎత్తున ప్రారంభించారు. అది అనేకమంది యువతలో సైద్ధాంతిక మదనాన్ని పెంచింది. సోషలిజమే మెరుగైనది, పెట్టుబడిదారీ విధానం విఫలమైందనే భావనలు పెరుగుతున్నాయి. అందువల్ల పాతబడిన కమ్యూనిస్టు వ్యతిరేక అస్త్రాన్ని ప్రధానంగా ప్రయోగిస్తే దశాబ్దాల తరబడి ఆ కమ్యూనిస్టు చైనాలో ఎందుకు పెట్టుబడులు పెట్టారు, ప్రతి వస్తువును అక్కడి నుంచి ఎందుకు దిగుమతులు చేసుకున్నారు, ఇప్పటికీ ఎందుకు కొనసాగిస్తున్నారు, చైనాతో తెగతెంపులు చేసుకోవటం లేదని ఎందుకు ప్రకటిస్తున్నారు అన్న ప్రశ్నలకు అమెరికా విధాన నిర్ణతల దగ్గర సమాధానం లేదు. అందుకే మనలను దెబ్బతీసేందుకు మన పెట్టుబడిదారీ వ్యవస్థనే చైనా అస్త్రంగా మార్చు కున్నదనే తర్కానికి నిలవని ప్రచారానికి పూనుకున్నారు. ఒకటి వాస్తవం, ఏ విధంగా చూసినా నేటి చైనా నాటి సోవియట్ కాదు. ఆర్థికంగా త్వరలో అమెరికాను అధిగమించనుంది. ప్రపంచీకరణ భావన, స్వేచ్ఛా మార్కెట్‌ను ముందుకు తెచ్చింది అమెరికా తప్ప చైనా కాదు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని చైనా లబ్ధిపొందిన మాట వాస్తవం. దివాలా కోరు విధానాలతో అమెరికా పెట్టుబడిదారీ విధానం విఫలబాటలో ఉంది.

అమెరికా స్కూళ్లలో పెద్ద ఎత్తున ప్రవేశిస్తున్న చైనా వాటిని కమ్యూనిస్టు ప్రచారానికి అడ్డాలుగా మారుస్తున్నదని విద్యా పరిరక్షక తలిదండ్రుల కమిటీ(పిడిఇ) పేరుతో ఉన్న సంస్థ తాజాగా ఒక నివేదికలో ఆరోపించింది.

> కమ్యూనిజం విస్తరణను అడ్డుకొనే పేరుతో ప్రచ్ఛన్న పోరు పేరుతో సాగించిన ప్రత్యక్ష ప్రచార దాడిలో భాగంగా సోషలిజం, కమ్యూనిజం వ్యతిరేకతను రెచ్చగొట్టారు. ఆ పోరులో విజయం సాధించినట్టు మూడు దశాబ్దాల క్రితం స్వయంగా ప్రకటించుకున్నారు. మరోవైపు చైనాలో పెట్టుబడులు పెట్టడంతో పాటు అక్కడి నుంచి భారీ ఎత్తున సరుకులు దిగుమతి చేసుకున్నది. దాంతో అనేక మంది చైనా తమ ఉపాధిని హరించిందనే ప్రచారాన్ని అమెరికాలో పెద్ద ఎత్తున ప్రారంభించారు. అది అనేక మంది యువతలో సైద్ధాంతిక మదనాన్ని పెంచింది. సోషలిజమే మెరుగైనది, పెట్టుబడిదారీ విధానం విఫలమైంది అనే భావనలు పెరుగుతున్నాయి.

అమెరికాలో స్కూళ్లు పన్నెండవ తరగతి (మన దగ్గర ఇంటర్ మీడియెట్) వరకు బోధిస్తాయి. తమ దేశ తత్వవేత్త కన్ఫ్యూసియస్ పేరుతో వందకు పైగా కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో తరగతులను నిర్వహించేందుకు అమెరికా ప్రభుత్వ అనుమతుల మేరకే చైనా ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నది. నిజానికి అక్కడి సంస్థల సంఖ్యతో పోలిస్తే అసలు లెక్కలోకి రావు. ఈ పేరుతో అమెరికా సాంకేతిక పరిజ్ఞానాన్ని తస్కరించేందుకు, తమకు ఏజంట్లుగా పనిచేసే వారిని ఎంచుకొనే కేంద్రాలుగా మార్చుతున్నదంటూ ఆరోపిస్తూ ఇటీవల అమెరికా ఎఫ్‌బిఐ ఒక నివేదికను వెల్లడించింది.

ఇతర దేశాలతో ఉన్న సంబంధాలను మెరుగు పరచుకొనేందుకు గాను ప్రతి దేశం అనేక చర్యలను తీసుకోవటం తెలిసిందే. అమెరికా స్కూళ్లలోని టీచర్లు, విద్యార్థులతో చైనా వారు సంబంధాలు పెట్టుకుంటూ చైనా భాష, సాంస్కృతిక సంబంధాలు, విద్యార్థి బృందాల మార్పిడి పేరుతో గూఢచర్యానికి పాల్పడుతున్నట్లు పిడిఇ "లిటిల్ రెడ్ క్లాస్ రూమ్స్" పేరుతో విడుదల చేసిన ఒక నివేదికలో ఆరోపించింది. ఇలాంటి స్కూళ్లు, కాలేజీలన్నీ అమెరికాలోని 20 మిలిటరీ కేంద్రాల చుట్టూ ఉన్నట్లు మరొక కథనాన్ని దానిలో పేర్కొన్నారు. నిజానికి ఇవేవీ అమెరికా ప్రభుత్వానికి తెలియకుండా జరిగే అవకాశం లేదు.ప్రపంచంలో ఏ మూలన చీమ చిటుక్కుమన్నా పసిగట్టే శక్తి ఉన్న అమెరికా సిఐఎ, ఎఫ్‌బిఐ, ఎన్‌ఐఎ వంటి సంస్థలకు వేళ్ల మీద లెక్కించదగిన ఆ సంస్థల్లోని కేంద్రాలను మూసి వేయించటం పెద్ద కష్టమేమీ కాదు. ఒక వేళ నిజమే అనుకుంటే ఆ పని చేయకుండా వాటిని అనుమతిస్తూనే మరో వైపు అనుమానాలు రేకెత్తించే ప్రచారానికి అవి తెరలేపుతున్నాయి. అలాంటి కేంద్రాలన్నీ గూఢచర్యానికి పాల్పడుతుంటే, అది వాస్తవమనుకుంటే అమెరికా సర్కార్ లేదా అక్కడి సంస్థలు మన దేశంతో సహా అనేక చోట్ల విద్యా సంస్థలతో సంబంధాలు, అధ్యయన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి, వారాలు, నెలల తరబడి మన వారిని అమెరికా ఆహ్వానిస్తున్నాయి. వాటన్నింటినీ సిఐఎ గూఢచార కేంద్రాలుగా పరిగణించాలా ?


## మణిపూర్ మారణకాండ-మరోకోణం

ఇప్పుడు మణిపూర్ అంటే అలలు, అలలుగా... బారులు తీరి ఉండే కొండలు... పచ్చపచ్చని పంట పొలాలు... అడవులు... లోయలు, అంతెత్తు నుంచి జాలువారే జలపాతాలు... నింగిని తనలో నింపుకున్నట్లు ఉండే నీలినీలి సరస్సులు కాదు. ఇప్పుడు మణిపూర్ అంటే... రగులుతున్న రావణకాష్టం! ఇప్పుడు ఇక్కడి గాలి వేడిని నింపుకొని వీస్తుంది. ఇచ్చటి నీరు ఎర్రటి రక్తాన్ని స్రవిస్తుంది. ఇచ్చటి నేల మహిళల కన్నీటితో తడిసి ముద్దయింది. ఇలా ఇంకా రాయాలని ఉంది. కాని కలం కన్నీరు స్రవిస్తు ఉంది.బహుశా చాలా అరుదుగా ఇటువంటి స్థితి రచయితలకు వస్తుందేమో! అయినా ఈ ఘోరకలి ప్రపంచానికి తెలియజేయాలనే తపనే ఇలా రాయించింది.

మనువాదం ఉన్న చోట మానవత్వం ఉండదని మణిపూర్‌ను చూస్తే ఎవరికైనా అర్థమవుతుంది. 1990లో నూతన ఆర్థిక విధానాలు అమలు మొదలైనప్పటి నుంచి దేశంలో జరుగుతున్న పరిణామాలు నిశితంగా పరిశీలిస్తే ఆర్థిక దోపిడీకి మతం ముసుగు తొడిగి కలసిమెలసి జీవిస్తున్న ప్రజల మధ్య విద్వేషాలు రగిలించిన కారణంగా అనేక హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయి. గత మూడు నెలలుగా మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండ అంతా ఇంతా కాదు. రెండు జాతుల మధ్య పరస్పర విధ్వంసం, జాతి వైరం తారా స్థాయికి చేరుకుంది. ఎల్లెడలా సైన్యం విస్తరించినా ఏమీ చేయలేని పరిస్థితి. మెజార్టీ మెయితీ అల్లరి మూకలు అత్యాధునిక ఆయుధాలతో ఊచకోతలు కోస్తున్నారు. వారి చేతుల్లోకి ఈ ఆయుధాలు ఎలా వచ్చాయి.? ఇంకా ఎన్నో, ఎన్నెన్నో అమానవీయ సంఘటనలు ప్రతిరోజూ జరుగుతూనే ఉన్నాయి. ఇంతఘోరకలి జరుగుతున్నా భాద్యతగల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 'నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. ఇద్దరు అమాయక యువతులను బట్టలు లేకుండా రెండు కిలో మీటర్లు నడిపించి, సామూహికంగా అత్యాచారం చేసి చంపేశారు. రక్షించబోయిన సోదరుడు, తండ్రిని ప్రాణాలు పోయేలా కొట్టారు. మే 4వ తేదీన జరిగిన ఈ సంఘటనకు సంబంధించిని విడియో ఆలశ్యంగా వైరల్ అవడడంతో దేశం నివ్వెరపోయింది. ఇప్పటి వరకు మౌనముద్రలో ఉన్న ప్రధాని మోడి మొసలి కన్నీరు కార్చగా, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్ ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇలాంటి సంఘటనలు వందలు జరిగాయని, అందుకే రాష్ట్రంలో ఇంటర్నెట్ సేవలు నిలిపి వేశామని చెప్పడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

ఆదివాసి మహిళ అయిన దేశాధినేత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ సంఘటనపై నోరు మెదపకపోవడం దేన్ని సూచిస్తుంది? ఇదేనేమో మోడీ డబుల్ ఇంజన్ సర్కార్ పనితీరు. చివరకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని 'మీకు చేతకాకపోతే మేమే సమస్యను పరిష్కరిస్తామని 'ప్రభుత్వాన్ని హెచ్చరించిందంటే బీజేపీ పాలన ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక అసలు విషయానికి వస్తే మెయితీలకు ఎస్టీ హోదా కల్పించి కుకీల అటవీ భూములను మెయితీలకు కట్టబెట్టి ఇలా అటవీ ప్రాంతంపై ఆధిపత్యం కల్పించటం ద్వారా సామ్రాజ్యవాద బడా పెట్టుబడిదారులకు, అటవీ సంపదను దోచి పెట్టడం పాలకుల అసలు వ్యూహంగా ఉంది. అందుకే ఈ మారణకాండ. సువిశాలమైన సాంస్కృతిక వైవిధ్యం, భిన్నత్వం కలిగి కలిసిమెలిసి జీవిస్తున్న ప్రజల మధ్య విద్వేషం రగిలించటం ఇందులో భాగంగా చూడాలి. నేడు దేశం మొత్తం ఈ పరిస్థితి ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా మణిపూర్ లో గనులు, విలువైన ఖనిజ సంపద కోసం అన్వేషణ మొదలైంది. ప్రభుత్వ రంగ సంస్థ జీఎస్‌ఐ పెద్ద ఎత్తున సర్వేలు చేపట్టింది. ఈ సర్వేలలో ఆదివాసిలు నివసించే అటవీ ప్రాంతంలో ప్రపంచంలోనే అత్యంత విలువైన, అరుదైన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని గుర్తించారు. విలువైన ఆకుపచ్చ గ్రానెట్, ప్లాటినం గ్రూప్ మెటల్స్, ఎలిమెంట్స్, నికెల్, నోమైట్, కాపర్, బొగ్గు, పెట్రోలియం, సిమెంట పరిశ్రమకు అవసరమైన సున్నపురాయి లాంటి విలువైన నిక్షేపాలు గుర్తించారు.

ఈ నిక్షేపాల అప్పగింతలపై మణిపూర్ ప్రభుత్వం 2017లో 39 కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందం చేసుకుంది. అయితే ఆదివాసి ప్రజలు నివసించే అటవీ, కొండ ప్రాంతాలలో వారికి కొన్ని రాజ్యాంగ, చట్టపరమైన హక్కులు ఉన్నాయి కాబట్టి అక్కడ మైనింగ్ దోపిడీకి సాధ్యం కాదు. ఇది బహుళజాతి కంపెనీలకు అడ్డంకిగా ఉంది. ఇందులోభాగమే అటవీ సంరక్షణ చట్టాల మార్పు చేయడం, హింసాత్మకంగా ఆదివాసిలను బలవంతంగా అడవుల నుంచి గెంటి వేయడం, మారణకాండలు సృష్టించడం, వీరిపై మాదక ద్రవ్యాల స్మగర్లుగా, చట్టవిరుద్ధ కాందిశీకులుగా బురద జల్లడం జరుగుతున్నాయి. పైకి మణిపూర్ మారణకాండ రిజర్వేషన్ల జాతుల వైరంగా కనిపిస్తున్న ప్పటికి వాస్తవంలో అది అటవీ, ఖనిజసంపద మొత్తం బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టడమే అసలు లక్ష్యం. ప్రజలు వాస్తవాలను గుర్తించి దేశాన్ని విభజించి పాలిస్తున్న మతోన్మాద, పాసిస్టు పాలక మూకల నుండి కాపాడుకోవాలి. మణిపూర్ ఆదివాసి ప్రజలకు అండగా నిలబడాలి.



- షేక్ కరిముల్లా,
సెల్: 9705450705

# ఓపీఎస్ పునరుద్ధరణ: రాష్ట్రాలపై భారమా? నిజమెంత!

బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం నిర్ణయాన్ని ధిక్కరించి, నూతన పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి తమ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని తిరిగి అమలు చేస్తామని ప్రచారాన్ని మొదలుపెట్టాయి. న్యూ పెన్షన్ స్కీమ్‌కు వ్యతిరేకంగా అనేక పోరాటాలు ఊపందుకున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త పెన్షన్ స్కీము నుండి పాత పెన్షన్ విధానానికి మారడానికి నిర్ణయాలు చేసి అమలు కూడా చేస్తున్నాయి. నూతన పెన్షన్ స్కీమ్ అంగీకారయోగ్యం కాదని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని రాజస్థాన్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్‌లలోని బీజేపీయేతర పార్టీ ప్రభుత్వాలు నిర్ణయించుకున్నాయి. ఈ పార్టీలు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని, ఆయా రాష్ట్రాల ఎన్నికల్లో వాగ్దానాలు చేసి ప్రస్తుతం అమలు కోసం ప్రకటించాయి. కేంద్రం మాత్రం నూతన పెన్షన్ విధానం అమలుకు తన నిబద్ధతను తెలియజేస్తూ పార్లమెంటులో ప్రకటించింది. పాత పెన్షన్ విధానానికి తిరిగి రివర్షన్‌కు ఎంచుకునే రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సంక్షోభానికి దారి తీస్తాయని కేంద్ర ప్రభుత్వ అనుకూల ఆర్థిక వేత్తలు, అనుకూల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రచారం చేస్తున్నవి. అంతేకాక, ఉద్యోగుల ఓట్లు సంపాదించుకోడానికి ఆయా పార్టీలు ఎంచుకున్న ఎత్తుగడగా కూడా అభివర్ణిస్తున్నవి.



ఎస్‌ఎస్‌ఆర్‌ఎ ప్రసాద్
9490300867

పాత పెన్షన్ విధానం కింద సభ్యులుగా వున్నవారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన రెగ్యులర్ ఉద్యోగులు 2004కు ముందు సర్వీసులో వున్నప్పుడు ఎటువంటి తన వాటా షేర్‌ను చెల్లించకుండానే పదవీ విరమణ తదుపరి, చివరగా తీసుకున్న వేతనంలో సగానికి సగం పెన్షన్ పొందుతారు. దీనిని నిర్దిష్ట పెన్షన్ ప్రయోజన పథకం అంటారు. అంతేకాక, పదవీ విరమణ తదుపరి, ఆ కుటుంబానికి సామాజిక భద్రత కల్పిస్తుంది. పదవీ విరమణ తరువాత, ధరల పెరుగుదలకు అనుగుణంగా కరువు భత్యం రిలీఫ్‌ను, పెన్షన్‌పై నిష్పత్తిగా చెల్లిస్తారు. ఇదే విధంగా సర్వీసులో ఉన్నప్పుడు కూడా కరువు భత్యం పేరుతో మూల వేతనంపై నిష్పత్తిగా ఇస్తారు. ప్రజలకు సేవ అందించే ఉద్యోగులకు విరమణ తరువాత వారి సామాజిక భద్రతకు భరోసా ఇచ్చే అవసరమైన నిర్వచించబడిన నిర్దిష్టమైన ప్రయోజనం సమకూర్చు పథకం అని అర్థం. నూతన పెన్షన్ బిల్లు పథకం రూపకల్పన అంటే, పథకం ప్రయోజనాలను అందించే సంస్థల పెన్షన్ బిల్లు, ఉద్యోగుల వేతనాల నుండి 10శాతం వాటా నిధులను ప్రభుత్వం తరపు నుంచి 14శాతం వాటా నిధులను సమకూరుస్తుంది.ఈ నూతన పెన్షన్ పథకాన్ని అమలుచేయుటకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత, భారతదేశంలోనే కాకుండా, అనేక ఇతర దేశాలలోనూ ఇలాంటి పథకాలు అమలులో వున్నాయి.

ప్రజలకు సేవలందించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కాకుండా, ఇతర సంస్థలలో 20 లేదా అంతకంటే ఎక్కువ మంది. కార్మికులు పనిచేసే సంస్థలలో తప్పనిసరిగా పదవీ విరమణ పొదుపు పథకం వర్తిస్తుంది. అటువంటి సంస్థలలో ఉద్యోగి అతని లేక ఆమె జీతంలో 10 శాతం వాటాను ఈ పథకానికి అందించవలసి వుంటుంది. ఈ పథకానికి యజమాని నుండి కూడా సహకారం అందించబడుతుంది. ఈ సేకరించబడిన సొమ్ము మొత్తాన్ని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థచే నిర్వహించబడుతుంది. పదవీ విరమణ తరువాత, ఉద్యోగి ఏకమొత్తం చెల్లింపునకు అర్హులు. మిగిలిన భాగాన్ని యాన్యుటీ చెల్లింపు పథకాలలో పెట్టు బడి పెట్టగా వచ్చిన దానిని పెన్షన్‌గా చెల్లిస్తారు. అనేకమంది కార్మికులు చిన్న అనధికారిక, ప్రయివేటురంగ యూనిట్లలో లేదా స్వయం ఉపాధి పొందుతున్న చాలామంది. కార్మికులు కూడా ఈ పథకం నుండి దూరంగా వున్నారంటే ఆశ్చర్యం కాదు. వారు ఇకపై పని చేయలేనప్పుడు, పొదుపు చేయడానికి. తగినంత సంపాదించలేని వారికి అందించడానికి అధికారిక సామాజిక రక్షణ పథకాలలో కొన్ని అధికారికంగా నిర్వచించబడిన దారిద్ర్యరేఖకు దిగువన వున్న వారికి కంట్రిబ్యూషన్ లేకుండానే పెన్షన్‌ను చెల్లిస్తున్నారు. ఈ పథకంలో పెన్షన్ రూపంలో చెల్లించేది. చాలా అల్పమయినదే.



ప్రస్తుత వైరుధ్యం పాత పెన్షన్ పథకాన్ని తిరిగి అమలు గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే పథకాలకు సంబంధించినది. పాత పెన్షన్ పథకాన్ని రద్దుచేసి, నూతన పెన్షన్ పథకంతో భర్తీ చేయాలనే నిర్ణయం, పాత పెన్షన్ పథకం ఆర్థికంగా నిలకడగా లేనందున సమర్థించబడుతోంది అనే వాదన కూడా వుంది. ప్రభుత్వ ఉద్యోగుల జీవితకాలం పెరగడం, ధరల పెరుగుదల ఆధారంగా హామీ ఇవ్వబడిన కరువు భత్యంతో పెన్షన్‌లో పెరుగుదల ఫలితంగా, ప్రతి వ్యక్తి పెన్షన్ సొమ్ము పెరిగింది. కారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెన్షన్ బిల్లులో పెరుగుదల ఏర్పడింది. మరొకవైపు ఆదాయాలు తగినంతగా పెరగడం లేదు. కారణం ఆర్థికలోటు జీడిపిలో రుణాల స్థాయి పెరగకుండా ఉండాలంటే, సామాజికంగా వ్యయంతో (పెన్షన్ తదితర వ్యయాలు) సహా ఇతర వ్యయాలను తగ్గించవలసి వుంటుంది. ఈ వాదన రెండు స్పష్టమైన ప్రశ్నలకు దారితీస్తుంది. ముందుగా పెన్షన్ బిల్లులో పెరుగుదలకనుగుణంగా ఆదాయాలు ఎందుకు లేవు? రెండవది లోటు, రుణం స్థాయిని ఏది నిర్ణయిస్తుంది? ఈ ప్రశ్నలకు సమాధానాలు కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వానికి భిన్నంగా వున్నాయి..

కేంద్రం విషయానికొస్తే, నయా ఉదారవాద విధానాల అమలు వల్ల ఆర్థికంగా పతనం చెంది ఆదాయ వృద్ధి లేకుండా వుంది. ఇది అభివృద్ధికి దారి తీస్తుందని అంచనా వేసి ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించబడానికి కేంద్ర ప్రభుత్వం అవలంబించిన పన్ను విధానమే! ఉదాహరణకు 2019-20లో లాభదాయకమైన సంస్థలపై పన్ను రేటు కేవలం 22.5 శాతం ఉందని ఒక సర్వే చెబుతోంది. అయితే కేవలం రూ.10 కోట్ల కంటే ఎక్కువ ఆదాయం వున్న కంపెనీలకు అవసరమైన చట్టబద్ధమైన రేటు (మినహాయింపులు, రాయితీలు లేకుండా) 34 శాతంగా వుంది. నయా ఉదారవాదం అంటే, ఆర్థిక మూలధనాన్ని తగ్గించాల్సిన అవసరం వున్నందున, ద్రవ్య లోటును తప్పనిసరిగా పూడ్చాలి. ఈ లోటు, ఆర్థిక వ్యయం రాష్ట్ర ప్రయోజనాలకు హానికరంగా పరిగణించింది. తద్వారా మొత్తం వ్యయం పెరుగుదలపై పరిమితిని నిర్దేశిస్తుంది. ఈ పరిమితి, పెన్షన్ బిల్లు పెరిగే రేటు కంటే తగ్గితే, పన్ను రాబడిని పెంచాలి. లేదా ఇతర ఖర్చులను తగ్గించవలసి వుంటుంది. ప్రయివేటు లాభదాయకతను ప్రోత్సహించే నయా ఉదారవాద నిబద్ధత కారణంగా పన్నురాబడిలో పెరుగుదల విస్మరించబడింది. కాబట్టి సర్దు బాటును నిర్ధారించడానికి, ఖర్చులను తగ్గించాల్సి వుంటుంది. కాని వారసత్వంగా వచ్చిన వ్యయకట్టుబాట్లను బట్టి ఆర్థిక సంక్షోభ ఫలితంగా కేంద్రం స్వచ్ఛందంగా కార్పొరేట్ రంగానికి, పన్ను రాయితీలను అందించి, దాని ఆర్థికలోటును నియంత్రించడానికి ఎంచుకున్నట్టే, 2004లో స్వచ్ఛందంగా, పాత పెన్షన్ విధానాన్ని ఉపసంహరణను ఎంచుకుంది.

నయా ఉదారవాదం, ఆర్థికంగా రాష్ట్రాలు బలహీనపడటం, సంక్షోభానికి కారణమని వాస్తవ పరిస్థితి నుండి దష్టిని మరల్చడానికి పాత పెన్షన్ పథకాన్ని వదిలివేయబడుతున్న సంక్షోభానికి ప్రతిస్పందనగా, కేంద్ర ప్రభుత్వం మరియు నయా ఉదారవాదం న్యాయ నిర్ణేతలు నూతన పెన్షన్ పథకంను విజయవంతమైన పరిష్కారంగా నిర్వచించారు. నూతన పెన్షన్ పథకం కింద 2004 తరువాత ఉద్యోగంలో నియమించబడిన ప్రభుత్వ ఉద్యోగులు తమ వేతనంలో 10శాతం వాటాను నిధికి విరాళంగా అందిస్తారు. ప్రభుత్వం 14శాతం వాటాను నిధికి సహకారాన్ని అందిస్తుంది. పేరుకుపోయిన మొత్తాలను స్వతంత్ర పెన్షన్ ఫండ్ మేనేజర్లు వారి సేవలకు చెల్లించే నిధులతో పెట్టుబడి పెడతారు, ఉద్యోగులు పదవీ విరమణ చేసినప్పుడు వారు కార్పస్ ఫండ్‌లో గరిష్టంగా 60శాతం మొత్తాన్ని తీసుకొని మిగిలిన మొత్తాన్ని యాన్యుటీ స్కీమ్‌లో పెట్టుబడి

> ఉద్యోగులు, కార్మికులు పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు చేసే ఉద్యమంతో పాటు కేంద్ర ప్రభుత్వం, వారి అనుకూల మీడియా వారి ఆర్థికవేత్తలు చేసే తప్పుడు వాదనలో (అనగా పాత పెన్షన్ విధానం అమలు వలన ప్రభుత్వాలు అధిక ఆర్థిక భారాలు మోస్తున్నవి అనే వాదనలు) ఎంత మాత్రం వాస్తవం లేదని ప్రచార యుద్ధాన్ని కూడా జత చేసి పోరాటం నిర్వహించాల్సిన అవసరం ఉన్నది. అంతేగాక పాత పెన్షన్ పునరుద్ధరణ ఉద్యమంలో ఐక్యతను పటిష్టంగా నిర్మాణం చేసి దేశవ్యాపిత ఐక్య పోరాటాలకు కృషిచేయాలి.

పెడతారు. దాని నుండి వచ్చే రాబడి నుండి పెన్షన్ చెల్లిస్తారు. ఈ పథకం ప్రభుత్వ ఉద్యోగులకు తప్పనిసరి, కాని ఇతర ప్రయివేటురంగ యజమానులు వారి ఉద్యోగులు కూడా ఈ పథకంలో చేరడానికి అర్హులు.

పెన్షన్ అందించే కార్పస్ ఫండ్‌ను రూపొందించడంలో ఉద్యోగి, సహకరిస్తున్నప్పటికీ, ప్రభుత్వం ఇప్పటికే వాటాను అందజేసే, వృత్తిపరమైన ఫండ్ మేనేజరుల ద్వారా ఆ నిధుల నిర్వహణ, ఉద్యోగులకు పదవీ విరమణ సమయంలో తరువాత పొందిన మొత్తాలను సమీకరించింది. కానీ ఫండ్ మేనేజరు ద్వారా కార్పస్ ఫండ్ ఎంత బాగా నిర్వహించబడుతుందనే దానిపై పెన్షన్ చెల్లింపు ఆధారపడి వుంటుంది. 2008 ఆర్థిక సంక్షోభం సమయంలో అమెరికన్ పెన్షనర్లకు జరిగినట్లుగా మార్కెట్ ఆశించిన రాబడిని అందించకపోవచ్చు లేదా కుప్పకూలడం సంభవించినప్పుడు పొదుపులో ఎక్కువ భాగాన్ని కూడా తుడిచివేయవచ్చు. అంతేకాకుండా, ఎలాంటి ఫలితం వచ్చినా రుసుమును స్వీకరించే ప్రొఫెషనల్ ఫండు మేనేజరు. ఊహించనంత తెలివిగా ఉండకపోవచ్చు. ఈ స్కీము గ్యారంటీ లేనిది. బెనిఫిట్ లేనిది. నిర్వచించబడిన సహకారం లేదు. ఈ నష్టాలు ముఖ్యమైనవి. ఇది పాత పెన్షన్ పథకం కంటే నూతన పెన్షన్ పథకం వలన చాలా తక్కువ ఫలితం ఉంటుంది. అని అనేక ఉదాహరణలను ఉటంకించవచ్చు.

ఉద్యోగులు, కార్మికులు పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు చేసే ఉద్యమంతో పాటు కేంద్ర ప్రభుత్వం, వారి అనుకూల మీడియా వారి ఆర్థికవేత్తలు చేసే తప్పుడు వాదనలో (అనగా పాత పెన్షన్ విధానం అమలు వల్ల ప్రభుత్వాలు అధిక ఆర్థిక భారాలు మోస్తున్నవి అనే వాదనలు) ఎంత మాత్రం వాస్తవం లేదని ప్రచార యుద్ధాన్ని కూడా జతచేసి పోరాటం నిర్వహించాల్సిన అవసరం ఉన్నది. అంతేగాక పాత పెన్షన్ పునరుద్ధరణ ఉద్యమంలో ఐక్యతను పటిష్టంగా నిర్మాణం చేసి దేశవ్యాపిత ఐక్య పోరాటాలకు కృషిచేయాలి. ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో విడివిడిగా జరుగుతున్న పోరాటాలు దేశవ్యాప్త పోరాటాలుగా రూపాంతరం చెందే విధంగా కృషి చేసి విజయం సాధించేవరకూ పోరాడాలి. అదే కార్మికవర్గం ముందున్న ప్రస్తుత, ప్రధాన కర్తవ్యం కావాలి.

# రేషన్ డీలర్లకు తీపికబురు

**మెట్రిక్ టన్ను బియ్యానికి రూ.900 నుంచి రూ.1400కు కమీషన్ పెంపు**

**రేషన్‌డీలర్లకు సర్కారు తీపికబురును అందించింది. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రేషన్‌డీలర్ల సంఘం ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో వారి డిమాండ్ల పరిష్కారానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రధానంగా ఒక మెట్రిక్‌టన్ను బియ్యంపై రూ.900 నుంచి రూ.1400 కమీషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం ఒప్పుకుంది. ఈ నిర్ణయంతో అరకొర కమీషన్‌తో నెట్టుకొస్తున్న డీలర్లకు ఊరట కలిగించినట్టయింది. మరోవైపు వేబ్రిడ్జిల ఏర్పాటు, బియ్యం దిగుమతి కోసం హమామలీల ఖర్చు, వే బ్రిడ్జిల ఏర్పాటు, డీలర్లకు బీమా కల్పిస్తూ, వారి దుకాణ రెన్యువల్ గడువు 5ఏండ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 1949 మంది రేషన్‌దుకాణదారులకు లబ్దిచేకూరనుంది.**

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1949 మంది డీలర్లకు లబ్ది
- కరోనాలో చనిపోయిన డీలర్ల వారసులకూ షాపుల కేటాయింపు
- వేబ్రిడ్జిల ఏర్పాటు, డీలర్లకు బీమా, రెన్యువల్‌గడువు 5ఏండ్లకు పెంపు
- ఎన్నికల వేళ డీలర్ల 13 డిమాండ్ల పరిష్కారానికి సర్కారు గ్రీన్‌సిగ్నల్
- ఆనందంలో డీలర్లు.. ప్రభుత్వం నిర్ణయం పట్ల హర్షాతిరేకాలు

జాతీయ ఆహారభద్రత చట్టం 2015 అమలులోకి రాకముందు కిలోకు 20పైసల చొప్పున క్వింటాల్‌కు రూ.20వరకు డీలర్లకు కమీషన్ రూపంలో ఆదాయం వచ్చేది. అయితే చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి ఆ మొత్తం రూ.70కి పెరిగింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.35, రాష్ట్ర ప్రభుత్వం రూ.35 చొప్పున చెల్లిస్తూ వచ్చింది. మొత్తంగా రాష్ట్రం ఏర్పడే నాటికి ఒక్కో మెట్రిక్‌టన్ను బియ్యంపై రూ.200మేర కమీషన్ డీలర్లకు మిగిలేది. మధ్యలో తెలంగాణ ప్రభుత్వం ఆ మొత్తాన్ని మెట్రిక్‌టన్నుపై రూ.700 పెంచి రూ.900 ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుని ఆమేరకు కమీషన్‌ను డీలర్ల ఖాతాలో జమ చేస్తోంది. పెరిగిన ధరలు, వచ్చే ఆదాయం సరిపోక, ప్రభుత్వం నుంచి ఇతర సౌకర్యాలు, సంక్షేమాల కోసం కొన్ని రోజులుగా డీలర్లు కొట్లాడుతూనే ఉన్నారు. రెన్నెళ్ల క్రితం ఏకంగా సమ్మెకు దిగారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం డీలర్ల సంఘం రాష్ట్ర ప్రతినిధులతో పలు దఫాలుగా చర్చించి మంగళవారం ఒక కొలిక్కి తీసుకొచ్చి పలు నిర్ణయాలు చేసింది. ఈ మేరకు మెట్రిక్ టన్నుపై రూ.1400 కమీషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది.



### 13డిమాండ్ల అంశాలకు పరిష్కారం

ప్రస్తుతం మెట్రిక్‌టన్నుపై ప్రభుత్వం ఇస్తున్న రూ.700 కమీషన్‌ను ఏక మొత్తంగా రెట్టింతలు పెంచుతూ రూ.1400 ఇచ్చేందుకు నిర్ణయం చేసింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో 30 క్వింటాళ్ల నుంచి 40 క్వింటాళ్ల వరకే విక్రయించే దుకాణదారులకు మాత్రం రూ.5వేల నుంచి రూ.10వేల మధ్యనే మిగిలే పరిస్థితి ఉంది. అయినప్పటికీ డీలర్లు తీసుకొచ్చిన పలు తమ సమస్యలు, డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని చర్చించిన అనంతరం 13 అంశాల పరిష్కారానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా కరోనా సమయంలో సేవలందిస్తూ మరణించిన 100మంది డీలర్ల వారసులకు కారుణ్య నియామకం కింద డీలర్‌షిప్ ఇవ్వడం, రైతుబీమా, నేతన్నబీమా, గౌడబీమా తరహాలోనే రేషన్ డీలర్లకు కూడా రూ.5లక్షల బీమా అమలు చేయనున్నట్టు ప్రకటించింది. ఆరోగ్యశ్రీ పరిధిలోకి ప్రతి డీలరునూ తీసుకురానున్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్ద కచ్చితమైన తూకం వేసేలా వేబ్రిడ్జిల ఏర్పాటు, డీలర్‌షిప్ రెన్యూవల్‌ను 5 ఏండ్ల కాలపరిమితికి పెంచడం, డీలర్ల వయోపరిబమితి 40ఏండ్ల నుంచి 50 ఏండ్లకు పెంచుతూ పలు నిర్ణయాలు చేసింది. అంత్యక్రియల నిర్వహణకు తక్షణ సాయం రూ.10 వేలు అందివ్వనుంది. బియ్యంఅమ్మకాల్లో వచ్చే తేడా 1.5 క్వింటాళ్ల పరిధిలోపు ఉంటే కేసుల పరిధిలోకి తీసుకోబోమని తెలిపింది. హైదరాబాద్‌లో రేషన్ భవన్ నిర్మాణానికి భూ కేటాయింపు సహా 13 అంశాలపై సానుకూలత వ్యక్తం చేసింది.

### ఉమ్మడి జిల్లాలో రేషన్‌దుకాణాలు లబ్ధిదారుల స్వరూపమిదీ...

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1949 రేషన్‌దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 9లక్షలా 79వేలా 987 రేషన్‌కార్డులు ఉండగా.. 28లక్షలా 22వేలా 314 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం బియ్యం కోటాను కేటాయిస్తోంది. ప్రతినెలా సుమారు 18వేల మెట్రిక్‌టన్నుల బియ్యం కేటాయిస్తుండగా.. అందులో సుమారు 70శాతం మేర లబ్ధిదారులు రేషన్‌దుకాణాల ద్వారా బియ్యం తీసుకుంటున్నారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే కరీంనగర్ జిల్లాలో 586 రేషన్ దుకాణాల పరిధిలో 2,78,411 రేషన్‌కార్డులు ఉండగా.. 8,11,211మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి జులైలో 5,180 మెట్రిక్‌టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం కేటాయించింది. పెద్దపల్లి జిల్లాలో 418 రేషన్ షాపుల పరిధిలో 2,19,953 కార్డులు ఉండగా.. అందులో 6,27,148మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి కూడా జులైలో 3,999 మెట్రిక్‌టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం అలాట్ చేసింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 353 రేషన్ దుకాణాల పరిధిలో 1,73,985 కార్డులకుగాను 4,98,523 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రభుత్వం జులైలో 3,258 మెట్రిక్‌టన్నుల బియ్యాన్ని కేటాయించింది. జగిత్యాల జిల్లాలో 592 రేషన్ దుకాణాల పరిధిలో 3,07,638 కార్డులకుగాను 8,85,432 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి జులైలో ప్రభుత్వం 5,604 మెట్రిక్‌టన్నుల బియ్యం పంపిణీ చేసింది.

### కమీషన్ పెంచడం హర్షణీయం



**- మహేశుని మల్లేశం, చొప్పదండి రేషన్ డీలర్**

ప్రభుత్వం కమీషన్ పెంచుతూ తీసుకున్న నిర్ణయం వల్ల మాకు ఊరట లభించింది. ప్రతి ఒక్క డీలర్‌కు క్వింటాల్‌పై రూ.90 నుంచిరూ.140వరకు కమీషన్ రానుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఏ చిన్న డీలర్‌కు అయినా కనీసం రూ.9వేల వరకు ఆదాయం వస్తుంది. అయితే గౌరవవేతనం ఇస్తేనే అందరికీ న్యాయం జరుగుతుంది.

### పెంచిన కమీషన్‌తో ఊరట



**- చామనపల్లి శ్రీనివాసరావు, కరీంనగర్ పట్టణ డీలర్**

ప్రభుత్వం పెంచి కమీషన్ డబ్బులతో మాకు కొంత ఊరట లభించినట్టయింది. కమీషన్‌తోపాటు ఇతర డిమాండ్లలో పలు అంశాలపై ప్రభుత్వం స్వాగతించడం హర్షణీయం. కమీషన్ డబ్బులు పెంచడంతోపాటు ప్రతి డీలర్‌కు కనీస గౌరవ వేతనం ఇస్తేనే అందరికీ న్యాయం జరుగుతుంది.

### ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తాం



**- రొడ్డ శ్రీనివాస్, రేషన్ డీలర్ల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు**

డీలర్లకు కమీషన్ పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. అయితే పెంచిన కమీషన్ గ్రామీణ ప్రాంత డీలర్లకు పెద్దగా మిగిలే పరిస్థితి లేదు. కొన్ని దుకాణాల్లో 30క్వింటాళ్ల నుంచి 40క్వింటాళ్లు మాత్రమే విక్రయించే డీలర్లు ఉన్నారు. అందరికీ న్యాయం జరగాలంటే గౌరవవేతనం ఇవ్వాల్సిందే!

# అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

**టిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత**

నవతెలంగాణ - కరీంనగర్



జిల్లా వ్యాప్తంగా అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ గోపికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కొమ్మెర తిరుపతి రెడ్డి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో జర్నలిస్టులు ముఖ్య భూమిక పోషించారని తెలిపారు. చాలా మంది జర్నలిస్టులు అద్దె భవనాల్లో నివసిస్తున్నారని తెలిపారు. గతంలోనే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంత్రి, జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశామన్నారు. ఇప్పటికైనా జర్నలిస్టు లను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాదె కరుణాకర్‌రావు, సంఘం సభ్యులు శంకర్ రెడ్డి, హరికష్ణ, నరేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# గడిచిన 9 ఏండ్లు... సంక్షేమానికి స్వర్ణయుగం

- సంక్షేమ పథకాలను నిరంతరాయంగా కొనసాగిస్తాం
- త్వరలోనే సిరిసిల్ల మెడికల్‌కాలేజీ ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- బతుకమ్మలోపు వేములవాడ గుడి పనులు పూర్తి
- ఏరియాస్పత్రికి నిధుల కొరత లేదు.. మూడుషిఫ్టుల్లో విధుల్లో ఉండాలి
- రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కే. తారక రామారావు
- వేములవాడలో మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయిన మంత్రి

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / వేములవాడ

సమాజంలో ఏ పేదవర్గాన్ని వదిలి పెట్టకుండా బాగు చేశామని, గడిచిన 9 ఏండ్లలో సంక్షేమానికి సర్ణయుగంలా మార్చామని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కే.తారక రామారావు అన్నారు. బీసీ, ఎంబీసీ, కులవత్తులకు రూ.లక్ష గ్రాంట్ 600 మందితో ఆగదని, వచ్చే నెల 600.. ఇలా ప్రతి నెలా ఆర్థిక సాయం అందిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంత్రి విస్తతస్థాయి పర్యటన చేశారు. ఎమ్మెల్యే రమేష్ బాబుతో కలిసి వేములవాడలో పలు అభివద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన అనంతరం సిరిసిల్ల సమీకత జిల్లా కార్యాలయాల సముదాయంలో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలలో బీసీ, ఎంబీసీ కులవత్తులకు ఒక లక్ష రూపాయల గ్రాంట్ రూపంలో 600 మంది లబ్ధిదారులకు బీసీ బంధు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదవాన్ని ఆదుకోవడానికి, కడుపులో పెట్టి చూసుకోవడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను తీసుకొచ్చిందన్నారు. దశల వారీగా ప్రతి ఒక్కరికి బీసీ బంధు అందుతుందన్నారు. కళ్యాణలక్ష్మి రూ.51 వేల నుండి రూ.లక్షా16వేలకు పెంచిన ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 12లక్షల మంది ఆడపిల్లల పెండ్లిండ్లకు అందించిందన్నారు. సర్కారు దవాఖానలో 70 శాతం ప్రసవాలు పెరిగాయని, త్వరలో సిరిసిల్లలో మెడికల్ కాలేజీ ముఖ్యమంత్రి ప్రారంభి ంచబోతున్నారని తెలిపారు. 150 మంది వైద్యులు నిరంతరం అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణా రాఘవ రెడ్డి, వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే రమేష్ బాబు, రాష్ట్ర పవర్ లూం, టెక్స్ టైల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ గూడూరి ప్రవీణ్, టెస్కాబ్ చైర్మెన్ కొండూరి రవీందర్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్ పర్సన్ లు జిందం కళా చక్రపాణి, రామతీర్థపు మాధవి , జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , జిల్లా అదనపు కలెక్టర్ లు బి సత్య ప్రసాద్, ఎన్ ఖీమ్యా నాయక్, జిల్లా బీసీ అభివద్ధి అధికారి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

**వేములవాడలో ప్రారంభించిన పలు అభివృద్ధి పనులు...**

వేములవాడ పట్టణంలోని నంది కమాన్ జంక్షన్‌ను ప్రారంభించిన మంత్రి అనంతరం వేములవాడ అర్బన్ మండలంలోని చింతల్‌ఠాణా ఆర్అండ్‌ఆర్ కాలనీలో 42మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పట్టాలను అందజేశారు. ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్, డీఈఐసీ సెంటర్, మాతసేవా కేంద్రాలను, ఆస్పత్రి ఆవరణలో బయోగ్యాస్ ప్లాంటును ప్రారంభిచారు. మూలవాగు బండ్ పార్క్, మహాలక్ష్మి అమ్మవారి ఆలయం సమీపంలో మిషన్ భగీరథను, మూల వాగు వద్ద అత్యాధునిక హంగులతో ఏర్పాటుచేసిన వాకింగ్ ట్రాక్‌ను, శ్యామకుంట జంక్షన్ వద్ద కూరగాయల మార్కెట్లను సందర్శించారు. వాటిని ప్రారంభించారు. ఆ వెంటనే గుడి చెరువు అభివద్ధి పనులకు, బద్ది పోచమ్మ ఆలయం అభివద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. భక్తుల సౌకర్యార్థం 100 గదుల కాంప్లెక్స్ నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. వేములవాడ ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందేలా ప్రజా ప్రతినిధులు పర్యవేక్షించాలన్నారు. పెండింగ్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.



బీసీ బంధు కింద నియోజకవర్గానికి చెక్కును ప్రదర్శిస్తున్న మంత్రి , ఎమ్మెల్యే

**వేములవాడలో మీడియాతో మాట్లాడని మంత్రి**

పలు అభివద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి వేములవాడ పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్ ఎక్కడ కూడా మీడియాతో మాట్లాడకపోవడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. దాదాపు 10 కార్యక్రమాల్లో పాల్గొన్న కేటీఆర్ మీడియాతో మాత్రం మాట్లాడలేదు. చివరి కార్యక్రమం మిషన్ భగీరథ ట్యాంక్ ప్రారంభం తరువాత మాట్లాడుతాడనుకుని మీడియా ప్రతినిధులందరూ అక్కడికి చేరుకున్నారు. అయితే మంత్రి మాత్రం ఏమీ మాట్లాడకుండా వెళ్లిపోయారు. పోతూపోతూ... 'చేసేదంత చేశాం. ఇంకా ఏమి మాట్లాడాలి. సిరిసిల్లలో పని ఉంది.' అంటూ వెళ్లిపోయారు. ఇప్పటికే అక్కడ స్థానిక ఎమ్మెల్యే రమేష్‌బాబుకు పోటీగా చలిమెడ లక్ష్మీనర్సింహారావు ఎంట్రీ ఇవ్వడం, సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి టిక్కెట్‌లో పోటీలో ఉండగా.. రూ.కోట్లాది డబ్బులతో చేపట్టిన అభివృద్ధి పనులు, పలుప్రారంభోత్సవాలుచేసిన మంత్రి కనీసం మాట్లాడకుండా వెళ్లిపోవడం పట్ల అక్కడి రాజనీయ అనిశ్చితిపై ఆంతర్యం ఏంటని చర్చించుకున్నారు.

## గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

**నవతెలంగాణ - హుజురాబాద్** : సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకొనేందుకు ఆర్థిక స్థోమతలేని పేదల కోసం 'గృహలక్ష్మి పథకం' కింద ఆర్థిక సాయం అందిస్తారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. హుజురాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం, మున్సిపాలిటీలో ఈ నెల 10వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని చెప్పారు. అర్హత గల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. లబ్దిదారులు జతపరచవలసినవి : ఆధార్ కార్డు, రేషన్ కార్డు, భూమి పత్రాలు, రెండు ఫొటోలు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**నవతెలంగాణ - హుజురాబాద్** : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏడవ వార్డులో ఆమె డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమములో వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, కమిషనర్ సల్వాది సమ్మయ్య, ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ యం.కిషన్‌రావు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలి

**వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాల కళాశాల చైర్మన్ బివిఆర్.గోపాల్‌రెడ్డి**



**నవతెలంగాణ - కరీంనగర్** : కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం ఓ ఫంక్షన్ హాల్లో వీడ్కోలు సమావేశం 'ఫిష్టా వ్యుషన్' పేరుతో అంగరంగ వైభవంగా జరిగింది. కళాశాల కరస్పాండెంట్ బివిఆర్.గోపాల్‌రెడ్డి, ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, విద్య నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. సామాజిక సేవ కార్యక్రమంలో పాల్గొని పదిమందికి ఉద్యోగం కల్పించాలని సూచించారు. క్రీడారంగంలో రాణించిన, ఐటి కంపెనీలో ఉద్యోగాలు సాధించిన, ఎన్‌ఎస్‌ఎస్‌లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సతీష్‌గౌడ్, లింగమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ చెన్నమల చైతన్య, డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఏవో నిజాముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతల పట్ల అవగాహన కల్పించాలి

**:అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి**

**నవతెలంగాణ - కరీంనగర్** : విద్యార్థులకు బాధ్యత పట్ల చక్కటి అవగాహన కల్పించాలని, తద్వారా సమాజంలో ఉత్తమంగా ఉంచవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్నెక్ట్స్ ప్రాంగణంలో వివిధ విభాగాల కెప్టెన్స్, వైస్ కెప్టెన్స్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలోని తేజస్, సరస్, ధృవ, లక్ష్య విద్యార్థులు నాయకత్వ లక్షణాలను బలపర్చుడానికి ప్రత్యేక నాటికను రూపొందించి ప్రదర్శించారు.అనంతరం తోటి విద్యార్థులు ఎన్నికైన వారికి శుభాభినందనలు తెలిపారు.

## గృహలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ఇల్లందకుంట ఎంపీపీ సరిగోమ్ముల పావనివెంకటేష్**



**నవతెలంగాణ - ఇల్లందకుంట** : గృహలక్ష్మి పథకాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇల్లందకుంట ఎంపీపీ సరిగోమ్ముల పావనివెంకటేష్ కోరారు. మంగళవారం మాట్లాడుతూ అర్హులైన వారు సూచించిన ధృవపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# పాఠ్యాంశంగా ఆరోగ్య అవగాహనను చేర్చాలి

**ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్**

నవతెలంగాణ - కరీంనగర్



విద్యార్థి దశలోనే యువతకు ఆరోగ్య పరిరక్షణ సూత్రాలను, ఆనందమయ జీవితానికి కావలసిన లక్షణాలను, ప్రాణాపాయ దశలో ఉన్న రోగులకు సీపీఆర్ లాంటి ప్రథమ చికిత్స పద్ధతులను పాఠ్యాంశంగా తీసుకొని నేర్పించాల్సిన సమయం ఆసన్నమైందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని రెనే హాస్పిటల్, శాతవాహన లయన్స్‌క్లబ్ సంయుక్తంగా రెనే ఆస్పత్రి సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన సీపీఆర్, గుండె, ఊపిరితిత్తుల పునరుజ్జీవన శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఆర్ ప్రథమ చికిత్స విధానాన్ని అందరు తెలుసుకొని ఉండాలని, ముఖ్యంగా కళాశాల యువతకు ఈ శిక్షణను తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఈ సత్కార్యాన్ని శాతవాహన విశ్వవిద్యాలయం నుంచి ప్రారంభిద్దామని అన్నారు. అనంతరం శాతవాహన లయన్స్‌క్లబ్‌లో సభ్యత్వం తీసుకున్న లయన్ వినోద్‌కుమార్‌కు లయన్ పిన్నును ప్రదానం చేసి సంస్థలోకి ఆహ్వానించారు. రెండో ఉప గవర్నర్ లయన్ లింగరాజు కోదండరాములు, కార్యక్రమ చైర్మెన్ లయన్ డాక్టర్ బంగారి స్వామి, లయన్ యాదగిరి శేఖర్‌రావు మాట్లాడారు. శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ దీక్షిత్ బొజ్జ నేతృత్వంలో సీపీఆర్ శిక్షణను వివరించి, ప్రదర్శించారు. కార్యక్రమంలో బుర్ర మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ రజనీ ప్రియదర్శిని, డాక్టర్ రవీంద్రాచారి, గుండె వైద్య నిపుణులు డాక్టర్ దినకర్, డాక్టర్ యోగేందర్, వివిధ లయన్స్ క్లబ్ నాయకులు, లియో సభ్యులు పాల్గొన్నారు.

## సమాన అభివృద్ధి చేయడమే లక్ష్యం : మేయర్ సునీల్ రావు

**నవతెలంగాణ - కరీంనగర్** : శివారు ప్రాంతాలు, విలీన గ్రామల డివిజన్లను నగరంతో సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పాలకవర్గం పనిచేస్తుందని కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. మంగళవారం 31వ డివిజన్‌లో పర్యటించారు. లక్ష్మీనగర్, గాయత్రి నగర్ ప్రాంతంలో స్థానిక కార్పొరేటర్ లెక్కల స్వప్నవేణుతో కలిసి నగరపాలక సంస్థకు చెందిన రూ.1.30కోట్ల నిధులతో మూడు చోట్ల సీసీ రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. త్వరలోనే నగరంలోని 60 డివిజన్లలో ముఖ్యమంత్రి హామీకి చెందిన రూ.132 కోట్లతో పనులు ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. కరీంనగర్ నగరాన్ని హైదరాబాద్ తర్వాత ఒక గొప్ప నగరంగా ప్రజలకు అందించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్



**నవతెలంగాణ - కరీంనగర్** : నగరంలోని ఈవీఎం గోడౌన్‌ను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.గోపి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్‌లను, స్ట్రాంగ్ రూమును ప్రతి మూడు నెలలకు ఒక్కసారి పరిశీలిస్తామన్నారు. అందులో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించామని చెప్పారు. గోడౌన్‌లో వర్షపు నీరు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, ఏఓ సుధాకర్, డీఈఈ మసూద్, ఆయా పార్టీల నాయకులు మోహనచారి, గోలి అనిల్ కుమార్, బి.రమణారావు, ఎం.వాసుదేవరెడ్డి, సత్తినేని శ్రీనివాస్, ఎర్రబెల్లి రవీందర్ పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించే దిశలో విద్యా బోధన చేయా

**నవతెలంగాణ - జమ్మికుంట** : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలని జిల్లా సెక్టోరల్ అధికారి కర్ర అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్, మండల నోడల్ అధికారి వీరసమ్మయ్య కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు ఆకుల సదానందం, రిసోర్స్ పర్సన్స్ దేవేందర్, రాజిరెడ్డి, సీఆర్‌పీలు సురేష్, రవి పాల్గొన్నారు.

## సత్వరం స్పందిస్తూ సేవలందించాలి

**పోలీస్ అడిషనల్ కమిషనర్ సి.రాజు**



**నవతెలంగాణ - కరీంనగర్ క్రైం** : బ్లూకోల్ట్స్, పెట్రోకార్ విభాగాలకు చెందిన పోలీసులు డయల్ 100 లేదా ఇతర మార్గాల ద్వారా ఏదైన ఫిర్యాదులు అందిన వెంటనే నిమిషాల వ్యవధిలో సదరు ప్రాంతానికి చేరుకుని ప్రజలకు సేవలందించాలని కరీంనగర్ పోలీస్ అడిషనల్ కమిషనర్ (పరిపాలన) సి.రాజు అన్నారు. కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో బ్లూకోల్ట్స్, పెట్రోకార్ విభాగాలకు చెందిన పోలీసులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో గస్తీలు ముమ్మరంగా నిర్వహించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే పోలీసులపై శాఖా పరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జహీర్ అలీ ఖాన్ మృతికి టీడబ్ల్యూజేఎఫ్ సంతాపం

**నవతెలంగాణ - ఇల్లందకుంట** : సియాసత్ ఉర్దూ దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీర్ అలీ ఖాన్ మృతిపట్ల టీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ అధ్యక్షకార్యదర్శులు నేదురు సమ్మయ్య , సౌడమల్ల యోహాన్ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లౌకికవిలువల పరిరక్షణే ధ్యేయంగా సామాజిక ఉద్యమాల్లో ముందుండే మానవతావాది జహీరుద్దీన్ అలీఖాన్ అని, ఆయన మరణం పత్రిక రంగానికి తీరనిలోటు అని అన్నారు.

## జమ్మికుంట గొర్ల అంగడిలో సౌకర్యాలు కల్పించాలి

**జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాల్వ సురేష్**



**నవతెలంగాణ - జమ్మికుంట** : జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని గొర్ల అంగడి వసతులు లేక గొర్రెలు, మేకలు అమ్మే వారు, కొనేవారు ఇబ్బందులు పడుతున్నారని.. వెంటనే సౌకర్యాలు కల్పించాలని గొర్రెల మేకల పెంపకదార్ల సంఘం జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాల్వ సురేష్ అన్నారు. మంగళవారం స్థానిక అంగడిని ఆయన సందర్శించి పరిశీలించారు. మాట్లాడుతూ గొర్రెలు మేకల పెంపకదార్ల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని అంగళ్ల సర్వేలో భాగంగా జమ్మికుంటలో పరిశీలించినట్టు చెప్పారు. ఇక్కడ అంగడికి ఆదాయం ఉన్నా వసతులు లేవన్నారు. ఉమ్మడి జిల్లాలోనే ప్రముఖ అంగడిగా ఉన్న ఇక్కడ వెంటనే సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ సొంతంగా స్థలం కూడా మున్సిపాలిటీ వారు సమకూర్చలేక పోయారని వాపోయారు. జీవాలకు, అమ్మకం, కొనుగోలు దారులకు కనీసం మంచి నీటి సౌకర్యం లేదని నీడ కూడా లేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు భూస అయిలయ్య, రవీందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగ ప్రచారం




**నవతెలంగాణ - హుజురాబాద్** : ఆజాది కా అమృత్ మహెూత్సవంలో 2.0 భాగంగా తపాలా శాఖ హుజురాబాద్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ప్రచార కార్యక్రమం మంగళవారం ఏసీపీ, సీఐ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ ఎల్.జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశభక్తిని పెంచుకోవడానికి ప్రజలందరూ ఆగస్టు 15వ తేదీన ప్రతి ఇంటి పైన జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. హుజురాబాద్ పోస్టుమాస్టర్ మహేందర్ మాట్లాడుతూ.. జాతీయ జెండా కావలసినవారు పోస్ట్ ఆఫీసుకు వెళ్లి లేదా పోస్టుమాస్టర్ లేదా పోస్ట్ మాన్‌కు రూ.25 చెల్లించి తీసుకోవాలని అన్నారు. www.epostoffice.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 12 వరకు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ బొల్లం రమేష్, పోస్ట్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా సెక్రటరీగా ఎండి.సిరాజుద్దిన్




**నవతెలంగాణ - రామడుగు** : కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ కరీంనగర్ జిల్లా సెక్రెటరీగా మండలంలోని గుండి గ్రామానికి చెందిన ఎండి.సిరాజుద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ తాజుద్దీన్ నియామక పత్రాన్ని మంగళవారం అందజేసారు. కార్యక్రమంలో రామడుగు మండల అధ్యక్షుడు బొమ్మరవేణి తిరుపతి, మండల ఉపాధ్యక్షుడు ముంజాల రాములుగౌడ్, నాయకుడు పంజాల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

# పెండింగ్ పనులను పూర్తి చేయాలి

నవతెలంగాణ-చొప్పదండి

చొప్పదండి మండలంలో పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం పనులను వెంటనే పూర్తి చేయాలని చొప్పదండి ఎంపీపీ చిలుక రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం 15వ ఆర్థిక సంఘం మండల ప్రజా పరిషత్ చొప్పదండి గ్రాంట్ నుండి చేపడుతున్న, 2020-21, 2021- 22, 2022-23 సంవత్సరానికి సంబంధించిన పనులపై సమీక్షించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి నిధులు రాకుండా పోతాయని, వారం రోజుల్లో పనులు ప్రారంభించి వెంటనే పూర్తి చేయాలని ఎంపీటీసీలకు, పంచాయతీ రాజ్ ఇంజనీర్లకు ఎంపీపీ సూచించారు. ఎంపీడీవో స్వరూప, ఎంపీటీసీ గోపు మల్లమ్మ నరేందర్‌రెడ్డి, కట్టెకోల తారలక్ష్మి, కృష్ణారెడ్డి, పీఆర్ఏ ఈ విజయ సారధి, సూపరిండెంట్ శ్రవణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ నరోత్తంరెడ్డి, ఏపీవో రాజు, టైపిస్ట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ చిలుక రవీందర్

నవతెలంగాణ 6
జగిత్యాల-కరీంనగర్
బుధవారం 9 ఆగస్టు 2023

## మరుగుదొడ్డికి తాళం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



జగిత్యాల పట్టణంలోని విద్యానగర్ పరిధిలో గల ప్రజా మరుగుదొడ్డి తాళం వేస్తున్నారు.దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టి మరుగుదొడ్డి అందరికీ ఉపయోగ పడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్లేట్స్ వితరణ

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ నూతన ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్ వెల్ఫర్ సొసైటీ సభ్యులు ప్లేట్స్ అందించారు. మధ్యాహ్న భోజన సమయంలో ఇబ్బందుల ను దృష్టిలో ఉంచుకొని ప్లేట్స్ అందించినట్లు సంఘ అధ్యక్షుడు మంత్రి అంజయ్య,తెలంగాణ ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ ప్రధాన కార్యదర్శి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రి, తెలిపారు. ఉపాధ్యక్షులు ఎల్‌బిసి ముక్క శ్రీనివాస్ , దొంతుల లక్ష్మీనారాయణ , ముక్క విజయ్ కుమార్ ఉపాధ్యాయులు విద్యార్థులు పలువురు పాల్గొన్నారు

## ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి

-చొప్పదండి మున్సిపల్ కమిషనర్ పి. శాంతి కుమార్

నవతెలంగాణ- చొప్పదండి

చొప్పదండి పట్టణంలోని ప్రజలు తమ ఇంటి పరిసర ప్రాం తాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసు కోవాలని మున్సిపల్ కమిషనర్ పి. శాంతికుమార్ అన్నారు. చొప్పదండి పట్టణంలోని 6వ వార్డు పరిధిలోని రాజీవ్‌నగర్‌లో 6వ వార్డ్ కౌన్సిలర్, జిల్లా మున్సిపల్ కౌన్సిల్ ఫోరం చైర్మన్ వడ్లూరి గంగరాజు ఆధ్వర్యంలో మంగళ వారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్లో దోమలు వృద్ధి చెందకుండా, తొట్లలో నీరు ఉండకుండా చూసుకోవాలన్నారు. వారి వెంట మేనేజర్ డి. ప్రశాంత్‌కుమార్, సానిటరీ ఇన్స్పెక్టర్ అంజయ్య, వార్డ్ ఇన్‌చార్జ్ మల్లారపు శ్రీనివాస్, నాయకులు దుబ్బాసి లక్ష్మణ్, వడ్లూరి వెంకటస్వామి, వడ్లూరి జానీ, అమర్, ఆశా కార్యకర్త ఉన్నారు.

## వ్యవసాయశాఖ, ప్రణాళికశాఖల సిబ్బందికి శిక్షణ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జిల్లాలో వ్యవసాయశాఖ, ప్రణాళికశాఖ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్థ గణాంక శాఖ హైదరాబాద్ నుంచి ప్రణాళిక శాఖ సహాయ సంచాలకులు హరికృష్ణ, శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో సాగుదారులకు లెక్కలు తెలియజే యడానికి వ్యవసాయశాఖ ద్వారా నిర్వహించే గణన గురించి ప్రణాళికశాఖ, వ్యవసాయశాఖ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి పూర్ణచంద్రరావు, వ్యవసాయ అధికారి సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం

నవతెలంగాణ -జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణ ఎల్‌జి గార్డెన్స్‌లో రాయికల్ పట్టణ, మండల, జగిత్యాల అర్బన్, రూరల్, సారంగాపూర్, బీర్‌పూర్ బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమా వేశంలో పాల్గొని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో అను సరిం చాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. . కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్దిదారులకు చెందే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండి కేసీఆర్ ఆశయాల సాధనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

## పోరుమలలో ఇంటింటికీ సర్వే

నవతెలంగాణ మేడిపల్లి

మేడిపల్లి మండలంలోని పోరుమళ్ళ గ్రామంలో చెలిమెడ ఆనందరావు ఆసుపత్రి కరీంనగర్ వారి ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటి ంటి హెల్త్ సర్వే నిర్వహించారు. దీంర్ఘకాలిక వ్యాధులు, తదితర అంశాలపై రోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు రాయి శ్రీనివాసరావు తెలిపారు.

## ఎంఎస్‌పి జగిత్యాల డివిజన్ ఇన్‌చార్జిగా సతీష్ మాదిగ

నవతెలంగాణ-జగిత్యాల :

మహాజన సోషలిస్టు పార్టీ జగిత్యాల డివిజన్ ఇన్‌చార్జిగా నక్క సతీష్ మాదిగ నియమితులయ్యారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టగా ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ దూమాల గంగారాం మంగళవారం జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సురుగు శ్రీనివాస్, నాయకులు బొల్లే అనీల్ మాదిగ, బాలే అంజన్న, గడప శివ, లింగారెడ్డి పాల్గొన్నారు.

## పెన్షనర్ భవన్‌లో గద్దర్ సంతాప సభ

నవతెలంగాణ-జగిత్యాల

ప్రజా యుద్ధనౌక, ప్రజా గాయకుడు గద్దర్ మరణం తెలంగాణ ప్రజలకు తీరని లోటని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఎల్లా గంగరాజం అన్నారు. మంగళవారం తమ సంఘ భవనంలో గద్దర్ సంతాప సభ నిర్వహించగా హాజరైన జిల్లా అధ్యక్షులు గంగరాజం చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. యూనిట్ 1,2 అధ్యక్ష, కార్యదర్శులు కొలిచాల రవీందర్, విటలయ్య, రాష్ట్ర కౌన్సిలర్ కనపర్తి నాగభూషణం, మాజీ అధ్యక్షుడు పెద్ది ఆనందం ఉన్నారు.

## ఏసీబీకి పట్టుబడ్డ ఈజీఎస్ సిబ్బంది

- ఒకరి అరెస్ట్ మరొకరి పరార్

నవతెలంగాణ-రాయికల్



ఓ రైతు వద్ద లంచం తీసకుంటూ రాయికల్ మండలం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలోని ఇద్దరు సిబ్బందిని అవినీతి నిరోధక శాఖ అధికారులకు మంగళవారం పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయికల్ మండలం రామాజీపేట గ్రామానికి చెందిన రైతు కోల శంకరయ్య తన ఆవుల కోసం ఈజీఎస్ పథకంలో నిర్మించిన షెడ్డు బిల్లు కోసం ఏడాదిగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. రూ.45వేల బిల్లుకు ఎం.బి తయారు చేసేందుకు కార్యాలయంలో పనిచేస్తున్న నాగవత్ విజేస్,ఈసీ మిట్టపల్లి దీపికలు రూ.5 వేలు రైతును లంచం డిమాండ్ చేశారు. రూ.5 వేలు తనతో కాదని రూ.4 వేలు ఇస్తానని ఒప్పందం చేసుకున్న రైతు శంకరయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అధికారుల పథకం ప్రకారం.. రైతు మంగళవారం మధ్యాహ్నం రూ.4 వేలు ఇచ్చేందుకు కార్యాలయానికి వచ్చి దీపికకు నగదు అందజేశాడు. అప్పటికే కాపు కాసి ఉన్న ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాడు. నగదు స్వాధీనం చేసుకుని టెక్నికల్ అసిస్టెంట్ విజేష్, ఈసీ దీపికలపై కేసు నమోదు చేస్తామని ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ కరీంనగర్ అదనపు బాధ్యులు వివి రమణమూర్తి తెలిపారు. దీపికను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్టు, టెక్నికల్ అసిస్టెంట్ విజేష్ పరారీలో ఉన్నాడని డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో అవినీతి నిరోధక శాఖ సిబ్బంది రాము,రవీందర్,జాన్, రెడ్డి,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కౌన్సిలర్ భర్తపై కత్తితో దాడి

- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి
- కోరుట్ల మున్సిపాలిటీలో ఘటన

నవతెలంగాణ- కోరుట్ల

పట్టణ నడిబొడ్డున అందరూ చూస్తుండగానే కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి బీఆర్ఎస్ కౌన్సిలర్ భర్తపై కత్తులతో దాడి చేశారు. ఈఘటన జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, 9 వార్డు కౌన్సిలర్ పోగుల ఉమారాణి భర్త పోగుల లక్ష్మీరాజం కార్గిల్ చౌరస్తా వద్ద గల ఓ హోటల్‌లో టీ తాగుతున్నాడు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో గుర్తు తెలియని



లక్ష్మీరాజం మృతదేహం

వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి కత్తితో వచ్చి లక్ష్మీ రాజంపై దాడితో ముఖంపై తీవ్ర గాయాలై రక్తస్రావం జరిగింది. వెంటనే స్థానికులు అతడిని స్థానిక ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక అంబు లెన్సులో కరీంనగర్ లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీ రాజం మృతి చెందాడు. ఘటనా



స్థలాన్ని కోరుట్ల ఎస్సై కిరణ్‌కుమార్, మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సిఐ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. ఘటనకు సంబంధించి వివరాలు తెలియరాలేదని, దాడి విషయమై విచారణ చేపడుతున్నామని త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు రహదారిపై బైటాయించి ధర్నా చేశారు.

# నా రాజకీయ వారసుడు నవీన్‌ను ఆదరించాలి

- ఆత్మీయ సమ్మేళనంలో భూమ్ రావు

నవతెలంగాణ-మల్లాపూర్

నా రాజకీయ వారసుడు సురభి నవీన్‌ను ప్రజలు ఆదరించాలని బిజెపి సీనియర్ నాయకుడు సురభి భూమ్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కనక సోమేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజకీయాల్లోకి యువత రావాలని అన్నారు. బిజెపి ప్రతి ఒక్కరిని ఆదరించి, మహోన్నతమైన అవకాశాలను కల్పిస్తుందని అన్నారు. 2014 బిజెపి పార్టీ నుండి ఎమ్మెల్యేగా



మాట్లాడుతున్న భుంరావు

పోటీ చేసినప్పటి నుంచి తన వెంట ఉన్న కార్యకర్తలు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన రాజకీయ వారసుడిగా కుమారుడు సురభి నవీన్‌కుమార్ బిజెపిలో నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. జేబీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. కార్యకర్తలు అందరూ నవీన్ కు వెన్ను దన్నుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, నాయకులు సురభి నవీన్ ముఖ్య అతిథులు రాజు రెడ్డి, రాజారెడ్డి, యాదగిరి బాబురావు, బైన ప్రశాంత్, పందిరి నాగరాజు కార్యకర్తలు ఉన్నారు.

# గల్ఫ్ మృతుడి కుటుంబానికి రూ.50 లక్షలు చెల్లించాలి

- బీఎస్పీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రవీందర్

నవతెలంగాణ- మల్యాల

మల్యాల మండలంలోని మానలా గ్రామానికి చెందిన తరాల రాజకుమార్ ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లి అక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను బీఎస్పీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రవీందర్, కరీంనగర్ జిల్లా కోశాధికారి కాంపల్లి రాజుతో కలిసి పరామర్శించారు. తరాల రాజకుమార్ గతంలో ఉపాధి హామీ



పరామర్శిస్తున్న బీఎస్పీ నాయకులు

ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేసి, అకారణంగా ప్రభుత్వం తొలగించడంతో, అప్పులు తీర్చడానికి గల్ఫ్‌కు వెళ్లాడు. గల్ఫ్‌లో కూడా సరైన పని దొరకక చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్థాపం చెంది గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. నేటికీ కూడా కనీసం మృతదేహాన్ని తెప్పించడానికి ప్రభుత్వం చొరవ తీసుకురావడానికి చర్యలు చేపట్టడం లేదన్నారు. రాజ్‌కుమార్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. తక్షణమే రూ.50 లక్షల ఎక్స్ గ్రేసియా చెల్లించి, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు మునుగురి నివాస్, సీనియర్ నాయకులు తాళ్ల తిరుపతి, కళ్లేపల్లి తిరుపతి, దొనకొండ శ్రీనివాస్ ఉన్నారు.

# బైక్‌ను ఢీకొట్టి గుంతలోకి దూసుకెళ్లిన బస్సు

- తప్పిన పెను ప్రమాదం
- బైక్‌పై వెళ్తున్న ఇద్దరి పరిస్థితి విషమం

నవతెలంగాణ- కోరుట్ల

బైక్‌ను ఢీకొట్టి గుంతలోకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లిన ఘటన మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామ శివారులో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్-1 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వరంగల్ వైపు వెళ్తుంది. అయితే బైక్‌పై వెంకటాపూర్ గ్రామానికి చెందిన తండ్రి కొడుకులు సోమిశెట్టి వెంకటి, సోమిశెట్టి వెంకటేష్ జగిత్యాల నుండి వెంకటాపూర్ వెళ్తున్నారు. ఈ క్రమంలో వీరు



ప్రమాదానికి గురైన బస్సు

వెంకటాపూర్ క్రాస్ రోడ్ వద్ద తమ ఊళ్లోకి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో జాతీయ రహదారిపై జగిత్యాల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. బైక్‌ను తప్పించే ప్రయత్నంలో ఢీకొట్టిన అనంతరం బస్సు వేగంగా రహదారి పక్కనే ఉన్న ఓ పెద్ద నీటి గుంతలోకి దూసుకెళ్లింది. వెంటనే స్పందించిన స్థానికులు అత్యవసర ద్వారం నుంచి ప్రయాణికులను బయటకు తీసుకొచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. అయితే, బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వెంకటి, వెంకటేష్ ల పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని హుటాహుటిన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. బస్సులోని ప్రయాణికులలో ఇరువురికి గాయాలవడంతో వారిని జగిత్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు

# జగిత్యాలలో 'ఆపరేషన్ నైట్ సేఫ్టీ'

నవతెలంగాణ-జగిత్యాల

జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ ఆదేశాల మేరకు మంగళవారం అర్ధరాత్రి రోడ్లపై అనవసరంగా తిరుగుతున్న వారే లక్ష్యంగా 'ఆపరేషన్ నైట్ సేఫ్టీ' పేరుతో జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. అర్ధరాత్రి వేళల్లో ప్రధాన కూడళ్లు, వీధులు, రోడ్లు, వాహనాలతో జులాయిగా తిరుగుతూ ప్రజలను ఇబ్బందిలకు గురిచేస్తూ, మద్యం సేవించి రోడ్లపై ద్విచక్ర వాహనాలతో రాష్ డ్రైవింగ్, హారన్లు కొడుతున్న 15 మంది యువకులను అదుపులోకి



యువకులతో మాట్లాడుతున్న సీఐ నటేశ్

తీసుకోని వారి 6 బైక్‌లను సీజ్ చేశారు.

ఈ సందర్భంగా టౌన్ ఇన్స్పెక్టర్ నటేష్ మాటాడుతూ.... యువత చట్టవ్యతి రేకమైన పనుల్లో పాల్గొంటే వారి మంచి భవిష్యత్‌ను కోల్పోతారని, తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అసాంఘిక కార్యకలాపాలను నివారణ లక్ష్యంగా జిల్లా ఎస్పీ భాస్కర్ ఆదేశాల మేరకు ఆపరేషన్ నైట్ సేఫ్టీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. అర్ధరాత్రిలో అనవసరంగా రోడ్లపైకి వచ్చి ప్రజలను ఇబ్బంది గురి చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాలరూరల్ మండలం అనంతారం గ్రామానికి చెందిన తిరుపతికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.15వేల చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేష్, తదితరులు ఉన్నారు.



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే

### అన్నదాన కార్యక్రమం ప్రారంభం

జగిత్యాల పట్టణంలో శ్రీ లక్ష్మి గణేష్ సేవా సమితి జగిత్యాల వారి ఆధ్వర్యంలో గణేష్ ఆలయం అవరణలో 200 మందికి ప్రతి మంగళవారం చేపట్టే అన్నదానార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారం ంచారు. నాయకులు ఎల్.జి రమేష్, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, ఆలయ కార్యవర్గం, కోటగిరి శ్రావణ్, జిల్లా ప్రభాకర్, యాదగిరి మారుతిరావు, పంజర్ల కిషన్, జలంధర్‌రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్ఐగా ఉద్యోగం సాధించిన యువకుడికి అభినందన

జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన భాదినేని జగదీష్ ఎస్ఐగా ఉద్యోగానికి ఎంపికయ్యాడు. జగదీశ్‌ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. వెంట నాయకులు బక్కశెట్టి ఆంజ నేయులు, నీరేటి గంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

## యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-మల్యాల

రాష్ట్ర జనాభాలో 20 శాతంకు పైగా ఉన్న యాదవుల కోసం కార్పొరేషన్ చేయాలని, ఎస్ఎన్‌టీ రిజర్వేషన్ పునరద్ధరించాలని, చట్ట సభల్లో రిజర్వేషన్, రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలని హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద యాదవ గర్జన నిర్వహించారు.జిల్లా అధ్యక్షుడు బల్కం మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా నుంచి అధిక సంఖ్యలో యాదవులు తరలి వెళ్లారు. జిల్లా అధ్యక్షుడు బల్కం మల్లేష్ యాదవ్, ఉద్యోగుల సంఘం రాష్ట్రశాఖ అధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలంగా ణలో యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 10వేల కోట్ల బడ్జెట్ కేటాయించా లన్నారు. ఎస్.ఎన్.టి అర్ధసంచార రిజర్వేషన్ తక్షణమే పునరుద్ధరించాలన్నారు. జిల్లా యూత్ అధ్యక్షుడు కొక్కెర మల్లేష్ యాదవ్, సంగ శ్రీనివాస్ యాదవ్, నాగుల మనోజ్ కుమార్ యాదవ్, బల్కం ప్రశాంత్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, రాజేశం యాదవ్, మహేష్ యాదవ్, రవి యాదవ్, మల్లయ్య యాదవ్, గంగాధర్ యాదవ్ పాల్గొన్నారు.



## వికలాంగులు బ్యాటరీ ట్రై సైకిల్ కోసం దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ -మెట్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 80శాతం వైకల్యం గల వికలాంగులకు పూర్తి ఉచితంగా బ్యాటరీ ట్రై సైకిల్ ఎంపిక కోసం బుధవారం ఉదయం 10 గంటలకు కోరుట్లలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎంపిక శిబిరం ఉంటుందని ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తెలిపారు. కనీసం వైకల్యం 80 శాతం కలిగిన దివ్యాంగులు సదరం సర్టిఫికెట్,ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, కులం సర్టిఫికెట్, నివాసం సర్టిఫికెట్, రేషన్ కార్డు, తదితర ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

## విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ- కోరుట్ల

పట్టణంలోని వెటర్నరీ కాలేజీలో ప్రైమరీ విద్యార్థులకు ఎడ్యుకేషన్ ఫీల్డ్ ద్వారా వెటర్నరీ కాలేజి లెక్చరర్లు అవగాహన కల్పించారు. జంతువుల వివరాలు తెలియజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వనపర్తి చంద్రమోహన్, కొండబత్తిని అనంతకృష్ణ ప్రసాద్, నాయకులు గుంటుక ప్రకాశ్, కనపర్తి శ్రీనివాస్, కళాశాల ఆధ్యాపకులు సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

## గల్ఫ్ మృతుడి కుటంబానికి మేడిపల్లి సత్యం ఆర్థిక సాయం

నవతెలంగాణ- మల్యాల



నగదు అందజేస్తున్న మేడిపల్లి సత్యం

మల్యాల మండలంలోని మానాల గ్రామానికి చెందిన తారాల రాజకుమార్ గల్ఫ్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం పరామర్శించి రూ.10వేల ఆర్థికస ఆయం మంగళవారం అందజేశారు. ఆయన వెంట వెల్మ లక్ష్మారెడ్డి, ఎడపెల్లి రాజిరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, సతీష్‌రెడ్డి, మారేపల్లి గంగాధర్, భాస్కర్, వినయ్, జలం, హుస్సేన్, రాకేష్, కిషన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## పీఆర్సీ కమిటీ నియమించి ఐఆర్ ప్రకటించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ- వీణవంక

పీఆర్సీ కమిటీ నియ మించి, ఐఆర్ ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్ అన్నారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) ఆధ్వర్యం లో ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నా పోస్టర్‌ను యూఎస్పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ బాధ్యులు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 30తో పీఆర్సీ గడువు ముగిసిందని, ప్రభుత్వం వెంటనే నూతన పీఆర్సీ కమిటిని నియమించి, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. 8 ఏండ్లుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు, ఆరేండ్లుగా బదిలీలు లేవని వాని వెంటనే చేపట్టాలని కోరారు. ఈనెల 12న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. యూఎస్పీసీ బాధ్యులు మేకమల్ల శ్రీనివాస్, లింగయ్య, తిరుపతిరెడ్డి, కనకం శ్రీనివాస్, ఉమారెడ్డి, రామ్మూర్తి పాల్గొన్నారు.

## ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ -మెట్‌పల్లి



:దరఖాస్తు స్వీకరిస్తున్న కమిషనర్

మెట్‌పల్లి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన గృహలక్ష్మి దరఖాస్తు కేంద్రాన్ని కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ పరిశీలించారు. దరఖాస్తుదారులకు వస్తున్నా ఇబ్బందులను అడిగి తెలుసు కొన్నారు. దరఖాస్తుదారుల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించి. పట్టణంలోని 26వార్డులోని ఇల్లు లేని నిరుపేదలు ఈ పథకాన్ని ప్రభుత్వం అందించే మూడులక్షల ఆర్థిక సహాయాన్ని సద్వి నియోగం చేసుకో వాలని సూచించారు. ఇప్పటి వరకు పట్టణంలో 120 వరకు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకటలక్ష్మి, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## గృహలక్ష్మి దరఖాస్తు గడువు పెంచాలి

-బీజేవైఎం రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు ధోనీకేల నవీన్

నవతెలంగాణ -మెట్‌పల్లి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లులేని నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం సాయం అందించాడానికి ఉద్దేశించిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తూ గడువును పొడగించాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధోనీకేల నవీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలు, ఇల్లులేని వారు దరఖాస్తు చేసుకోవడానికి నాలుగు రోజుల సమయం ఇవ్వడమంటేనే పేదలను మోసం చేయడమన్నారు. వైన్స్ టెండర్లకు 15 రోజుల సమయమిచ్చి, గృహలక్ష్మి పథకానికి నాలుగు రోజుల గడువు ఇవ్వడం దారుణమన్నారు. ప్రభుత్వానికి వైన్స్ టెండర్ల పైన ఉన్న చిత్తశుద్ధి పేదల ఇండ్ల నిర్మాణంలో లేదన్నది దరఖాస్తు గడువే తెలుపుతుందన్నారు. రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలకు లక్షల సంఖ్యలో ఉన్నారని కేవలం ఈ నాలుగు రోజుల సమయంలో సర్టిఫికెట్ లు,కోసం మీసేవ ఆఫీసుల చుట్టూ తిరగడానికే సరిపోతుందని అందు కోసమే గృహలక్ష్మి పథకం గడువు పొడ గించాలని డిమాండ్ చేశారు.

## శిథిలావస్థలో ఎంపీడీవో కార్యాలయం

-హెల్మెట్లు ధరించి విధులు నిర్వర్తించిన సిబ్బంది

నవతెలంగాణ- జగిత్యాల



హెల్మెట్ పెట్టుకున్న సిబ్బంది

బీర్పూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం శిథిలావస్థలో ఉన్న అద్దె భవనంలో కొన సాగుతోంది. భవనం స్లాబ్ పైపెచ్చులు ఎప్పుడు ఊడి పడతాయనే భయంతో కార్యాలయ సిబ్బంది బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఎంపీడీవో మల్లారెడ్డి విధినిర్వహణలో ఉండగా పైపెచ్చులు ఊడిపడి తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. అదనపు కలెక్టర్ వచ్చి ఎంపీడీవో కార్యాలయాన్ని తరలించాలని చెప్పినా.. పరిస్థితిలో మార్పు లేదు. ఇక చేసేదేమీ లేక సిబ్బంది భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. బీర్పూర్ మండలం 2016లో ఏర్పడింది. అప్పటి నుంచి ఇదే అద్దె భవనంలోనే కార్యాలయం కొనసాగుతోంది. ఎన్నిసార్లు ప్రజా ప్రతినిధులకు అధికారులకు విన్నవించుకున్నా.. పరిస్థితుల్లో మార్పు లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేదేమీ లేక ప్రాణాలను కాపాడుకునేందుకు హెల్మెట్లు ధరించి విధులు నిర్వర్తిస్తున్నారు.

## పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

నవతెలంగాణ-వెల్గటూర్



పాడి రైతులు గాలికుంటు నూలి పురుగు నివారణ టీకాలు వేయించుకోవాలని వెల్గటూర్ పశు వైద్యాధికారిణి శ్రీ ప్రియ అన్నారు. మంగళవారం ఎండపల్లి మండలంలోని గొల్ల కోట గ్రామంలోని 292 ఆవులకు, ఎద్దులకు గాలికుంటు నివారణ టీకాలు ఎల్ఎస్‌డి (లంపి స్కిన్ డిసీస్) నివారణకు టీకాలు, 376 గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పాల్గొన్న వారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సింహాచలం జగన్, పొన్నం తిరుపతిగౌడ్, జల్లెల కనకయ్య, పశు వైద్య సిబ్బంది ఆకుల నాగరాజు, వి.ఎ కె.కుమారస్వామి పాల్గొన్నారు.

# కార్మికులు యజమానులుగా మారేదెన్నడు

- పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్
- సిరిసిల్లలో ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట నిరసన

**నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :** కార్మికులు యజమానులుగా మారేదెన్నడని సీఐటీయూ అనుబంధ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు కోడం రమణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం వర్కర్ టూ ఓనర్ పథకాన్ని వెంటనే పూర్తిచేసి కార్మికులకు అందించాలంటూ, మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో సిరిసిల్ల నేతన్న విగ్రహం నుండి పాదయాత్రగా వెళ్లి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించి మాట్లాడారు. ప్రభుత్వం, మంత్రి కేటీఆర్ సిరిసిల్లలోని పవర్లూమ్ కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పించి యజమానులుగా మారుస్తామని దాదాపు 10సంవత్సరాల క్రితం వర్కర్ టూ ఓనర్ పథకాన్ని ప్రకటించారన్నారు. పథకానికి సంబంధించి పెద్దూరు శివారులో 88 ఎకరాల స్థలాన్ని కేటాయించి 2019లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా మొదటి విడతగా 1104 కార్మికులకు వర్కర్ టూ ఓనర్ పథకాన్ని అందించడంలో భాగంగా వీవింగ్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. ఇప్పటికీ 4 సంవత్సరాలు దాటినా వర్క్ షెడ్ల నిర్మాణం ఇంకా పూర్తికాలేదని తెలిపారు. కార్మికులు యజమానులుగా మారితే సిరిసిల్లలో యజమానులకు నష్టం జరుగుతుందనే ఉద్దేశంతోనే కాలయాపన చేస్తున్నట్టు కనిపిస్తుందని అన్నారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి పనిచేస్తే వెంటనే వర్కర్ టూ ఓనర్ పథకాన్ని పూర్తి చేసి అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులతో ఆందోళనలు, పోరాటాలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరామ్ సదానందం, సూరం పద్మ నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, గుండు రమేష్, ఉడుత రవి, సబ్బని చంద్రకాంత్, కనగంటి ఆంజనేయులు, బెజుగం సురేష్, ఓడ్నాల వీరేశం, కంది మల్లేశం, గడ్డం ఎల్లయ్య, మోర తిరుపతి, గున్నాల ఇస్తారి, సందుపట్ల పోచమల్లు, తాటిపాముల విజయ్ కుమార్, గడ్డం సురేష్, గుండేటి దశరథం, దుబాల శ్రీనివాస్, వంగ సురేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపి, కార్యాలయ అధికారికి వినతి పత్రం అందిస్తున్న సిఐటీయూ జిల్లా నాయకులు

## ఏఐటీయూసీలో చేరిన మిషన్ భగీరథ కార్మికులు



సభ్యత్వం పుచ్చుకున్న కార్మికులు

**నవతెలంగాణ - ఇల్లంతకుంట:** మండల మిషన్ భగీరథలో పని చేస్తున్న కార్మికులు మంగళవారం ఏఐటీయూసీలో జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆధ్వర్యంలో చేరారు. మండల అధ్యక్షుడు బట్టు అనిల్ కుమార్, కార్యదర్శి జనగాం శ్రీనివాస్, వెంకటేశం, మల్లేశం, రాయమల్లు, గంగరాజు, బంగారు రమేష్ పాల్గొన్నారు.

## ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళి..



జమ్మికుంట: కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రజాస్వామిక, ప్రజాసంఘాల నాయకులు

**నవతెలంగాణ - జమ్మికుంట :** తన పాటల ద్వారా అణగారిన ప్రజల జీవన విధానాన్ని సమాజానికి ఎరుకపరిచి వారిలో చైతన్యం కల్గించేందుకు తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని, ఆయన ఆకస్మిక మరణం పీడిత ప్రజలకు తీరని లోటని కార్మిక సంఘ నాయకులు గుంటి సామ్రాజ్యం అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక బస్టాండ్ నుండి గాంధీ చౌరస్తా వరకు ప్రజాస్వామ్యవాదులు, ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజల పక్షాన నిలిచిన సియాసత్ పత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరోద్దీన్ అలీఖాన్ గద్దర్ అంత్యక్రియల్లో పాల్గొవడానికి వెళ్లి గుండెపోటుతో మరణించడం బాధాకరమన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శనిగరం తిరుపతయ్య, కేడీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు పింగిలి రమేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సజ్జద్ మహమ్మద్, ఆవాల నరహరి, శ్రీనివాస్, అమృత కిషోర్, మర్రి అవినాశ్, సిఐటియు నాయకులు, అసంఘటితరంగ మహిళ నాయకురాలు జె.స్వప్న, కళాకారుడు భరత్ పాల్గొన్నారు.

**నవతెలంగాణ - వేములవాడ :** సోమవారం రాత్రి వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి గ్రామ యువత ఆధ్వర్యంలో గద్దర్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. చిర్ర వేణు, యూత్ నాయకులు దేవరాజు బాబు, ప్రవీణ్, కైలాస్, శ్రీనివాస్, ప్రవీణ్, రాజు, మధు, సంపత్, వెంకన్న, హరీష్ పాల్గొన్నారు.

**నవతెలంగాణ - ముస్తాబాద్ :** మండల కేంద్రంలో గద్దర్‌కు నాయకులు ప్రగాఢ సంతాపం తెలుపుతూ శ్రద్ధాంజలి ఘటించారు. సామాజిక కార్యకర్త తోట ధర్మేందర్, మాజీ సెస్ డైరెక్టర్ కొమ్ము బాలయ్య, ఎద్దండి నర్సింహారెడ్డి, చెవుల మల్లేష్, మెంగాని మనోహర్, శీలం స్వామి, దిటి నరసింహులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ - కరీంనగర్ :** కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు గద్దర్‌కి నివాళులర్పించి, సంతాపం తెలియజేశారు. ఆటో కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు మద్దెల రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బండారు సంపత్ పటేల్, ఉపాధ్యక్షుడు మద్దుల రామ్‌గోపాల్‌రెడ్డి, మల్ల నాగభూషణం, సొల్లేటి ఆంజనేయులు, నునావత్ నరసింహ నాయక్, కోశాధికారి కొడుముంజ తిరుపతి, సంయుక్త కార్యదర్శి కొత్తూరు సత్యనారాయణ, నాగుల మహేందర్ పాల్గొన్నారు.

## జహీరుద్దీన్‌కు నివాళి

**నవతెలంగాణ - హుజూరాబాద్ :** సియాసత్ మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీ ఖాన్ మృతిపట్ల మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రజాసంఘాల నాయకులు కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో భారత్ బచావో, ప్రజాసంఘాల నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

**నవతెలంగాణ - వీర్నపల్లి :** వీర్నపల్లి మండల కేంద్రంలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్మికుడు పసుల మల్లేశం గుండెపోటుతో మృతిచెందాడు. రంగంపేట గ్రామంలో మాజీ సర్పంచ్ భూక్య ఉస్మాన్ చిన్న కుమారుడు ప్రవీణ్ ఆదిలాబాద్ జిల్లాలో శివఘాట్ వాగు సందర్శనకు వెళ్లి ప్రమాదవశాత్తూ వాగులో పడి మృతిచెందాడు. వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య పరామర్శించారు. ఆయనవెంట సర్పంచ్ పాటి దినకర్, ఎంపిటిసి అరుణ్ కుమార్, సెస్ డైరెక్టర్ మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు అందే సుభాష్, జిల్లా కోఆప్షన్ చాంద్ పాషా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, రాజన్నపేట సర్పంచ్ శంకర్ ఉన్నారు.

## పరిశుభ్రత పాటించాలి

**నవతెలంగాణ - చందుర్తి :** ప్రతి ఒక్కరు పరిసరాల పరి శుభ్రత పాటించాలని సెంట్రల్ టీం లీడర్ ఆయాజ్ అన్నారు. మంగళవారం తిమ్మాపూర్ గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. గ్రామ పంచాయితీ ఆవరణలోని మరుగుదొడ్లను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ రవీందర్ ఉన్నారు

## ప్రభుత్వ మొండి వైఖరి వీడాలి

**నవతెలంగాణ - వీర్నపల్లి :** ప్రభుత్వ మొండి వైఖరి వీడాలని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు లద్దూరి నర్సయ్య అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో కార్మికుల నిరవధిక సమ్మె మంగళవారంతో 35 వ రోజుకు చేరింది. వంటావార్పు చేసీ కార్మికులు నిరసన తెలిపారు. గౌరవ అధ్యక్షులు నర్సయ్య, ప్రధాన కార్యదర్శి శేఖర్, కార్మికులు మల్లేశం, రాజయ్య ప్రదీప్, లక్ష్మి, నర్సవ్వ, తదితరుల ఉన్నారు.

## మండల సర్వసభ్య సమావేశం వాయిదా

**నవతెలంగాణ - వీర్నపల్లి :** వీర్నపల్లి మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్టు ఎంపిడివో నరేష్ తెలిపారు. వీర్నపల్లి మండలం కేంద్రంలో మంగళవారం ఎంపిపి మాలోతు భూలా అధ్యక్షతన సమావేశం నిర్వహించాల్సి ఉంది. ఆయా శాఖల అధికారులు హాజరు అయ్యారని, మంత్రి కేటీఆర్ పర్యటనలో గృహలక్ష్మి పథకంపై సమావేశం ఉన్నందున ప్రజాప్రతినిధులు రానందున సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్టు తెలిపారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

**నవతెలంగాణ - చొప్పదండి :** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ అన్నారు. చొప్పదండి మండల కేంద్రంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జవహర్ నవోదయ విద్యాలయంలో ఇతివృత్తం, చిత్రలేఖనం పోటీలలో 50 మంది విద్యార్థు పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. తీగలగుట్టపల్లెలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ఎంపీ బహుమతులను ప్రదానం చేశారు. కార్పొరేటర్ కోలగాని శ్రీనివాస్, నవోదయ ప్రిన్సిపాల్ పడమటి మంగతాయారు, నవోదయ శిక్షణ ఉపాధ్యాయుడు గోక నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన

**నవతెలంగాణ - తిమ్మాపూర్ :** మండలంలోని నస్తులాపూర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో పోషణ అభియాన్‌లో భాగంగా చిన్నారులకు నిర్వహించిన అన్నప్రాసన కార్యక్రమానికి సర్పంచ్ రావుల రమేష్ హాజరయ్యారు. అనంతరం పిల్లలకు బాలామృతం, గర్భిణులకు, బాలింతలకు పాలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఐసిడిఎస్ ఎసిడిపిఓ అరవింద, సూపర్వైజర్ శ్రీలత, ఏఎన్ఎం విమల, ఆశా కార్యకర్త సుజాత, అంగన్వాడీ టీచర్లు రజిత, భూలక్ష్మి పాల్గొన్నారు.

## టీపీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహకుడిగా సాయిని రవి

**నవతెలంగాణ - జమ్మికుంట :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ కార్యనిర్వహకుడిగా జమ్మికుంట పట్టణానికి చెందిన యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిని రవిని నియమించినట్లు మంగళవారం ఆ కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాయిని రవి మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్‌ను కలిసి సత్కరించినట్టు చెప్పారు.

# సమాజంలో ఫొటోగ్రఫీకి ప్రాముఖ్యత

### కరీంనగర్ మేయర్ సునీల్ రావు

**నవతెలంగాణ - కరీంనగర్ :** ప్రస్తుత సమాజంలో ఫొటోగ్రఫీకి చాలా ప్రాముఖ్యత ఉందని, ఫోటో, వీడియో గ్రాఫర్లు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని కరీంనగర్ నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. ఆగస్టు 19 ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని రెవెన్యూ గార్డెన్‌లో నగర ఫోటో, వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేయర్ సునీల్ రావు హాజరయ్యారు. మొదటగా లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలు వేసి, జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఫోటో, వీడియో రంగంలోని పలువుకి మృతికి మౌనం పాటించారు. అనంతరం పలువురు ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లను మేయర్ సత్కరించారు. మేయర్ సునీల్ రావును ఫోటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘ నాయకులు గజమాలతో సత్కరించారు. మంత్రి గంగుల కమలాకర్, ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మెన్ వినోద్ కుమార్ సహకారంతో ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘానికి త్వరలోనే స్థలం కేటాయిస్తామని, సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి కూడా నిధులు కేటాయించి భవన నిర్మాణం చేసుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫోటో, వీడియో గ్రాఫర్స్ జిల్లా అధక్షుడు సిరి రవీందర్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు, ఫోటో వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, రాష్ట్ర గౌరవ సలహాదారుడు కేదార్‌రెడ్డి, సంఘం నాయకులు సామ అశోక్, రాకేష్‌రెడ్డి, శంకరాచార్య అంజనేయులు, సభ్యులు పాల్గొన్నారు.


మేయర్‌ను సన్మానించిన ఫోటో గ్రాఫర్లు

# మాట ఇచ్చాం.. డబుల్ రోడ్డు తెచ్చాం

### రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

**నవతెలంగాణ - గన్నేరువరం :** రాజీవ్ రహదారి గుండ్లపల్లి నుంచి పొత్తూరు మీదుగా దక్షిణ కాశీగా పిలువబడే వేములవాడకు ఈ డబుల్ రోడ్డు నిర్మాణం ప్రధానంగా మారుతుందని రాష్ట్ర ప్రణాళిక ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. రాజీవ్ రహదారి గుండ్లపల్లి స్టేజి వద్ద ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి రూ.71కోట్లతో చేపట్టే డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. గన్నేరువరం నుంచి ప్రజాప్రతినిధులు, ప్రజలు, యువకులు బైకు, కార్ల కాన్వాయ్ ర్యాలీగా రాగా అడుగడుగునా మండల ప్రజలు పూల వర్షం కురిపించి, బొట్టు పెట్టి మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్ రోడ్డు నిర్మాణం మండల ప్రజలకే కాకుండా దక్షిణ తెలంగాణలోని పలు జిల్లాలకు ప్రధాన మార్గంగా నిలుస్తుందన్నారు. ఆయా గ్రామాల కూడళ్లలో సెంట్రల్ లైట్లతో సుందరంగా తీర్చి దిద్దుతామన్నారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ నాయకులు రోడ్డు నిర్మాణం చేస్తామన్నా కూడా అనవసరపు రాద్ధాంతాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, సుడా చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి.రామకృష్ణారావు, సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, జడ్పిటిసి మాడుగుల రవీందర్‌రెడ్డి, రైతుబంధు జిల్లా కోఆర్డినేటర్ గుడెల్లి తిరుపతి, మాజీ జెడ్పిటిసి జువ్వాడి మన్మోహన్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గంప వెంకన్న, తీగల మోహన్ రెడ్డి, పుల్లెల లక్ష్మణ్, న్యాత సుధాకర్, బద్దం తిరుపతిరెడ్డి, సర్పంచులు, ఎంపిటీసీలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్



# గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువు పెంచాలి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ జిల్లా నాయకులు

**నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :** గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువు పెంచాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సిరిసిల్లలోని సిపిఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి మూడు రోజుల గడువు మాత్రమే ఇవ్వడం సరికాదన్నారు. పథకానికి సంబంధించిన విధివిధానాలు, కనీసం దరఖాస్తు ఫారం కూడా ఎక్కడ దొరుకుతుందో చెప్పని ప్రభుత్వం, 10వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పడం విడ్డూరమన్నారు. పట్టణ కార్యదర్శి పంతం రవి, మంచకర్ల రమేష్, సోమ నాగరాజు, అచ్చ వేణు, వడ్డేపల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

**నవతెలంగాణ - ఇల్లంతకుంట :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలం ఉన్న పేదవారికి ఇల్లు కట్టుకోవడానికి ప్రారంభించిన గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువును పెంచాలని దళిత సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు రాకేష్ కోరారు. దరఖాస్తు చేసుకోవడానికి కేవలం నాలుగు రోజులు మాత్రమే గడువు ఇవ్వడం చాలా బాధాకరం అన్నారు. 15 రోజులు గడువు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


రాకేష్

### గృహలక్ష్మి పథకానికి మార్గదర్శకాలు విడుదల చేయాలి

**నవతెలంగాణ - మానకొండూర్ :** గుడిసెలు లేని తెలంగాణ చేస్తానని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి పేదలకు ఇండ్లు కట్టియ్యడం చేతకాక డబుల్ బెడ్ రూమ్‌ల పథకం ఎత్తేసిన అసమర్థుడు అని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం అన్నారు. డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ బిఎస్పీలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అసెంబ్లీ కేంద్రంలో కేక్ కట్ చేశారు. కార్యకర్తలతో కలిసి మాట్లాడుతు గృహలక్ష్మి పథకం మార్గదర్శకాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కుల మతాలకతీతంగా అందరికి వర్తింపచేయాలి అన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి కనీసం 3 నెలల సమయం పెట్టాలని అన్నారు. కార్యక్రమం మండల అధ్యక్షుడు దాసరి కొమురయ్య, ఆరెల్లి రాజు, సిరిసిల్ల అంజయ్య, ఉట్ల ఆనంద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మండలంలోని చెంజర్లలో ఆత్మహత్య చేసుకున్న సిరిసిల్ల సాయి కుమార్ అంత్యక్రియల్లో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం పాల్గొని బాధిత కుటుంబ సభ్యులను ప్రమర్శించారు. అసెంబ్లీ ఇన్‌చార్జి, జిల్లా కార్యదర్శి కుమ్మరి సంపత్, కరీంనగర్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సిరిసిల్ల అంజయ్య ఉన్నారు.


మాట్లాడుతున్న నిషాని రామచంద్రం

## అక్రమ పట్టాను తొలగించండి



**నవతెలంగాణ - గంభీరావుపేట :** గంభీరావుపేట మండలం ముస్తఫా నగర్ గ్రామ శివార్లలోని సర్వే నంబర్ 360/63,310/61లో సుమారు 2ఎకరాల భూమిని అక్రమంగా వేరే వ్యక్తి స్వాధీనం చేసుకుని ప్రభుత్వ పథకాలను పొందుతూ మోసం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం తహసీల్దార్ లగిశెట్టి భూపతికి ముస్తాపనగర్ గ్రామానికి చెందిన భూక్య చంద్రం, కేతవాత్ లాల్ వినతిపత్రం అందజేశారు. తమ భూమిని అక్రమంగా పొందిన వ్యక్తిపై పట్టాదారు పాస్ బుక్ రద్దుచేసి తమకు తగు న్యాయం చేయాలని కోరారు.

## ఓపెన్ స్కూల్ ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ

**నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :** దూర విద్యావిధానాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల డిఈఓ రమేష్ కుమార్ తెలిపారు. మంగళవారం 2023-2024 విద్య సంవత్సరం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ప్రవేశాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 10 తేదీ వరకు ఎలాంటి అపరాద రుసుము లేకుండా, ఆ తరువాత అపరాద రుసుముతో ఈ నెల 31 వరకు ప్రవేశాలు పొందవచ్చని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ చలువాజీ నాగేశ్వర్‌రావు, జిల్లా పరీక్షల కార్యదర్శి అజీమ్, కార్యాలయం కో ఆర్డినేటర్ శైలజ పాల్గొన్నారు.

## నిత్యవసర సరుకుల పంపిణీ

**నవతెలంగాణ - ఇల్లందకుంట :** మండలంలో వర్షాలకు నష్టపోయిన 5 కుటుంబాలకు హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆదేశాల మేరకు బీజేపీ ఇల్లందకుంట మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి మంగళవారం నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శులు బైరెడ్డి వెంకటరమణారెడ్డి, ఆరెల్లి శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మన్ కళ్లెం సత్యనారాయణరెడ్డి, నాయకుడు ఉప్పుల రమేష్, మల్యాల సర్పంచ్ గురుకుంట్ల సాంబయ్య, పాతర్లపల్లి సర్పంచ్ రాంమల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బీడీలు చుట్టుచూ పంచాయతీ కార్మికుల నిరసన



**నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :** మండలంలోని గ్రామ పంచాయతీ సిబ్బంది నిరవధిక సమ్మె మంగళవారం 34వ రోజుకు చేరుకుంది. మహిళా గ్రామపంచాయతీ సిబ్బంది బీడీలు చూడుతూ నిరసన తెలిపారు. గౌరవ అధ్యక్షుడు రేసు రాజయ్య, మండల అధ్యక్షుడు జక్కుల మహేందర్, ఉపాధ్యక్షుడు గాదం రామదాస్, నారాయణపురం నర్సయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కార్మికులు ఆంజనేయులు, పిట్ల రాజు, రామకృష్ణ, దేవేందర్ పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

**నవతెలంగాణ - ముస్తాబాద్ :** కళ్యాణలక్ష్మి పథకం ఆడపిల్లల తల్లిదండ్రులకు ఓ వరమని ఎంపీపీ శరత్‌రావు అన్నారు. మండలంలోని ముస్తాబాద్, పోతుగల్, రామాపూర్, గూడెం, చీకోడ్ గ్రామాల్లో 18 మందికి కళ్యాణలక్ష్మి చెక్కులను ఎంపీపీ శరత్‌రావు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీపీ సొంతంగా లబ్దిదారులకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుండం నర్సయ్య సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, సురేందర్‌రావు పాల్గొన్నారు.

## 'బిసి బంధు బీఆర్ఎస్‌కు విందు'

**నవతెలంగాణ - చందుర్తి :** బీసీ బంధు బీఆర్ఎస్ నాయకులకు విందు అని జోగాపూర్ ఎంపిటిసి మ్యాకల గణేష్ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 420 మంది దరఖాస్తు చేసుకోగా మొదటి విడితగా 137 మంది లబ్దిదారులను ఎంపిక చేశారన్నారు. అధికశాతం అధికార పార్టీ కార్యకర్తలే ఉన్నారని అన్నారు. అందరికీ బిసి బంధు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగానే ఎల్లారెడ్డిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు

### జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్



**నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :** ఎల్లారెడ్డిపేట మండల విద్యార్థుల చిరకాల కాంక్ష ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని.. ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా విద్యార్థుల పక్షాన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొన్ని సంవత్సరాలుగా ఉద్యమాలు, పోరాటాలు చేస్తున్నామని చెప్పారు. ఆ పోరాట ఫలితంగా డిగ్రీ కళాశాల మంజూరైనట్టు తెలిపారు. ఆయనవెంట ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు కుర్ర రాకేష్, గుండెల్లి కళ్యాణ్, జాలపల్లి మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

## ఎస్సైగా ఎంపికైన 'గాయత్రి' పూర్వ విద్యార్థినికి సన్మానం


విద్యార్థిని ని అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ ముష్కే వీర్రాజు

**నవతెలంగాణ - జమ్మికుంట :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎస్ఐ ఫలితాలలో జమ్మికుంట పట్టణంలోని గాయత్రి డిగ్రీ అండ్ పిజి కళాశాల పూర్వ విద్యార్థిని మౌటం మానస ఉత్తీర్ణురాలైంది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ముష్క వీరరాజు మాట్లాడారు. గాయత్రి డిగ్రీ కళాశాలలో 2019 - 22 విద్యా సంవత్సరంలో చదివిన ఓదెల మండలం శానగోండ గ్రామానికి చెందిన మౌటం మానస ఎంపిక కావడం సంతోషంగా ఉందని తెలపారు. మా కళాశాలలో చదివేటువంటి విద్యార్థిని విద్యార్థులకు పోటీ పరీక్షల పైన ప్రత్యేక అవగాహన కల్పించడం ఈ అమ్మాయి ఉద్యోగం సాధించడం దానికి నిదర్శనం అని అన్నారు. రానున్న రోజుల్లో ప్రముఖ కంపెనీలతో మాట్లాడి కళాశాల విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామని తెలిపారు. అనంతరం మౌటం మానస కి కరస్పాండెంట్ ముష్క వీర రాజు, ప్రిన్సిపాల్ సర్దన కుమార్ పుష్ప గుచ్చం ఇచ్చి శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు హరీష్, అంజిబాబు, తహేరా బేగం, రమేష్, చంద్రయ్య, సాగర్, మధుకర్, భాస్కర్, కరుణ, ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల మంజూరుతో బీఆర్ఎస్ నాయకుల సంబరాలు



**నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయడంతో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి బిఆర్ఎస్ నాయకులు మంత్రి కేటీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో టపాసులు కాల్చి, మిఠాయిలు పంపిణీ చేవారు. జడ్పిటిసి చీటి లక్ష్మణ్‌రావు, ఎంపిపి పిల్లి రేణుక కిషన్, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్ విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు కొండ రమేష్‌గౌడ్, నాయకులు అందె సుభాష్, ఎలుసాని మోహన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు వెడల్పు పనులు ప్రారంభం


పనులు ప్రారంభించి మాట్లాడుతున్న జెడ్పీటీసీ

**నవతెలంగాణ - రుద్రంగి :** రుద్రంగి మండలకేంద్రంలో మంగళవారం రోడ్డు వెడల్పు పనులు ప్రారంభించినట్టు జెడ్పీటీసీ గట్ల మీనయ్య తెలిపారు. ఎమ్మెల్యే రమేష్ బాబు ఇచ్చిన హామీ ప్రకారం సుమారు ఐదు కోట్ల రూపాయలతో రోడ్డు వెడల్పు పనులు చేపట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ కంటే రెడ్డి, కో ఆప్షన్ జమిలా బేగం, ఎంపీటీసీ మంచే రాజేశం, దయ్యాల కమలాకర్, వార్డు సభ్యులు చెప్యాల గణేష్, గొళ్లెం నర్సింగ్, మ్యాకాల రాజేందర్, నాయకులు పొగుల నర్సయ్య కదాసు లక్ష్మణ్, దయ్యాల నారాయణ పాల్గొన్నారు.

## యూఎస్పీఎస్ ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



**నవతెలంగాణ - మానకొండూర్ :** ఆగస్ట్ 12న కరీంనగర్‌లో జరిగే యూఎస్పీఎస్ ధర్నా పోస్టర్‌ను మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం యూఎస్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొహెడ చంద్రమౌళి, టీఎస్ టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె ఎఫ్ జావేద్ మాట్లాడారు. ఉపాధ్యాయుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలైన బదిలీలు, ప్రమోషన్లు, నియామకాల ప్రక్రియ నిర్వహణకై అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. జులై 1 నుండి ఇంటీరియమ్ రిలీఫ్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని, జీవో నెంబర్ 317 బాధితులకు న్యాయం చేయాలని ఆగిపోయిన13 జిల్లాల స్పౌజులను, స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో దామోదర్ రెడ్డి, శంకరయ్య, అమరెందర్, సహదేవ్, సంతోష్, వరద రాజు, కరుణాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నియామక పత్రాలు అందచేత

**నవతెలంగాణ - వేములవాడ :** వేములవాడ నియోజకవర్గానికి చెందిన ముగ్గురు అంగన్వాడీ టీచర్లు, 21 మంది అంగన్వాడీ హెల్పర్లకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ముగిసిన తొలిమెట్టు శిక్షణ

**నవతెలంగాణ - వేములవాడ రూరల్ :** వేములవాడ రూరల్ మండ లం, హనుమాజీపేట గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో కొనసాగు తున్న తొలి మెట్టు శిక్షణ ముగిసినట్లు విద్యా శాఖ అధికారులు తెలిపారు. రెండు రోజుల శిక్షణలో భాగంగా ఆంగ్ల సబ్జెక్టు పై మంగళవారం శిక్షణ అందించారు. ఎఫ్ఎల్ఎన్ కోర్స్ డైరెక్టర్ మధుకర్, పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చిలుముల ప్రమీల, ఉమారాణి, ఆర్పీలు మాడిశెట్టి మహేష్, బిల్లా శ్రీకాంత్, సిఆర్పిలు రాజు, ఆకుల శ్రీనివాస్, నగేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ - వీర్నపల్లి :** విద్యార్థుల భవిష్యత్తుకు తొలిమెట్టు నాంది కావాలని ఎంఈఓ దుస రఘుపతి అన్నారు. మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారంతో శిక్షణ శిబిరం ముగిసింది. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి రవి, డిఆర్‌పిలు రామునాథ్‌రెడ్డి, రవి, నరేష్, ఆర్‌పిలు అరవింద్, రమాకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సాంఘీక సంక్షేమ కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీ

**నవతెలంగాణ - ఇల్లంతకుంట :** మండల కేంద్రంలో ఉన్న సాంఘీక సంక్షేమ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఖాళీ సీట్ల భర్తీ చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ శోభా రాణి మంగళవారం పేర్కొన్నారు. ఎంపిసి, బిపిసిలో ఖాళీ సీట్లు ఎస్‌సి, ఎస్టీ, బిసి, ఓసి అభ్యర్థుల నుండి పూర్తిచేస్తామన్నారు. అర్హులైన పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో ఈ నెల 14లోపు కలశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

# కిక్కే..కిక్కు..!





రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలకు టెండర్ ఖరారు చేయడంతో దరఖాస్తుల ప్రక్రియ జోరందుకుంటుంది. మద్యం దుకాణాలను సొంతం చేసుకునేందుకు వ్యాపారులు దరఖాస్తులను ఎక్సైజ్ అధికారులకు అందజేస్తూ ప్రాంతాలవారీగా సిద్ధమవుతున్నారు. ప్రస్తుత ఎక్సైజ్ పాలసీ నవంబరు 30తో ముగియనుండడంతో మూడు నెలల ముందే నోటిఫికేషన్ విడుదల చేశారు. గతంలో దరఖాస్తు చేసినప్పటికీ మద్యం దుకాణాలు రానివారు, ప్రస్తుతం షాప్ లు నడిపిస్తున్న మద్యం వ్యాపారులు మళ్లీ మద్యం శాపులను దక్కించుకునేందుకు సిద్ధమయ్యారు. జిల్లావ్యాప్తంగా మద్యం అమ్మకాలు రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోనే ఎక్కువగా అమ్మకాలు అవుతున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. గత జులై మాసంలో 61.కోట్ల39 లక్షల మద్యం అమ్మకాలు జరిగాయి.

నవతెలంగాణ-గోదావరిఖని

- దరఖాస్తులు సమర్పించేందుకు సన్నాహాలు
- ఆశలతో మద్యం వ్యాపారులు
- 20నెలల్లో రూ.24.82 కోట్ల మద్యం విక్రయాలు



2021-23 మద్యం షాపులకు చివరి పీరియడు నవంబర్ 30 వ తేదీ వరకు గడువు ఉండగా పెద్దపెల్లి జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు ఒక వెయ్యి 144 కోట్ల మద్యం అమ్మకాలు అయినట్లు ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. ఈనెల 4వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా మద్యం షాపులకు 2023-25 సంవత్సరానికి గాను నూతన దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమయ్యాయి. ఆగస్టు 4వ తేదీ నుంచి ఇప్పటివరకు మొత్తం 26 అప్లికేషన్లు నమోదు అయ్యాయి. పెద్దపెల్లి జిల్లా వ్యాప్తంగా 77 మద్యం షాపులు ఉన్నాయి. ఈనెల 4వ నుంచి కొనసాగుతున్న టెండర్ ప్రక్రియ 7వ తేదీ వరకు 16 అప్లికేషన్లు దాఖలైనట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఇందులో గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం నుంచి ఒకే షాపు నుంచి రెండు దరఖాస్తులు మహిళ అప్లికేషన్ దాఖలు చేశారు. 2019-2021 టెండర్ ప్రక్రియలో 74 షాపులకు గాను 780 దరఖాస్తులు నమోదు అయ్యాయి. రూ.15 కోట్ల 60 లక్షలు ఆదాయం లభించింది. 2021-2023 సంవత్సరానికి మరొక మూడు షాపులను అదనంగా జత చేశారు. జిల్లా వ్యాప్తంగా 77 షాపులుకు 1080 దరఖాస్తులు వచ్చాయి.

ఈ దరఖాస్తుల ద్వారా21 కోట్ల 60 లక్షల ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చింది. రాష్ట్ర యూనిట్ ప్రాతిపాదికన మద్యం షాప్ రిజర్వేషన్లు అమలు చేయడంతో జిల్లాలోని 77 మద్యం దుకాణాల్లో, గౌడ సామాజిక వర్గానికి,13, ఎస్సీలకు 8, రిజర్వు చేయబడినవి. 2021-23లో 77 షాపులకు , మద్యం వ్యాపారులు 1080 దరఖాస్తులు చేసుకున్నారు. ఈ దరఖాస్తుల ద్వారా దాదాపు రూ.21.60 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ సారి ఎన్నికల ప్రక్రియ

**పెద్దపెల్లి జిల్లా వ్యాప్తంగా మద్యం షాపుల వివరాలు :**
- పెద్దపల్లి జిల్లా కేంద్రంలో 20
- రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 27
- సుల్తానాబాద్‌లో 15
- మంథనిలో 15

మొత్తం పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా 77 మద్యం షాపులు ఉన్నాయి. ఇందులో ఎస్సీ సామాజిక వర్గానికి 8 రిజర్వేషన్ గౌడ కులస్తులకు 13 రిజర్వేషన్లు కేటాయించారు.

ఉండడంతో దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం లేకపోలేదు. మద్యం షాపులను దక్కించుకునేందుకు మహిళలు సైతం దరఖాస్తు చేస్తుకోవడానికి సిద్ధమయ్యారు. గతంలో కూడా మహిళల నుంచి దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 18వ తేదీ న ముగియ నుంది 15 రోజుల గడువు ఇవ్వడంతో మద్యం వ్యాపారులు ఎక్కువ దరఖాస్తులు సమర్పించడానికి సిద్ధమవుతున్నారు. తొలిరోజు 4 దరఖాస్తులు దాఖలు కాగా, సోమవారం 12 దరఖాస్తులు దాఖలయ్యాయి. గోదావరిఖని ప్రాంతం నుంచి ఒకే షాపు కు మహిళ వ్యాపారి రెండు దరఖాస్తులు సమర్పించింది. మంగళవారం వరకు మొత్తం 26 దరఖాస్తులు చేసుకున్నారు. ప్రతీ నెల రూ.61 కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. జిల్లాలోని 77 షాపుల ద్వారా 20 నెలల్లో రూ.1144 కోట్ల రూపాయల అమ్మకాలు జరిగాయి. దుకాణాలకు పెరగనున్న దరఖాస్తులు ప్రస్తుత మద్యం షాపుల గడువు నవంబర్ 30తో ముగియనుంది. జిల్లావ్యాప్తంగా 77 మద్యం దుకాణాల ద్వారా 1144 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. మరో మూడు నెలలు మద్య విక్రయాలకు గడువు ఉండడంతో సుమారు మరో 300 కోట్ల వరకు అమ్మకాలు జరిగే అవకాశం ఉంది. గత నెల రూ.61 కోట్లకు పైగా మద్యం విక్రయాలు కొనసాగాయి. జిల్లాలో 77 దుకాణాలు ఉండగా మద్యం విక్రయాల్లో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 27 అత్యధికంగా దుకాణాలు ఉన్నాయి. గోదావరిఖని కార్మిక క్షేత్రంలో ఎక్కువ మొత్తంలో అమ్మకాలు జరిగాయి.

**పాత విధానంలోనే మద్యం షాపు లైసెన్సు, దరఖాస్తు ఫీజు కొనసాగుతోంది ...**

మద్యం షాపు లైసెన్స్ ఫీజు, దరఖాస్తు ఫీజులన్నీ పాత విధానంలో ఉన్నవాటినే ఖరారు చేశారు. 2023-25 వరకు ఎక్సైజ్ పాలసీ విధానం ప్రకారం ఒక్కో షాపు దరఖాస్తుకు 2 లక్షల ఫీజు, జనాభా ప్రాతిపదికన ఏడాదికి ఒక్కో మద్యం షాపుకు లైసెన్స్ ఫీజు గరిష్టంగా రూ. 50 నుంచి 65 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుంది. రామగుండం ప్రాంతం, గోదా వరిఖని పట్టణంలో ప్రతిషాప్ కు రూ. 65 లక్షల లైసెన్స్ ఫీజును ఖరారు చేశారు. ఈ లైసెన్స్ ఫీజును 6 వాయిదాల్లో చెల్లించేందుకు అవకాశం కల్పించారు.

**వైన్ షాప్ టెండర్లపై అవగాహన**



రాష్ట్రంలో నిర్వహించబడుతున్న మద్యం దుకాణాల టెండర్లపై అవగాహన సదస్సును నిర్వహించనున్నాం. ఎన్టీపీసీ కృష్ణ నగర్‌లోని శ్రీ మయి గ్రాండ్ హోటల్‌లో బుధవారం ఉదయం 10గంటలకు ఈ అవగాహన సదస్సు ప్రారంభం అవుతుంది. ఆసక్తి గల సివిల్, సింగరేణి, ఎన్టీపీసీ కాంట్రాక్టర్లు, పెట్రోల్ పంపు ఓనర్లు, ఫంక్షన్ హాల్ ఓనర్లు, ఇతర వ్యాపారస్తులు, సామాన్య ప్రజలు హాజరై తమ సందేహాలు తీర్చుకోవాలి.

-ఎస్.రమేష్, రామగుండం ఎక్సైజ్ సిఐ

## సంపూర్ణ ఆరోగ్యంపై ప్రజలు శ్రద్ధ వహించాలి



సూరయ్యపల్లిలో కార్మికులతో చెత్తచెదారాన్ని తొలగిస్తున్న పంచాయతీ కార్యదర్శి మౌనిక

నవతెలంగాణ-మంథని

ప్రజలు, ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూరయ్యపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి మౌనిక కోరారు. గ్రామంలో మూడు రోజుల నుంచి ప్రతి వార్డులో మురికి కాలువలు, పిచ్చి మొక్కలు, నాలీలు, శుభ్రపరిచి, చెత్తచెదారని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. గ్రామ పరిశుభ్రతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి ఆవరణలో మొక్కలను నాటుకోవాలని సూచించారు. వారి నివాస గృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. ఆమె వెంట స్థానిక పాలకవర్గ సభ్యులు,ప్రజలు ఉన్నారు.

## త్వరితగతిన మొక్కలను నాటాలి

- అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

నవతెలంగాణ-మంథని



మొక్కకు నీరు పోస్తున్న అరుణశ్రీ

మొక్కలను నాటుటకు అనువైన స్థలములను గుర్తించి త్వరితగతిన మొక్కలను నాటాలని అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థల)అరుణ శ్రీ అధికారులకు సూచిం చారు. మంగళవారం అడిషనల్ కలెక్టర్ (స్థానికసంస్థల)అరుణశ్రీ అధికారులతో కలిసి సిరిపురం, గుంజపడుగు, ఉప్పట్ల, బ్యారేజ్, పంప్ హౌస్ ఆవరణలో హరితహారంలో భాగంగా వృక్షసంపద వనాలలో నాటిన మొక్కలను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారిశ్రీధర్,జిల్లా అటవీ శాఖ అధికారి శివయ్య,మండల పరిషత్ అభివృద్ధి అధికారి రమేష్, ఎంపీవో ఆరిఫ్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, డీఆర్వో రమేష్, ఈజీఎస్ ఏపీవో సదానందం పాల్గొన్నారు.

## తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- మండల విద్యాధికారి పినుమల్ల ఛాయదేవి

నవతెలంగాణ-ధర్మారం



ఉపాధ్యాయులతో ఎంఈవో

విద్యార్థులు కనీస సామర్థ్యాలను సాధించేలా చేయడమే తొలిమెట్టు ముఖ్య ఉద్దేశ్యం అని మండల విద్యాధికారిణి పెనుమల్ల ఛాయాదేవి అన్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ మంగళవారం రోజు వరకు ధర్మారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఎంఈవో ఛాయాదేవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 23,179 ప్రాథమిక పాఠశాలల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. దీని ద్వారా 11,24,563 మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తొలిమెట్టు మండల నోడల్ ఆఫీసర్ దామోదర్, పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విట్టల్, రిసోర్సు పర్సన్లు వెంకటరమణరెడ్డి, రాజేశం, జాడి శ్రీనివాస్, నూతి మల్లయ్య పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవాల

నవతెలంగాణ-ధర్మారం

మండలంలోని బొమ్మ ఒడ్డి పల్లి గ్రామం అంగన్వాడి కేంద్రంలో ధర్మారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు పుచ్చకాయల మునీందర్ రెడ్డి ఆధ్వర్యంలో తల్లిపాల విశిష్టతను వివరించారు. ధర్మారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు పుచ్చకాయల మునిందర్ రెడ్డి, కార్యదర్శి నాడెం శ్రీనివాస్, కోశాధికారి ఉప్పులంచ దయానంద్, గ్రామ సర్పంచ్ ప్రేమలత తిరుపతి రెడ్డి, ఎంపిటిసి వేణుగోపాల్ రెడ్డి, అంగన్వాడి సూపర్వైజర్ బ్రాండిన, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

## ఆదాయం సర్టిఫికెట్ లేకున్నా దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ -సుల్తానాబాద్ రూరల్

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునే లబ్దిదారులు కులం, ఆదాయం సర్టిఫికెట్ల లేకున్నా మిగతా డాక్యుమెంట్లు జతపరిచి గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు ఒక ప్రకటనలో సూచించారు.

**ధర్మారం:** గృహలక్ష్మి పథకం దరఖాస్తుల గడువు పొడిగించాలని మంగళవారం తహసిల్దార్ కార్యాలయంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సిపెల్లి రవీందం వినతిపత్రం అందజేశారు

**రామగిరి:** గృహలక్ష్మి పథకానికి గడువు పెంచాలని డిప్యూటీ తహసీల్దార్ రాకేష్‌కు బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి జనగామ రవి కుమార్ మంగళవారం వినతి పత్రం అందజేశారు. బీఎస్పీ మంథని నియోజకవర్గ ఉపాధ్యక్షులు నాగరాజు, రామగిరి మండల అధ్యక్షులు మల్లేష్ పాల్గొన్నారు.

**గోదావరిఖని:** గహలక్ష్మి పథకానికి దరఖాస్తును గడువు తేదీ ముగిసే లోగా నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో అందజేయవచ్చుని నగర కమీషనర్ సుచరణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## పటిక పట్టివేత

నవతెలంగాణ-గోదావరిఖని క్రైం:

రామగుండం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్, పెద్దపల్లి జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీముల ఆధ్వర్యంలో సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో అక్రమంగా తరలిస్తున్న పటికను మంగళవారం పట్టుకున్నారు. ఎక్సైజ్ సిఐలు రమేష్, వినోద్‌లు తెలిపిన వివరాల ప్రకారం బసంత్ నగర్‌కు చెందిన ముద్దంగుల శ్యామ్ చదువు మధ్యలో ఆపివేసి జులాయిగా తిరిగేవాడని, సులభంగా డబ్బు సంపాదించడం కోసం మహారాష్ట్రలోని వీరుర్ నుంచి రైలు మార్గంలో పటిక అక్రమ రవాణా చేసి గ్రామంలోని గుడుంబా తయారీదారులకు అమ్మేవాడన్నారు., ఎక్సైజ్‌శాఖ వారు తనిఖీలు ముమ్మరం చేసి కేసులు చేయడంతో పటికను ధర్మపురి నుండి తేవడం మొదలుపెట్టాడని తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ధర్మపురి పట్టణంలో కిరాణా వ్యాపారం చేసే ఇమ్మడి రాజన్న నుంచి 60 కేజీల కొని బసంత్ నగర్‌కు ద్విచక్ర వాహనంపై తెస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన పటిక విలువ 6000 రూపాయలు, బైక్ విలువ 50 వేలు ఉంటుందని తెలిపారు. దాడుల్లో ఎస్సై శారద, సిబ్బంది ప్రశాంత్, రమేష్, గీత ఉన్నారు.

## సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం


నవతెలంగాణ-గోదావరిఖని:

గోదావరిఖని మార్కండేయకాలనీలోని విశ్వహిందూ పరిషత్ భవన్‌లో బిఎంఎస్ అనుబంధ సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏరియా సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. అధ్యక్షులు బూర్ల లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా ప్రధాన కార్యదర్శి మండ రమాకాంత్ పాల్గొని మాట్లాడారు. పదవి విరమణ పొందిన కార్మికులు వైద్యం పొందడంలో అనేక ఇబ్బందులు పడుతున్నారని, సింగరేణి యాజమాన్యం ప్రత్యేక చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు విజయగిరి వెంకటేశ్వర్లు, పిన్నింటి శ్రీనివాస్ రెడ్డి, భూసారపు ఎల్లయ్య, వేముల చంద్రమౌళి, వెంకటస్వామి, వేపూరి రాములు గౌడ్ తదితరులున్నారు.

## సకాలంలో సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్

నవ తెలంగాణ- పెద్దపల్లి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్

సకాలంలో సిఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. మంగళవారం స్థానిక సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ సీఎంఆర్ రైస్ డెలివరీపై సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైస్ మిల్లర్లు సకాలంలో గడువులోగా సీఎంఆర్ పూర్తి చేయాలని ఖరీఫ్ , రబీ సిఎంఆర్ త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు రైస్ ఉత్పత్తిలో వేగం పెంచి లక్ష్యం మేరకు సిఎంఆర్ రైస్ డెలివరీ చేయాలనీ, ఖరీఫ్ పంటకు సంబంధించిన పెండింగ్ ఉన్న సిఎంఆర్ రైస్ డెలీవరి దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మేనేజర్ సివిల్ సప్లై శ్రీకాంత్, సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ లు, మిల్లర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐగా ఎంపికైన నిరుపేద మహిళ

నవతెలంగాణ-గోదావరిఖని క్రైం:



ఏలూరి రవళి

గోదావరిఖని సంజయ్ గాంధీ నగర్ నివసించే నిరుపేద కుటుంబానికి చెందిన కీ॥శే ఏలూరి లింగారెడ్డి పారిశ్రామిక ప్రాంతంలో శుభకార్యాలకు వంటలు వండుతూ జీవనం కొనసాగించే వాడు. ఏలూరి లింగారెడ్డి వసంత నాలుగో అమ్మాయి ఏలూరి రవళి. ఇటీవల జరిగిన ఎస్ఐ సెలక్షన్స్‌లో సివిల్‌లో కాళేశ్వరం జోన్ ఎస్సైగా సెలెక్ట్ అయ్యింది. పెళ్లి అయినా కష్టపడి చదివి ఎస్సైగా సాధించినందుకు తన భర్త శ్రీధర్ రెడ్డి భర్త కృషి ఎంతో ఉందని రవళి చెప్పింది. రవళికి గోదావరిఖని చెందిన ఆటో యూనియన్ నాయకులు నీలారపు రవి, జిల్లెల్ల రామ్ రెడ్డి, సంజయ్, గాంధీనగర్ బస్తీవాసులు రవళిని అభినందించారు.

## స్కూల్ స్వీపర్ల సమస్యలను పరిష్కరించాలని

నవతెలంగాణ-పెద్దపల్లి

గత 30 రోజులుగా స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని నిరవధిక సమ్మెలో ఉన్న స్కూలు స్వీపర్లు మంగళవారం జడ్పీ చైర్మన్ పుట్ట మధు కి జడ్పీ ఆఫీసులో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో స్కూల్ స్వీపర్లు పని చేస్తున్నారని, పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాలు కూడా అమలు కావడం లేదని అన్నారు. పర్మి నెంట్ చేయాలన్నారు. సీఐటీయూ నాయకులు జ్యోతి, స్కూల్ స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్ష కార్యద ర్శులు లక్ష్మణ్, రాయలింగు, లక్ష్మి ,స్వామి, రాజయ్య, అనసూర్య కనకయ్య పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు పెన్షన్ మంజూరు చేయాలి

నవతెలంగాణ-రామగిరి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

57 సంవత్సరాల నిండిన తెలంగాణ ఉద్యమకారులకు పెన్షన్‌తో పాటు ఉపాధి కల్పించాలని డివిజన్‌లోని తెలంగాణ ఉద్యమ ధూమ్ ధామ్ కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షులు నూనె రాజేశం మంగళవారం జాయింట్ కలెక్టర్ స్వామిలాల్‌కు వినతి పత్రం అందజేశారు.ఇప్పటికైనా నిజమైన ఉద్యమ కళా కారులను గుర్తించి కళాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని అన్నారు. ఆయన వెంట డివిజన్ ఉపాధ్యక్షుడు దుబాసి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులిపాక బానేశ్, సహాయ కార్యదర్శి వడ్లకొండ రవివర్మ, కార్యవర్గ సభ్యులు ఐతోజు రాజు, బందెల సంపత్, గాజుల రమేష్ పాల్గొన్నారు

## గుడిసెలు వేసుకున్న వారందరికీ పట్టాలు ఇవ్వాలి

- సీపీఎం ఎన్టీపీసీ ఏరియా కమిటీ కార్యదర్శి రామాచారి



మాట్లాడుతున్న సీపీఎం ఎన్టీపీసీ ఏరియా కమిటీ కార్యదర్శి రామాచారి

నవతెలంగాణ-గోదావరిఖని:

గుడిసెలు వేసుకున్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఐదు నెలల నుండి ఇండ్లస్థలాలు ఇవ్వాలని 2వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ లో సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని పేద ప్రజలు పోరాటం నిర్వహిస్తున్నారు. మంగళవారం గుడిసె వాసుల సమావేశంలో సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారి మాట్లాడుతూ ఇంటి స్థలం ఉన్న వారు గహలక్ష్మి పత కానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయమన్నారు. నాయకులు ఉపేందర్, రమణ, మాధవి, భాగ్య, మహాలక్ష్మి, గీతాంజలి, పుష్ప, నిర్మల ఉన్నారు.

## మహాలక్ష్మి ఆలయానికి రూ.58,370 ఆదాయం

నవతెలంగాణ-మంథని

మంథని శ్రీమహాలక్ష్మి అమ్మవారికి భక్తులు సమర్పించిన(సారె)చీరలను తిరిగి భక్తులు పొందడం కోసం ఆలయ ఆవరణలో వేలం విక్రయించగా రూ.58,370 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మారుపాక చంద్రకళ-రమేష్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సుజాత మేనేజర్ రాజ్‌కుమార్‌లు మంగళవారం తెలిపారు. కమిటీ డైరెక్టర్లు పోతరాజు వెంకటలక్ష్మి, విజయలక్ష్మి ఉన్నారు.

# భూముల క్రమబద్ధీకరణకు ప్రత్యేక కార్యాచరణ

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవ తెలంగాణ -పెద్దపల్లి



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రభుత్వ ఉత్తర్వు 59 క్రింద భూముల క్రమబద్ధీకరణ కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి నిర్దేశించిన రుసుము వసూలు చేయాలని జి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో జీవో 59 భూముల క్రమ బద్ధీకరణ, ఇంటి పట్టాల పంపిణీ, గృహలక్ష్మి పథకం వంటి అంశాలపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ తో కలిసి తహసీల్దార్లతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వు 59 క్రింద మొదటి దశలో మన జిల్లాలో క్రమబద్ధీకరణ కోసం 664 మంది దరఖాస్తుదారులలో ఇప్పటివరకు 27 మంది మాత్రమే పూర్తిగా నిర్దేశించిన రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకున్నారన్నారు. 10 మంది వరకు మొదటి, రెండు విడతల చెల్లింపు చేశారని, 627 మంది దరఖాస్తుదారులు రుసుము చెల్లింపు ప్రక్రియ ప్రారంభించలేదన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 59 క్రింద రెండవ విడతలో వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను ఎంపిక చేయాలన్నారు. ఆగస్టు 10 వరకు గృహలక్ష్మి పథకం క్రింద దరఖాస్తు స్వీకరించేందుకు ప్రభుత్వం గడువు నిర్దేశించిందని కలెక్టర్ తెలిపారు. పాలకుర్తి మండలంలోని ఎసాల తక్కలపల్లి, మంథని మండలంలోని ఏక్లాస్‌పూర్, సుల్తానాబాద్ మండలంలోని రెబ్బదేవపల్లి, శ్రీరాంపూర్ మండలంలోని తారుపల్లి గ్రామాల్లో బలహీనవర్గాలకు ఇంటి స్థలాల పంపిణీ కోసం 11 ఎకరాల భూమి అందుబాటులో ఉందని, వీటిని 442 ప్లాట్లుగా విభజించామని, 132 ప్లాట్ల ఇంటి పట్టాలను లబ్దిదారులకు పంపిణీ చేశామన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి మధుమోహన్, కలెక్టరెట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ ఈ - సెక్షన్ సూపరింటెండెంట్ పుష్పలత, తహసీల్దార్ పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై జీఎంల సమీక్ష





సమావేశంలో మాట్లాడుతున్న జీఎం మనోహర్

నవతెలంగాణ-గోదావరిఖని:

సింగరేణి ఆర్జీ 1 ఏరియాలో నిర్వహించే 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జీఎం చింతల శ్రీనివాస్ అన్ని డిపార్ట్‌మెంట్ల అధికారులతో మంగళవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జీఎం కార్యాలయంలో పెద్ద ఎత్తున జెండా ఆవిష్కరణ కార్యక్రమం, పలు సాంస్కృతి కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగులకు సన్మాన కార్యక్రమంకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డిపార్ట్‌మెంట్‌ల వారిగా కేటాయించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఎం.రామ్ మోహన్, డీజీఎం పర్సనల్ సిహెచ్.లక్ష్మి నారాయణ, ఏజీఎం సివిల్ నవీన్, ఏజీఎం ఐఈడి ఆంజనేయులు, డీజీఎం ఏరియా వర్క్ షాప్ మధన్ మోహన్, డీజీఎం టీటీసీ వెంకటరమణ ఉన్నారు. భద్రత మనందరి బాధ్యతని సింగరేణి ఆర్జీ 1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. సింగరేణి ఆర్జీ 1 పరిధిలోని జీడికె 1, 3వ గనిలో భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**యైటింక్లైన్ కాలనీ:** ఆర్జీ-2 జీఎం కార్యాలయంలోని కన్ఫరెన్స్ హాల్ నందు మంగళవారం ఏరియా జనరల్ మేనేజర్ ఎ.మనోహర్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలపై ఏరియా ముఖ్య అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆగస్టు 15న నిర్వహించే వేడుకలను కమ్యూనిటీ హాల్ 8వకాలనీ నందు ఘనంగా నిర్వహించనునట్లు ఏరియా జనరల్ మేనేజర్ ఎ.మనోహర్ తెలిపారు. మొదట జాతీయ జెండా ఆవిష్కరణ, సెక్యూరిటీ సిబ్బందిచే గౌరవ వందనం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో వకీల్ పల్లి ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఓ టు జిఎం అబ్దుల్ సలీం, ఏరియా రక్షణ అధికారి బి.రవీందర్, ఏరియా ఇంజినీర్ నర్సింహారావ్, డిజిఎం పర్సనల్ అధికార ప్రతినిధి జి.రాజేంద్రప్రసాద్, డిజిఎం వర్క్ షాప్ ఎర్రన్న, డిజిఎం సివిల్ ధనుంజయ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మాటలను నమ్మి మోసపోవద్దు

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

కాంగ్రెస్ పార్టీ కల్ల బొల్లి మాటలను నమ్మి మోసపోవద్దని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కార్యకర్తలకు సూచించారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పెద్దపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుల కల్లి బొల్లి మాటలను నమ్మి మోసపోవద్దని అన్నారు. దశాబ్దాల కాలంగా పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఏమి ఒరగబెట్టిందో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ, జిల్లా కో ఆర్డినేటర్, మండల పార్టీ అధ్యక్షుడు,వైస్ ఎంపీపీ, డైరెక్టర్ లు,రైతు సమితి మండల కో ఆర్డినేటర్, జిల్లా డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

## మహిళా సాధికారత కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-గోదావరిఖని:

ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆదేశాలతో విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 41వ డివిజన్ గాంధీ నగర్‌లో మహిళా సాధికారత కేంద్రంను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా కో ఆప్షన్ సభ్యురాలు తస్లిమా భాను హాజరై రిబ్బన్ కట్ చేసి కుట్టు మిషన్ శిక్షణాకేంద్రాన్ని ప్రారంభించారు. విజయమ్మ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఎడెల్లి శ్యామ్, సెక్రటరీ సిద్దార్థ్, మహిళలు శబ్నం, నైమ, బిల్కీస్, హీనా, నస్రీన్, షహనాజ్, ఫర్జానా, కరీమున్నిస, నేహా, ఫరీదా, తాజ్, భాను, రేష్మ ఉన్నారు.

## రవాణరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ - పెద్దపల్లి/పెద్దపల్లి టౌన్

రవాణ రంగ కార్మికులకు వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ (సిఐటీయూ) రాష్ట్ర కమిటీ సభ్యులు వేల్పుల కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ వేశారు.మంగళవారం తెలంగాణా పబ్లిక్, ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా చేసి అదనపు కలెక్టర్ అరుణశ్రీ కి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఏ.ఐ.ఆర్.టి.డబ్ల్యూ.ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు వేల్పుల కుమారస్వామి మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచే రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మొండేడ్డుల మల్లేష్, ప్రధాన కార్యదర్శి బెతి రవి, కోశాధికారి పంజాల శ్రీనివాస్, వీరేశం, పడాల పర్శురాం, చాట్ల దిలీప్, దసారపు రవీందర్, సతీష్ పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణం పనులను పర్యవేక్షించిన మేయర్

నవతెలంగాణ-గోదావరిఖని:

రామగుండం కార్పొరేషన్ 42వ డివిజన్ ఊర్వశీ థియేటర్ ముందు సిసి రోడ్డు నిర్మాణం పనులను మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, ఆ డివిజన్ కార్పొరేటర్ బాలరాజ్‌కుమార్‌తో కలిసి పర్యవేక్షించారు. సిసి రోడ్డు నిర్మాణం పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఊర్వశి థియేటర్ మేనేజర్ నరసింహారెడ్డి, నాయకులు, స్థానికులు గుండ రమేష్, ముత్యాల శ్రీనివాస్, నరేండ్ల రవి ఉన్నారు.

9 మానవి
www.navatelangana.com కరీంనగర్
బుధవారం 9 ఆగస్టు 2023

# ఆగని..సాంఘిక దురాచారం..



దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏండ్లు గడుస్తున్నా దేవుడి పేరుతో జరిగే అరాచకం మాత్రం ఆగడం లేదు. సంస్కృతి, సాంప్రదాయాల పేరిట జోగినీ వ్యవస్థను కొనసాగిస్తున్నారు. ఊరడమ్మ, పోచమ్మ పండుగ లంటూ ఈ హైటెక్ యుగంలోనూ జోగినీలతో నాట్యం చేయిస్తూ, వేపకొమ్మలతో అలంకరించి ఊరేగిస్తున్నారు. అయినా ఎవరూ నోరు తెరిచి ఈ సాంఘిక దురాచారాన్ని వ్యతిరేకించరు. అగ్ర వర్గాల ఆనందం కోసం బడుగు బలహీనలు మౌనంగా వీటిని భరించాల్సి వస్తుంది. అలాంటి జోగినీల దుర్భరమైన జీవితాల గురించి నేటి మానవిలో...

తరతరాలుగా రాజులు, జమీందార్ల ఏలుబడిలో గుడుల్లో మహిళలు దుర్భరమైన జీవితాన్ని అనుభవించారు. నిరుపేద దళిత యువతులను జోగినిగానో, దేవదాసిగానో, మాతంగిగానో మార్చేవారు. సాంప్రదాయాల పేరుతో దేవుని బిడ్డగా ప్రచారం చేసి వారి శరీరాలతో ఆటలాడారు. రాజుల కాలం, గడుల కాలం పోయినా నేటికీ అలాంటి ఆకృత్యాలను మన రాష్ట్రంలో జరుగుతూనే ఉన్నాయి. బలవంతంగా జోగినిగా మార్చేసిన మహిళను ఆధిపత్య కులాల్లోని ప్రతి ఒక్కరూ లైంగికంగా వాడుకుంటున్నారు. ఇక జీవితాంత ఆమె వారి అకృత్యాలకు భరించాల్సిందే.

ఆమెను గుడికి సంబంధించిన దానిగా 'గుడిచేటి' అని అనే పేరుతో పిలుస్తుంటారు. సాలెగూడులో చిక్కుకున్నట్లు ఆ జోగిని ఎటూ తప్పించుకోలేని స్థితిలో, దారుణమైన మానసిక వేదనను అనుభవిస్తూ ఉంటుంది. ఒక్కోసారి తినడానికి తిండిలేక ఇల్లిల్లు తిరిగి అడుక్కోవాల్సి వచ్చేది. ఇప్పటికీ వారి పరిస్థితులలో ఎలాంటి మార్పు రాలేదు. జోగినిలను ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలుస్తారు. పేర్లేమైనా పెత్తందార్లు వాళ్ళను ఉపయోగించుకునే తీరు ఒక్కటే. దేవుడి పేరుతో, గుడి పేరుతో జరిగిన, జరుగుతున్న దౌర్జన్యాలకు ఉదాహరణ ఇది. బసవి, మాతంగి, దేవదాసి వ్యవస్థలు వాస్తవానికి 1988లో రద్దయ్యాయి. ప్రముఖ కవి గుర్రం జాషువా కూతురు హేమలత లవణం చేసిన పోరాట ఫలితంగా ఈ దురాచారాలు అధికారికంగా రద్దయ్యాయి. అయినా సాంప్రదాయం పేరుతో ప్రభుత్వాలు సైతం వాటిని ప్రోత్సాహిస్తూనే ఉన్నారు.

### మూఢ నమ్మకమే ఆచారంగా....

ఈ ఆధునిక యుగంలో కూడా చాలా గ్రామాల్లో మూఢ నమ్మకాలతో జనం మోసపోతున్నారు. నిరక్షరాస్యులయిన అమాయక ప్రజల అవసరాను అవకాశంగా తీసుకుని పిల్లలు పుట్టడం లేదనో, కలిగినా, పుట్టిన వెంటనే చనిపోతున్నారని.. లేదా ఇంట్లో వారికి ఏదో జబ్బు వచ్చిందని.. ఇలా కారణం ఏదైనా కావొచ్చు. సందర్భం ఏమైనా కావొచ్చు, ఈ వ్యవస్థ మాత్రం మూఢ విశ్వాసంలోంచి మొలకెత్తిందే. మరో వైపు దైవార్పితం అనే మరో అంధ విశ్వాసాన్ని బలపరుస్తూ, ఒక అమ్మాయిని ఊరికి ఉమ్మడి ఆస్తిగా పరిగణిస్తున్నారు. అమ్మాయి తల్లిదండ్రులు మనసులో ఎల్లమ్మ, పోచమ్మ వంటి దేవతల్ని తలుచుకుని, తమ కూతుర్ని జోగినిగా మారుస్తారు. అలా ఆ దేవత పేరుమీద ముడుపులు కడతారు. మనకు ఉన్న వేల వేల మూఢ విశ్వాసాల్లో ఇదీ ఒకటి. ఆ తర్వాత వారి జీవితాలు మెరుగుపడితే ఆ తల్లి కటాక్షమని సంతోషపడతారు. లేదంటే ఆ తల్లి మనసు ఇంకా కరగలేదని ఓపిక పడతారు.

### జోగినిగా మార్చిన తర్వాత...

ఆ ఊరిపెద్దగానీ, పోతురాజు గానీ లేదంటే ఆ అమ్మాయికి బావ వరుస అయిన వ్యక్తిగాని ఆమె మెడలో తాళి కడతాడు. దానితో మైలపట్టం కార్యక్రమం పూర్తవుతుంది. ఇక అప్పటి నుండి ఊరి పెత్తందార్లు, భూ స్వాములు ఆమెను లైంగికంగా వాడుకుంటూ ఉంటారు. యవ్వనంలో ఉన్నంత వరకే ఏ మాతంగి, ఏ దేవదాసి, ఏ జోగిని జీవితమైనా తిండికి లోటు లేకుండా జరుగుతుంది. యవ్వనం తరిగిపోవడంతో వారికి కష్టాలు ప్రారంభమవుతాయి. దగ్గరికి వచ్చే వాళు ండరు. తిండిపెట్టే వాళ్ళూ ఉండరు.





### ఎన్నాళ్ళని భరిస్తారు

అందరూ దేవుడుని తండ్రితో సమానం అని అంటున్నారు. నిజమే దేవుడు తండ్రి అయితే ఆయనను పెండ్లి చేసుకున్న జోగిని తల్లి కాదా? మరి ఆమె ఊరి పెత్తందార్ల ఉమ్మడి సోత్తు ఎలా అయ్యిందీ? అవేవి పట్టించుకోకుండా వారి కోరిక తీర్చే వస్తువుగా ఆమెను భావిస్తారు. మతం, దేవుడు, గుళ్ళ, మనుస్మృతి ఆసరాతో శతాబ్దాలుగా మహిళల్ని మరబొమ్మలుగా చేస్తున్న ఈ వ్యవస్థల్ని ఇంకా ఎన్నాళ్లు భరిస్తారు? చివరి దశలో ఆ మహిళలు అంతులేని సుఖవ్యాధులతో దుర్భమైన చావులు చస్తున్నా వారిని పట్టించుకునే వారు లేరు. వారు చనిపోయినా తర్వాత వారికి పుట్టిన బిడ్డల పరిస్థితి కూడా అంతే. లైంగిక హింసకు బలవుతూ బతికే ఇలాంటి జీవితాల గూర్చి ప్రభుత్వాలు ఎందుకు పట్టించుకోరూ? మూఢ విశ్వాసాలను నివారించాల్సింది పోయి పాలకులే ప్రోత్సహిస్తున్నారు. దళిత మహిళలను బలితీసుకుంటున్న ఇలాంటి అంధవిశ్వాసాలపై కలిసికట్టుగా ఉద్యమించాలి.



### రఘునాథ కమిషన్ ద్వారా...

ప్రభుత్వం నియమించిన రఘునాథ కమిషన్ ద్వారా ఈ సాంఘిక దురాచారమైన జోగిని వ్యవస్థను రూపుమాపాలని కుల వివక్ష పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్ డిమాండ్ చేశారు. 1992లో ఈ సాంఘిక దురాచారానికి వ్యతిరేకంగా హేమలత లవణం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు .దాంతో ప్రభుత్వం ఈ దురాచారాన్ని నిలిపివేసి జోగినిలకు భూములు, గేదెలు ఇచ్చి ఉపాధి కల్పించింది .అయినా కుల పెద్దలు, పెత్తందారులు వారిని ఉపాధి చేసుకోనీయకుండా భూములను తక్కువ ధరలకు తీసుకొని వేశ్యా వృత్తిని కొనసాగేలా చేశారు. దీంతో గంగాధర్ ప్రభుత్వం ఈ దురాచారంపై దృష్టి సారించి నిషేధించాలని కోరారు. వారికి సమాజంలో సమాన హక్కులు, కనీస గౌరవం ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వం రఘునాథ కమిషన్ అమలు చేయడం ద్వారా ఈ దురాచారాన్ని పూర్తిగా రూపుమాపేలా చేయవచ్చని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. నేటికీ జిల్లాలో పలు ప్రాంతాలలో ఈ జోగిని దురాచారం కొనసాగించడం దురదృష్ట కరమన్నారు. కావున ప్రభుత్వం ఈ సాంఘిక దురాచారం నుండి వారిని విముక్తి చేయాలని కోరారు.

– లింబూరి. లక్ష్మణ్
బోధన్

ఇల్లు మారేటపుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అద్దె, పరిసరాలు, వసతులు ఇలా చాలానే ఉంటాయి. అన్నీ సరిగా తెలుసుకోకుంటే ఇబ్బందులు ఎదురవుతాయి. మరి ఎలాంటి టిప్స్ పాటించాలో చుద్దామా...

# అద్దె ఇంటికి ఈ జాగ్రత్తలు తప్పనిసరి...



### పరిసరాలు...

ఇల్లు మారాలనుకున్నప్పుడు పరిసరాలు చాలా ముఖ్యం. అన్ని వసతులు దగ్గరగా ఉన్నవా లేవా పరిశీలించుకోవాలి. పిల్లల స్కూల్, షాపింగ్, హాస్పిటల్స్ కూడా దగ్గరగా ఉండేలా చూసుకోవాలి. ఇవన్నీ అందుబాటులో ఉంటే ఇబ్బంది ఉండదు. బయటికి ఎక్కడికి వెళ్లాలన్నా సమస్య అవ్వదు. సమయం కూడా కలిసి వస్తుంది. గ్యాస్, కరెంట్, డ్రైనేజీ వంటి సౌకర్యాలు ఉన్నాయో లేదో ముందే చూడాలి. దీని వల్ల ఇంట్లోకి దిగాక కూడా ఎలాంటి సమస్యలు రావు.

### సెక్యూరిటీ..

ఇల్లు తీసుకునే ముందు సెక్యూరిటీ ఉందో లేదో పరిశీలించుకోవాలి. గేటెడ్ కమ్యూనిటీలో ఉంటే ఫుల్ సెక్యూరిటీ ఉంటుంది. అలాంటి ఇంటిని ఎంచుకోవడం మంచిది.

### పెంపుడు జంతువులు..

చాలా మంది జంతువుల్ని పెంచుకుంటారు. అలాంటి అలవాటు ఉంటే దాని గురించి ముందుగానే ఓనర్‌కి చెప్పాలి. చుట్టుపక్కల అబ్జెక్షన్ చెప్పేవారున్నారా అని వివరాలు కూడా తెలుసుకోవాలి.

### విస్తీర్ణత...

ఇంట్లో ఎన్ని రూములున్నాయి.. అనుకూలంగా ఉన్నాయా లేదా.. అందులో వస్తువులన్నీ సరిపోతాయా లేదా చూసుకోవాలి. అలా కాకుండా చాలీచాలని ఇల్లు తీసుకుంటే మొదట్లో సర్దుకుపోయినా రానురాను ఇబ్బందులు ఎదురవుతాయి. చికాకులు పెరుగుతాయి. అలాగే ఇంట్లో ఏమైనా పగుళ్ళు ఉన్నాయా.. నాచులు, అచ్చులు ఉన్నాయా అని కూడా చూసుకోవాలి.. ఇవి పరిశీలించుకోకున్నా... సమస్యలు ఎదురవుతాయి.

### పార్కింగ్, అగ్రిమెంట్..

పార్కింగ్ ప్లేస్ కూడా చూసుకోవాలి. కారు ఉన్నా బైక్ ఉన్నా పార్కింగ్ ప్లేస్ సరిపోతుందో లేదో చూసుకోవాలి. ఇల్లు అగ్రిమెంటు చదివి అర్థమైందనుకున్నాక, అందులోని షరతులు అనుకూలంగా ఉన్నాయనుకుంటేనే సంతకం పెట్టాలి. లేకపోతే చివరికి నష్టపోవాల్సి వస్తుంది.

### మెయింటనెన్స్..

ఇంటికి మెయింటనెన్స్ ఎలా ఉంటుందో వివరాలు ముందే తెలుసుకోవాలి. అది ఎవరు చెల్లిస్తారో, ఎంతెంత ఉంటుందో, అంతకు ముందు ఉత్పన్నమైన సమస్యలు ఏమైనా ఉన్నాయో లేదో కూడా వివరంగా తెలుసుకోవడం చాలా ముఖ్యం.

ఇలాంటి టిప్స్ పాటించడం వల్ల మున్ముందు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

## ఏకపక్ష చర్య

**తిరువనంతపురం :** దేశంపై ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని రుద్దాలని కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకుంటున్న తొందరపాటు చర్యలను కేరళ శాసనసభ నిరసించింది. ఇటువంటి చర్యలు రాజ్యాంగ లౌకిక స్వభావానికి విరుద్ధమని అభిప్రాయపడింది. ఈ మేరకు శాసనసభలో మంగళవారం ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. యూసీసీ యోచనను విరమించుకోవాలని ఆ తీర్మానంలో కేంద్రాన్ని కోరారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ కూటమి సమర్ధించింది. యూసీసీ అమలుకు నిరసనగా సీపీఐ (ఎం), కాంగ్రెస్ పార్టీలు ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో సెమినార్లు నిర్వహించాయి. 'యూసీసీ అమలుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలపై కేరళ శాసనసభ ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీనిని రాజ్యాంగ లౌకిక స్వభావాన్ని దెబ్బ తీసేందుకు కేంద్రం చేపట్టిన తొందరపాటు, ఏకపక్ష చర్యగా భావిస్తోంది. దేశ ప్రజలపై ప్రభావం చూపే ఇలాంటి ఏ చర్యనైనా ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి' అని తీర్మానంలో విజయన్ ప్రాతిపాదించారు. యూసీసీని రాజ్యాంగం కేవలం ఆదేశిక సూత్రంగానే పరిగణించిందని తీర్మానం గుర్తు చేసింది. రాజ్యాంగంలోని 44వ అధికరణలో పేర్కొన్న ఆదేశిక సూత్రాలను విధిగా అమలు చేయాలని న్యాయ వ్యవస్థ సైతం ఆదేశించలేదని స్పష్టం చేసింది. పలు దఫాల సంప్రదింపుల తర్వాతే యూసీసీని రాజ్యాంగ నిర్మాతలు ఆదేశిక సూత్రాలలో చేర్చారని తెలిపింది. 'రాజ్యాంగ ఉపోద్ఘాతంలో లౌకికతత్వానికి హామీ ఇచ్చారు. ఏ మతం పైన అయినా నమ్మకం ఉంచేందుకు, దానికి అనుగుణంగా జీవించేందుకు రాజ్యాంగం పౌరులకు స్వేచ్ఛ కల్పించింది. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛలో మతపరమైన వ్యక్తిగత చట్టాలను అనుసరించేందుకు, ఆచరించేందుకు ఉన్న హక్కు కూడా చేరి ఉంది. దానిని అడ్డుకునేందుకు చేసే ఏ చట్టమైనా రాజ్యాంగం ప్రసాదించిన మత స్వేచ్ఛ హక్కును నిరాకరించడం, ఉల్లంఘించడమే అవుతుంది. యూసీసీని రాష్ట్రాలు మాత్రమే ప్రతిపాదించాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 చెబుతోంది. అది కూడా వివిధ మతాల వారితో సంప్రదింపులు జరిపిన తర్వాతేనని స్పష్టం చేసింది' అని కేరళ శాసనసభ ఆమోదించిన తీర్మానంలో వివరించారు.

## ఆర్జీయూకేటీలో విద్యార్థి ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

యూనివర్సిటీల్లో ఏం జరుగుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా బాసర అర్జీయూకేటీలో మరో విద్యార్థి ఆత్మహత్య కలకలం రేపింది. పీయూసీ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభానికి ముందే సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన జాదవ్ బబ్లూ(15) హాస్టల్ గదిలో ఉరేసుకున్నాడు. గమనించిన విద్యార్థులు యూనివర్సిటీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అంబులెన్స్‌లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు నిర్మల్ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. అక్కడ వైద్యులు పరీక్షించి విద్యార్థి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. తరగతులు ప్రారంభం కాకముందే విద్యార్థి మానసిక ఒత్తిడికి గురైనట్టు యూనివర్సిటీ అధికారులు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ఏడాది అవగాహన తరగతుల్లో విద్యార్థి జాదవ్ బబ్లూ పాలుపంచుకున్నాడు. యూనివర్సిటీలో చదువుతున్న తన అన్నతో మధ్యాహ్నం వరకు మాట్లాడినట్టు సమాచారం. అంతలోనే విద్యార్థి సూసైడ్ చేసుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థి మృతి విషయమై తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్టు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. కాగా, నిర్మల్ ఆస్పత్రి వద్ద విద్యార్థి మృతదేహాన్ని చూసేందుకు వచ్చిన కాంగ్రెస్ నాయకులు శ్రీహరిరావును పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో కలెక్టర్ వచ్చేవరకు కదిలేది లేదని అక్కడే కూర్చున్నారు.సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఐఐటీ హైదరాబాద్‌లో చదువుతున్న విద్యార్థిని సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఐఐటీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న ఒడిశాకి చెందిన విద్యార్థిని మమితానాయక్(21) సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్య చేసుకున్నట్టు రూరల్ ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపారు. సూసైడ్‌నోట్‌లో విద్యార్థి ఏం రాసిందనే విషయాల్ని మీడియాకు వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా, జూన్ నెలలో కార్తీక్ అనే విద్యార్థి ఐఐటీహెచ్ నుండి బయటికెళ్లి విశాఖ బీచ్‌లో ఆత్మహత్య చేసుకుని శవమై కనిపించాడు. తాజాగా మరో విద్యార్థిని క్యాంపస్‌లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. చదువుల్లో రాణించలేకపోతున్నామనే ఆత్మన్యూన్యతాభావంతోనే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్టు గతంలో జిల్లా ఎస్పీ రమణకుమార్ మీడియాకు వెల్లడించారు.

## నిక్కర్ పార్టీ, లిక్కర్ పార్టీ రెండూ ఒక్కటే..

(మొదటిపేజీ తరువాయి)

కార్యదీక్షతో పని చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 25 సీట్లకు మించి రావని వ్యాఖ్యానించారు. అందుకే సీఎం కేసీఆర్ కాంగ్రెస్‌పై ఎదురుదాడి చేస్తున్నారని తెలిపారు. మంగళవారం ఢిల్లీలో రేవంత్ విలేకర్లతో మాట్లాడారు. సీఎం, మంత్రులు అసెంబ్లీని చిల్లర రాజకీయాలకు వేదికగా మార్చారని విమర్శించారు. శాసనసభలో గద్దర్‌కు సంతాపం తెలపకపోవడం దారుణమన్నారు. ప్రజాసమస్యలపై అసెంబ్లీలో చర్చ జరపడంలో సర్కారు విఫలమైందని తెలిపారు. 'కాంగ్రెస్‌ను కేసీఆర్, కేటీఆర్ చాలా అభ్యంతరకరంగా దూషించారు. తండ్రీ, కొడుకులు చర్చను నా చుట్టూనే తిప్పారు. నన్ను దూషించేందుకు, కాంగ్రెస్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కేసీఆర్ చేసిన ద్రోహంపై చర్చకు సిద్ధమా?**

రాష్ట్రానికి సీఎం కేసీఆర్ చేసిన ద్రోహంపై చర్చకు సిద్ధమా? అని రేవంత్ సవాల్ విసిరారు. సిద్ధమైతే అమరవీరుల స్థూపం వద్దకు రావాలని డిమాండ్ చేశారు. సీఎం రాలేకపోతే మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావును పంపాలని సూచించారు. బీఆర్ఎస్ నేతలు మంత్రులుగా ఉన్నప్పుడే అప్పటి ప్రభుత్వం పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని పెంచిందని గుర్తు చేశారు. 'కేసీఆర్ నువ్వు నా పేరు ఎత్తలేవు. నీ కొడుకు కేటీఆర్ నా కండ్లలోకి సూటిగా చూడలేడు. అందుకే చర్చకు అల్లుడు హరీశ్‌రావును పంపండి' అని సూచించారు. తెలంగాణ పట్ల తన నిబద్ధత ఎప్పుడూ మారలేదని స్పష్టం చేశారు. తెలంగాణ సమస్యలపై ప్రశ్నించడంలో తను ముందున్నానని చెప్పారు. కానీ కేసీఆర్ చంద్రబాబుతో ఉన్నప్పుడు 610 జీవోపై తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతీసేలా వ్యవహరించారని విమర్శించారు. 1996లో 610జీవోను, జోనల్ విధానం రద్దు చేయాలంటూ అసెంబ్లీలో మాట్లాడిన ద్రోహి కేసీఆర్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1996లో మంత్రిగా కేసీఆర్ మాట్లాడిన మాటలను కేటీఆర్ వినాలని సూచించారు. సోనియా గాంధీ వల్లే తెలంగాణ సాకారమైందంటూ 13 జూన్ 2014లో శాసనసభలో చెప్పిన కేసీఆర్...ఇప్పుడు కాంగ్రెస్‌ను, తనను దోషిగా ఎలా నిలబెడతారని ప్రశ్నించారు. 24 జనవరి 2014లో సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయంపై 54 నిమిషాలు సభలో వివరించానన్నారు. హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ రాష్ట్రం కావాలని నొక్కి చెప్పానని గుర్తు చేశారు. అప్పర్ సీలేరు, లోయర్ సీలేరులో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నదని వాపోయారు. తాను ఏ స్థాయిలో ఉన్నా తెలంగాణ పక్షానే ఉన్నానని వివరించారు. పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ఎస్. జైపాల్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లాంటి కాంగ్రెస్ నాయకులు అధిష్టానాన్ని వ్యతిరేకించి తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లేనని గుర్తు చేశారు. కేకే మహేందర్‌రెడ్డికి వెన్నుపోటు పొడిచి కేటీఆర్‌ను గెలిపించుకున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్‌లో కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించింది నేను కాదా? అని ప్రశ్నించారు. అప్పుడు అక్కడ టీఆర్ఎస్ జెండా మోసేవాడే లేడన్నారు. 2011లో కేసీఆర్‌తో పొత్తు పెట్టుకుని ఇప్పుడు కిషన్‌రెడ్డి సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని విమర్శించారు. తెలంగాణ ద్రోహులతో అంటకాగిన కేసీఆర్ దుర్మార్గుడు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. లాలూచీలో కేసీఆర్‌ను మించినవారు ఈ దేశంలో ఇక పుట్టరబోరని వ్యాఖ్యానించారు. ఏ రోకటి కాడ ఆపాట పాడే వ్యక్తి ఆయన అని విమర్శించారు.

## మైనార్టీలకు 16నుంచి చెక్కులిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

లక్ష ఆర్థిక సాయం, ఓవర్ సీస్ స్కాలర్ షిప్‌లు, స్మశాన వాటికలకు స్థలాల కేటాయింపు, గౌరవ వేతనం పొందే ఇమామ్, మౌజంల సంఖ్య పెంపు, క్రిస్టియన్ స్మశాన వాటికలు, ఆర్‌టీఎఫ్, ఎంటీఎఫ్ తదితర అంశాలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ..స్మశాన వాటికలకు 125 ఎకరాల కేటాయింపు, గౌరవ వేతనం పొందే ఇమామ్‌లు-మౌజిన్‌ల సంఖ్య పెంపు వంటి రెండు హామీలను ప్రభుత్వం పూర్తి చేసిందని తెలిపారు. ఇప్పటికే కేటాయించిన రూ. 270 కోట్లకు అదనంగా, మరో రూ.130 కోట్లు కేటాయించి మొత్తం రూ.400 కోట్లను ఈ కార్యక్రమం అమలుకు కేటాయించాలని ఆర్థిక శాఖను ఆయన ఆదేశించారు. రాష్ట్రంలో శ్మశాన వాటికలు, ఈద్‌గాల భూముల కోసం వచ్చిన మొత్తం వినతులను క్రోడీకరించాలనీ, ఈ దిశగా పనులు వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ఒవైసీ పహాడీ షరీఫ్ దర్గా ర్యాంప్ పనులు, దర్గా బర్హనా షా అద్దెల సవరణ, క్రిస్టియన్ స్మశాన వాటికలు, ఆర్‌టీఎఫ్,ఎంటీఎఫ్ గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఇతర పనులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలనీ, అవసరమైన నిధులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. షాదీ ముబారక్‌కు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసి, లబ్దిదారులకు వెంటనే ఉపశమన సొమ్ము అందేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## పత్తికి బూజు... మిర్చిపై మోజు

(మొదటిపేజీ తరువాయి)

కొంతమేర డ్యామేజ్ అయిందని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. పత్తి గింజలో తేమశాతం పూర్తిగా తగ్గడంతో తూకంలోనూ భారీ వ్యత్యాసం వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

**పత్తి దిగుబడి...ధర రెండూ తగ్గుతున్నాయి**

ధరతో పాటు కొన్నేండ్లుగా పత్తి దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో ఉండటం లేదని రైతులు చెబుతున్నారు. ఏడెనిమిదేండ్ల కిందటి వరకు ఎకరానికి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిన పత్తి నాలుగైదేండ్లుగా తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం ఎకరానికి నాలుగైదు క్వింటాళ్లకు మించి రావడం లేదని రైతులు చెబుతున్నారు. దీనికితోడు ధర కూడా ఉండటం లేదు. ఎకరానికి రూ.20వేల ఖర్చు వస్తే రూ.25వేల ఆదాయం వస్తోంది. అది కూడా ధర మంచిగా ఉన్నప్పుడు మాత్రమే. దీతో రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తోంది.

గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల ఎకరాల్లో సాగైన పత్తి ఈ ఏడాది సగానికి తగ్గినట్టు వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఒక్క ఖమ్మం జిల్లాలోనే గతేడాది 2.21 లక్షల ఎకరాల్లో పత్తి సాగైతే.. ఈ ఏడాది 1.78 లక్షల ఎకరాల్లోనే సేద్యం చేశారు. ఈ ఏడాది వర్షాలు సకాలంలో పడకపోవడంతో ఇప్పటికే గూడ దశలో ఉండాల్సిన పత్తి ఇప్పుడిప్పుడే మొక్కలు వేళ్లానుకుంటోంది. మద్దతు ధర ఇచ్చి పత్తి రైతును ఆదుకోవాల్సిన సీసీఐ 2021 నుంచి ఏ ఒక్క మార్కెట్లోనూ అడుగుపెట్టడం లేదు. క్వింటాల్‌కు రూ.6,300 మద్దతు ధర మాత్రమే ప్రకటించి చేతులు దులుపుకుంది. క్వింటాల్ పత్తికి రూ.12వేల మద్దతు ధర ఇవ్వాలని రైతుసంఘాలు డిమాండ్ చేస్తున్నా కేంద్రం పెడచెవిన పెడుతోంది.

**మిర్చిపై రైతుల ఆసక్తి..**

మిర్చి ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. 2021-22లో తామరనల్లి ప్రభావంతో గతేడాది మిర్చి సాగు విస్తీర్ణాన్ని తగ్గించిన రైతాంగం ఈ ఏడాది అటువైపే మొగ్గుచూపుతున్నారు. క్వింటాల్ తేజా రకం మిర్చి వరంగల్ మార్కెట్లో రూ.25వేల వరకు పలుకగా.. ఖమ్మంలోనూ ధర దానికి సమీపంలోకి వచ్చింది. రూ.24వేలకు పైగా నమోదైంది. దీనికితోడు ఈ ఖరీఫ్ సీజన్‌లో పత్తి సాగుకు అనుకూలంగా వర్షాలు సకాలంలో కురవకపోవడంతో రైతులు మిర్చివైపు మళ్లుతున్నట్టు తెలుస్తోంది. గతేడాది ఖమ్మం జిల్లాలో 65వేల ఎకరాల్లో సాగైన మిర్చి ఈ ఏడాది 1.05 లక్షల ఎకరాలకు చేరుతుందని వ్యవసాయశాఖ అంచనా. భద్రాద్రి కొత్తగూడెంలో గతేడాది 20వేల ఎకరాల్లో వేస్తే ఈ ఏడాది 30వేల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉంది. తామరనల్లి ప్రభావం కూడా తగ్గడంతో రాష్ట్రవ్యాప్తంగా మిర్చి సాగు విస్తీర్ణం పెరగొచ్చని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. గత బుధవారం వ్యవసాయశాఖ కమిషనర్ రఘునందన్‌రావు నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లోనూ పత్తికి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గుచూపుతున్నట్టుగా ఆయా జిల్లాల వ్యవసాయశాఖ అధికారుల నుంచి అభిప్రాయం వెల్లడైంది.

## మందు పోయను... పైసలు పంచను

(మొదటిపేజీ తరువాయి)

ఆయన పర్యటించారు. ముందుగా వేములవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. చింతల్‌ఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా కేంద్రానికి చేరుకుని కలెక్టరేట్‌లో బీసీ బంధు చెక్కులను లబ్దిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు.

'దేశంలో ఎక్కడా లేనివిధంగా 12లక్షల మందికి కల్యాణలక్ష్మి కింద నిధులిచ్చాం. రైతు బీమానే కాదు.. నేతన్న బీమా కూడా మొదలుపెట్టాం. సెప్టెంబర్‌లో సిరిసిల్లలో మెడికల్ కాలేజీని సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారు. ఓట్ల కోసం విపక్ష నేతలు వచ్చినప్పుడు 60ఏండ్లుగా చేయలేని వారు ఇప్పుడేం చేస్తారని నిలదీయండి' అంటూ ప్రజలను కోరారు. బిడ్డ కడుపులో పడిన దగ్గర నుంచి మొదలుకుంటే.. వృద్దుల వరకు ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఏకైన సర్కారు కూడా తమదేనన్నారు. మంచి చేసే ప్రభుత్వాన్ని ప్రజలు కాపాడుకుంటారని, ఆ నమ్మకం తనకు పూర్తిస్థాయిలో ఉందని అన్నారు. 60ఏండ్లలో కనిపించని అభివృద్ధిని 10ఏండ్లలోనే రెండింతలు చేసిన తమ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. బతుకమ్మ పండుగలలోపు వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## మంత్రి ఎర్రబెల్లి హామీతో సమ్మె విరమణ

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేసింది. లేదంటే మరోపోరాటానికి సన్నద్ధమవుతామని హెచ్చరించింది. సమ్మెను విరమిస్తున్నట్టు లేఖలు రాసి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు, పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులకు జేఏసీ నేతలు అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్, సలహాదారులు ఎమ్‌డీ యూసుఫ్, కె.సూర్యం, కన్వీనర్లు పి.అరుణ్‌కుమార్, వెంకటరాజం, శివబాబు, ఎస్.దాసు, కారోబార్ల సంఘం ప్రతినిధి వి.వెంకటేశం, చాగంటి వెంకటయ్య మాట్లాడారు. 34 రోజుల సమ్మె కాలంలో ఎన్ని నిర్బంధాలు ఎదురైనా, ఒత్తిళు వచ్చినా, పోలీసులు బెదిరించినా ఐక్యంగా సమ్మె చేసిన పంచాయతీ కార్మికులందరికీ అభినందనలు తెలిపారు. సమ్మెకు సహకరించిన, మద్దతు తెలిపిన ప్రజలకు, స్థానిక ప్రజాప్రతినిధులకు, గ్రామకార్యదర్శులకు, మేధావులకు, పార్టీలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీలో అన్ని పార్టీలకు చెందిన 20 మందికిపైగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న పోరాటం న్యాయసమ్మతమైనదే అని మాట్లాడటం కార్మికుల పోరాట విజయమేనన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగిందనీ, అందుకే మంత్రి ఎర్రబెల్లి చర్చలకు ఆహ్వానించారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు నేతృత్వంలో జేఏసీతో జరిగిన చర్చల్లో "గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో పంచాయతీ కార్మికుల శ్రమ వెలకట్టలేనిది. న్యాయమైన డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుభూతితో ఉంది. సమ్మె విరమించండి..కొంత టైం ఇవ్వండి. దీనికి మంత్రి హరీశ్‌రావు, నేనూ బాధ్యత తీసుకుంటాం. అవసరమైతే జేఏసీ నేతలను సీఎం దగ్గరకు తీసుకెళ్లి మాట్లాడిస్తాం" అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారని తెలిపారు. ఆయనపై నమ్మకం ఉంచి సమ్మె విరమించాలని జేఏసీలోని కార్మిక సంఘాలన్నీ నిర్ణయం తీసుకున్నాయని చెప్పారు. గ్రామపంచాయతీ కార్మికులకు చెందిన కుటుంబాల్లో 2.5 లక్షల ఓట్లున్నాయనీ, అవి వచ్చే ఎన్నికల్లో కీలకం కాబోతున్నాయని చెప్పారు. ప్రభుత్వం 15 రోజుల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే మరో పోరాటానికి సిద్ధమని ప్రకటించారు. సమ్మెకు తాత్కాలికంగానే విరామం ఇస్తున్నామనీ, ప్రభుత్వం మోసం చేస్తే అదే ఆయుధాన్ని మళ్లీ ఎక్కుపెడతామని హెచ్చరించారు. సమావేశంలో జేఏసీ నాయకులు పాలడుగు సుధాకర్, గ్యార పాండు, పి. గణపతిరెడ్డి, నర్సింహారెడ్డి, ఆర్‌కె. నాయుడు, మధుసూధన్‌రెడ్డి, వెంకట్రాములు, డి. యాదయ్య, జటంకి వెంకన్న, భాను తదితరులు పాల్గొన్నారు.

# నవచిత్రం

డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతున్న 'దయా' వెబ్ సిరీస్‌కి విశేష ఆదరణ లభిస్తోంది. జేడీ చక్రవర్తి, ఈషా రెబ్బా, నంబీషన్ రమ్య, కమల్ కామరాజ్ తదితరులు కీ రోల్స్ చేసిన ఈ వెబ్ సిరీస్‌ను ఎస్వీఎఫ్ ప్రొడక్షన్స్‌లో శ్రీకాంత్ మొహతా, మహేంద్ర సోని నిర్మించారు. ఈ సిరీస్ సూపర్ హిట్టైన నేపథ్యంలో దర్శకుడు పవన్ సాధినేని తన సంతోషాన్ని మీడియాతో షేర్ చేసుకున్నారు.

"దయా' వెబ్‌సిరీస్‌కు వస్తున్న రెస్పాన్స్ సంతోషాన్నిస్తోంది. సినిమా ఫస్ట్ డే ఫస్ట్ షో చూసినట్లు స్ట్రీమింగ్ మొదలైనప్పటి నుంచి మా వెబ్ సిరీస్ చూస్తున్నారు. ప్రతి చోట నుంచీ మంచి రెస్పాన్స్ వస్తోంది.

## అంతకుమించి దయా పార్ట్ 2



పవన్ సాధినేని

జేడీ చక్రవర్తిని దయా అని పిలుస్తున్నారు. ఇండస్ట్రీ నుంచైతే చాలా కాల్స్, మెసేజ్‌లు వస్తున్నాయి. బెంగాలీ వెబ్ సిరీస్ తక్‌ధీర్ నుంచి ఇన్‌స్పైర్ అయి ఈ కథ రాసుకున్నాను. అయితే తక్‌ధీర్‌లో ఇంత విస్తృతమైన కథ ఉండదు. రిపోర్టర్, దయా అసిస్టెంట్ ఇలా..ఇన్ని క్యారెక్టర్స్ ఉండవు. ఆ వెబ్ సిరీస్ నుంచి కేవలం అంబులెన్స్ డ్రైవర్‌కు డెడ్ బాడీ దొరకడం అనే అంశాన్ని మాత్రమే సెలెక్ట్ చేసుకున్నాను. మిగతా అంతా నేను రాసుకున్నదే. జేడీకి ఉన్న అనుభవంతో దర్శకుడి విజన్ తెలుసుకోగలరు. ఈ సిరీస్‌లో మీరు చూసిందంతా ఒక గ్లింప్స్ మాత్రమే. దయా, అలివేలు క్యారెక్టర్స్ మెయిన్‌గా చూశారు. అసలైన కథ, ట్విస్ట్‌లు సెకండ్ సీజన్‌లో ఉంటాయి. మేము ఎక్స్‌పెక్ట్ చేసినట్లే ఫస్ట్ భాగం మంచి హిట్ అయ్యింది. ఇక సెకండ్ సీజన్‌ను మరింత పెద్ద స్పాన్‌లో ఇంకా ఇంట్రెస్టింగ్‌గా చేయబోతున్నాం. దయా సీజన్1కు డబుల్ స్కేల్‌లో సీజన్2 ఉంటుంది. స్క్రిప్ట్ మొత్తం సిద్ధమైంది. గీతా ఆర్ట్స్‌లో నా డ్రీమ్ ప్రాజెక్ట్ చేయబోతున్నా' అని దర్శకుడు పవన్ సాధినేని తెలిపారు.

చిరంజీవి నటిస్తున్న మాస్-యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రామబ్రహ్మం సుంకర భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ సినిమా ఈనెల 11న

## ఇంకా ఆ డ్రీమ్‌లోనే ఉన్నా..



మెహర్ రమేష్

విడుదల కానున్న నేపథ్యంలో డైరెక్టర్ మెహర్ రమేష్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు.

'అన్నయ్యని డైరెక్ట్ చేయడం ఒక డ్రీమ్. ఇప్పటికీ ఆ డ్రీమ్‌లోనే ఉన్నాను. ఈనెల 11న ఆ డ్రీమ్ రిలీజ్ అవుతుంది. చిన్నప్పటి నుంచి అన్నయ్యని, ఆయన సినిమాలని చూస్తూ ఆయన్ని ఇలా చూపించాలని ప్రతి క్షణం తపనపడుతూ ఈ సినిమా తీశాం. అన్నయ్య ఇచ్చిన ఎనర్జీతో సినిమా మొత్తం అయిపోయింది. అన్నయ్య కూడా చాలా ఎంజాయ్ చేశారు. దర్శకుడికి ఏం కావాలో అన్నయ్యకి బాగా తెలుసు. ఇందులో నా ఒక్కడికే దక్కిన అదృష్టం ఏమిటంటే నేను అన్నయ్య కజిన్. ఇప్పుడు ఆయన్ని డైరెక్ట్ చేసి ఆయనతో 'బావుందిరా' అనిపించుకున్నాను. ఇలాంటి అదృష్టం అందరికీ దక్కదు. నేను డైరెక్టర్ అయ్యిందే ఈ సినిమా చేయడానికేమో. ఇది పెద్ద అచీవ్ మెంట్.

దీని తర్వాత చేసేదంతా బోనస్. ఈ సినిమా విషయంలో అన్నయ్య సలహాలు సూచనలు ఖచ్చితంగా ఉంటాయి. రీమేక్ సినిమా అయినప్పటికీ ఆయనకి నచ్చితేనే ఆమోదముద్ర పడుతుంది. ఏదైనా కొత్తగా చేస్తే చాలా చక్కగా ప్రశంసిస్తారు. చాలా విలువైన ఇన్‌పుట్స్ ఇస్తారు. ముఖ్యంగా 'వేదాళం' రీమేక్ చేయడానికి కారణం ఏంటంటే ఇందులో అన్నయ్య తత్వం ఉంది. అది నాకు చాలా నచ్చింది. జనరేషన్ మారిపోయినా అనుబంధాలు అలానే ఉన్నాయి. యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు బ్రదర్, సిస్టర్ ఎమోషన్ ఉన్న కథ ఇది. నేను ఇలాంటి సబ్జెక్ట్‌ని ఎప్పుడూ డీల్ చేయలేదు. చిరంజీవి ఇమేజ్‌కి తగ్గట్టుగా ఇందులో మార్పులు చేశాం. సెకండ్ హాఫ్ చిరంజీవికి ఇచ్చిన ట్రీట్ కంప్లీట్ డిఫరెంట్‌గా ఉంటుంది. మహతి సాగర్ వర్క్ నాకు తెలుసు. మెగాస్టార్ స్థాయికి సాగర్ మ్యూజిక్ చేయగలడని నా నమ్మకం, ఈ విషయంలో గొప్పదనం అంతా అన్నయ్యదే. సాగర్ పేరు చెప్పినపుడు మరో ఆలోచన లేకుండా 'వెరీ గుడ్ మనం ప్రోత్సాహించాలి' అని అన్నారు. సాగర్ నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు' అని దర్శకుడు మెహర్ రమేష్ చెప్పారు.

## భిన్న కాన్సెప్ట్‌తో సూర్యాపేట్ జంక్షన్



యోగ లక్ష్మీ ఆర్ట్స్ క్రియేషన్స్ పతాకంపై ఈశ్వర్, నయన సర్వార్ హీరో హీరోయిన్స్‌గా అభిమన్యు సింగ్ ముఖ్య పాత్రలో అర్.ఎక్స్ 100 ఫేమ్ పూజా ఐటమ్ సాంగ్‌లో చేస్తున్న చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. ఈ సినిమాలోని మూడవ సాంగ్‌ని ప్రొడ్యూసర్ సి.కళ్యాణ్ చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. సి.కళ్యాణ్ మాట్లాడుతూ, "చెంగు చెంగు..' అంటూ సాయిచరణ్ పాడిన టీజింగ్ సాంగ్ చాలా బాగుంది. హీరో ఈశ్వర్, హీరోయిన్ నయన సర్వార్ ఈ పాటకు డాన్స్ బాగా చేశారు. డైరెక్టర్ విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సినిమా స్టోరీ ఎంచుకుని చాలా బాగా తీశారు. కొరియోగ్రాఫర్ ఈశ్వర్‌తో స్టెప్స్ బాగా చేయించాడు. రోషన్ సాలూరి మ్యూజిక్ కూడా బాగుంది. హీరో ఈశ్వర్‌కి ఈ చిత్రంతో మంచి హిట్ రావాలి' అని అన్నారు. 'మా సినిమాలోని రెండవ పాటని సి.కళ్యాణ్ చేతుల మీదుగా విడుదల చేయటం ఆనందంగా ఉంది. ఆయన బిజీ టైమ్‌లో కూడా అడిగిన వెంటనే సాంగ్ విడుదల చేయడానికి ఒప్పుకుని మూవీ కంటెంట్ చూసి ఇది మంచి సినిమా అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మూడవ సాంగ్ విడుదల చేసినందుకు మా టీమ్ తరపున కళ్యాణ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు' అని హీరో ఈశ్వర్ అన్నారు.

డైరెక్టర్ రాజేష్ నాదెండ్ల మాట్లాడుతూ, 'ఇప్పటికే విడుదలైన టీజర్, ఐటమ్ సాంగ్‌కి ప్రేక్షకుల నుండి మంచి స్పందన లభించింది. హీరో ఈశ్వర్ హీరోయిన్‌ని టీజింగ్ చేసే ఈ మాస్ సాంగ్ అందరికీ నచ్చుతుంది' అని చెప్పారు. నిర్మాతలు మాట్లాడుతూ, 'మా చిత్రాన్ని త్వరలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం. మిగిలిన అప్డేట్స్ త్వరలో తెలియజేస్తాం. ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించే సినిమా ఇది. సినిమా అవుట్‌పుట్ చాలా బాగా వచ్చింది. కచ్చితంగా ఈ చిత్రం విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు.

# మాయ చేసినా..!

**స్లో వికెట్‌పై భారత స్పిన్ త్రయం మాయాజాలం చేసినా.. మూడో టీ20లో తొలుత కరీబియన్లు మంచి స్కోరు సాధించారు. ఆరంభంలో బ్రాండన్ కింగ్ (44), చివర్లో రోవ్‌మాన్ పావెల్ (40 నాటౌట్) మెరవటంతో ఆతిథ్య జట్టు 159 పరుగులు నమోదు చేసింది. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (3/28) మూడు వికెట్లతో మ్యాజిక్ చేశాడు.**

**వెస్టిండీస్ స్కోరు 159/5 • రాణించిన కుల్దీప్, అక్షర్, చాహల్**

నవతెలంగాణ-ప్రావిడెన్స్

కరీబియన్ గడ్డపై మరో స్వల్ప స్కోర్ల థ్రిల్లర్!. టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న వెస్టిండీస్ 20 ఓవర్లలో 159/5 పరుగులు చేసింది. భారత్‌కు 160 పరుగుల సవాల్‌తో కూడిన లక్ష్యాన్ని నిర్దేశించింది. ఓపెనర్ బ్రాండన్ కింగ్ (42, 42 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ రోవ్‌మాన్ పావెల్ (40 నాటౌట్, 19 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించారు. కైల్ మేయర్స్ (25, 20 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), నికోలస్ పూరన్ (20, 12 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) విలువైన ఇన్నింగ్స్‌లు ఆడారు. భారత బౌలర్లలో చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (3/28) మూడు వికెట్లు పడగొట్టాడు.

**స్పిన్నర్లు మెరిసినా..**

టాస్ నెగ్గిన కరీబియన్లు తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నారు. ఓపెనర్లు బ్రాండన్ కింగ్ (42), కైల్ మేయర్స్ (25) ఆ జట్టుకు మంచి ఆరంభం అందించారు. కొత్త బంతితో భారత బౌలర్లను ఎదుర్కొన్న ఓపెనర్లు తొలి వికెట్‌కు 55 పరుగులు జోడించారు. రన్‌రేట్ సాధారణంగా ఉన్నప్పటికీ.. చేతిలో వికెట్లు ఉండటంతో విండీస్ మంచి స్కోరుపై కన్నేసింది. కుల్దీప్ యాదవ్‌పై ఓ సిక్సర్, ఫోర్ బాదిన నికోలస్ పూరన్ ప్రమాదకరంగా కనిపించాడు. కానీ కుల్దీప్ మాయాజాలంతో నికోలస్ పూరన్ సహా జాన్సన్ చార్లెస్ (12), బ్రాండన్ కింగ్‌లను డగౌట్ బాట పట్టించాడు. షిమ్రోన్ హెట్‌మయర్ (9) నిష్క్రమించినా.. చివర్లో కెప్టెన్ రోవ్‌మాన్ పావెల్ (40 నాటౌట్) విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. అర్షదీప్‌పై రెండు, ముకేశ్‌పై ఓ సిక్సర్ బాదిన పావెల్.. 19 బంతుల్లోనే 40 పరుగులు పిండుకున్నాడు. డెత్ ఓవర్లలో అర్షదీప్ 12 బంతుల్లో 27 పరుగులు సమర్పించుకుని.. భారత బ్యాటర్లకు కొండంత లక్ష్యం ముందుంచాడు!. అక్షర్ పటేల్ (1/24), చాహల్ (0/33) సైతం ఆకట్టుకునే ప్రదర్శన చేశారు.




**స్కోరు వివరాలు**

**వెస్టిండీస్ ఇన్నింగ్స్ :** కింగ్ (సి,బి) కుల్దీప్ 42, మేయర్స్ (సి) సింగ్ (బి) అక్షర్ 25, చార్లెస్ (ఎల్బీ) కుల్దీప్ 12, పూరన్ (సి) సంజు (బి) కుల్దీప్ 20, పావెల్ నాటౌట్ 40, హెట్‌మయర్ (సి) తిలక్ (బి) ముకేశ్ 9, షఫర్డ్ నాటౌట్ 2, ఎక్స్‌ట్రాలు : 9, మొత్తం : (20 ఓవర్లలో 5 వికెట్లకు) 159.

**వికెట్ల పతనం :** 1-55, 2-75, 3-105, 4-106, 5-123. **బౌలింగ్ :** హార్దిక్ 3-0-18-0, అర్షదీప్ 3-0-33-0, అక్షర్ 4-0-24-1, చాహల్ 4-0-33-0, కుల్దీప్ 4-0-28-3, ముకేశ్ 2-0-19-1.



## మరిన్ని టెస్టులు అవసరం

**భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్**

**ముంబయి :** భారత మహిళల జట్టు మరిన్ని టెస్టులు ఆడాల్సిన అవసరం ఉందని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అభిప్రాయపడ్డారు. 2022-25 ఎఫ్‌టీపీలో భారత్ రెండు టెస్టులే ఆడనుండగా.. ఇంగ్లాండ్ (5), ఆస్ట్రేలియా (4), దక్షిణాఫ్రికా (3) ఎక్కువ మ్యాచులు ఆడుతున్నాయి. ' ఓ క్రీడాకారిణిగా ఎక్కువ టెస్టులు ఆడాలని అనుకుంటాను. ఎందుకంటే చిన్నప్పటి నుంచి టీ20, వన్డేల కంటే టెస్టు క్రికెటే ఎక్కువగా చూశాం. వైట్‌బాల్ క్రికెట్ వినోదభరితమే కానీ టెస్టు క్రికెట్ ప్రతి క్రికెటర్ కోరుకునేది. భారత్ రెండు టెస్టులే ఆడనుంది. స్వదేశంలో ఆసీస్, ఇంగ్లాండ్‌లపై రెడ్ బాల్ క్రికెట్ ఆడనున్నాం. మహిళల క్రికెట్‌లో టెస్టు మ్యాచులను మరిన్ని పెంచాలి. దేశవాళీ క్రికెట్‌లోనూ పరిస్థితులు గుణాత్మకంగా మారాయి. ఫస్ట్ క్లాస్ మ్యాచులను మహిళలకు సైతం షెడ్యూల్ చేయాలి' అని హర్మన్‌ప్రీత్ కౌర్ అన్నారు. భారత్‌కు 127 వన్డేలు, 154 టీ20ల్లో ఆడిన హర్మన్.. కేవలం మూడు టెస్టుల్లోనే కనిపించింది.



## వరల్డ్ అథ్లెటిక్స్‌కు జ్యోతి ఎర్రాజి

**హైదరాబాద్ :** ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో తెలుగు తేజం జ్యోతి ఎర్రాజి పోటీపడనుంది. ఈ మేరకు కేంద్ర క్రీడాశాఖ 28 మంది అథ్లెట్లకు వరల్డ్ అథ్లెటిక్స్ ఖర్చులను భరించనున్నట్టు వెల్లడించింది. మహిళల 100 మీ హార్డిల్స్‌లో జ్యోతి ఎర్రాజి పతకం కోసం పోటీపడనుంది. 28 మంది అథ్లెట్లలో 13 మంది టాప్స్ అథ్లెట్లు కాగా.. 15 మంది తొలిసారి ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో పోటీపడనున్నారు. నీరజ్ చోప్రా, శాలిని సింగ్, అన్నూ రాయ్, పారుల్ చౌదరి, శ్రీశంకర్‌లు భారత అథ్లెటిక్స్ జట్టులో ఉన్నారు. ఆగస్టు 19 నుంచి బుడాపెస్ట్ (హంగరీ)లో జరుగనున్న వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌కు భారత్ 42 మందితో కూడిన (సహాయక సిబ్బంది సహా) బృందాన్ని పంపించనుంది.



## సింధు వరల్డ్ నం.15 డబ్ల్యూబిఎఫ్ ర్యాంకింగ్స్

**న్యూఢిల్లీ :** ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ షట్లర్ పి.వి సింధు రెండు స్థానాలు మెరుగైంది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో క్వార్టర్స్‌కు చేరిన సింధు రెండు స్థానాలు ఎగబాకి 15వ స్థానంలో నిలిచింది. కిదాంబి శ్రీకాంత్ మాత్రం 20వ స్థానంలోనే నిలిచాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్స్‌కు చేరిన హెచ్.ఎస్ ప్రణయ్, యువ షట్లర్ లక్ష్యసేన్ మెన్స్ సింగిల్స్‌లో వరుసగా 9, 11వ స్థానాల్లో కొనసాగుతున్నారు. ప్రియాన్షు రజావత్ మూడు స్థానాలు మెరుగై 28వ స్థానంలో, మిథున్ మంజునాథ్, కిరణ్ జార్జ్‌లు 43, 49వ స్థానాల్లో నిలిచారు. మెన్స్ డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ రెండో స్థానం నిలుపుకుంది. ట్రెసా జాలీ, గాయత్రి జంట మహిళల డబుల్స్‌లో 19వ స్థానానికి పడిపోయింది.



# గోల్కొండలోనే స్వాతంత్ర్య వేడుకలు

## ఏర్పాటు చేయండి : అధికారులకు సీఎస్ శాంతికుమారి ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

స్వాతంత్ర దినోత్సవ వేడుకలను చారిత్రాత్మక గోల్కొండ కోటలో ఘనంగా నిర్వహించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. మంగళవారంనాడామె డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. డీజీపీ అంజనీ కుమార్, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హౌం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, ఆరోగ్య శాఖ కార్యదర్శి ఎస్ఏఎమ్ రిజ్వి, జీఏడీ కార్యదర్శి శేషాద్రి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఆగస్టు 15న గోల్కొండ కోటలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు జాతీయ పతాకావిష్కరణ చేస్తారనీ, దానికంటే ముందు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో అమర వీరుల స్మారక స్థూపం వద్ద స్వతంత్ర సమర యోధులకు శ్రద్ధాంజలి ఘటిస్తారని తెలిపారు. 15వ తేదీ ఉదయం గోల్కొండ కోటలో ఉదయం 10.30 గంటలకు జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం ఉంటుందని వివరించారు. ఈ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలన్నీ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లోని అమర వీరుల స్మారక స్థూపం వద్ద ఆర్మీ జీఓసీ అధికారులతో సమన్వయం చేసుకొని, తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీస్, రోడ్లు, భవనాలు, సమాచార శాఖ, జీహెచ్ఎంసీ, విద్యుత్, రవాణా తదితర శాఖలు తమ శాఖ పరమైన ఏర్పాట్లను చేపట్టాలని అన్నారు. సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


# కేంద్రం గుప్పెట్లోకి గ్రంథాలయాలు

## రాష్ట్ర జాబితా నుంచి ఉమ్మడి జాబితాలోకి లైబ్రరీలు

- బిల్లు తెచ్చేందుకు కేంద్రం యోచన
- సమాఖ్య వ్యవస్థపై పోటు
- సంఘ్‌పరివార్ ఎజెండాను అమలుకు యత్నం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గ్రంథాలయాలను త్వరలో కేంద్ర ప్రభుత్వ గుప్పెట్లోకి తీసుకోనున్నది. రాష్ట్ర సార్వభౌమాధికారంలోని అంశాల్లోకి చొరబడేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నంగా, సమాఖ్య వ్యవస్థపై పోటుగా పలువురు దీనిని పరిగణిస్తున్నారు. గ్రంథాలయాల పనితీరులో జోక్యం చేసుకోవడానికి, సంఘ్ పరివార్ భావజాలాన్ని వ్యాప్తి చేయడానికి విస్తృత ఎజెండాలో భాగమే ఈ చర్య అని చాలా మంది అభిప్రాయపడ్డారు. పుస్తకాలు, ప్రచురణలతో సంఘ్ పరివార్ ఎజెండాను ప్రచారం చేసేందుకే ఈ చర్య తీసుకున్నట్లు కేంద్రం ప్రకటించింది. రాష్ట్రాల పరిధిలోని లైబ్రరీల వ్యవస్థను ఉమ్మడి జాబితా (కాంకరెంట్ లిస్ట్)కి బదిలీ చేసేందుకు, తన పరిధిలోకి తీసుకునేందుకు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ త్వరలో పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టనుంది.



ఢిల్లీలో జరిగిన రెండు రోజుల 'ఫెస్టివల్ ఆఫ్ లైబ్రరీస్-2023'లో దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన గ్రంథాలయాల ప్రతినిధులు హాజరైన సందర్భంగా, లైబ్రరీలను ఉమ్మడి జాబితాకు బదిలీ చేయడంపై చర్చలు జరిగాయి. రాజా రామ్మోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అజయ్ ప్రతాప్ సింగ్ లైబ్రరీ లను సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలోకి తీసుకు రావాలనే ప్రభుత్వ సంకల్పానికి సంకేతాలు ఇచ్చారు. ఇదిలా ఉండగా, రాష్ట్ర గ్రంథాల యాలను తీర్మానం చేసి కేంద్ర మంత్రిత్వ శాఖ పరిశీలనకు సమర్పిం చాలని కోరినట్టు సమాచారం. ఈ సమావేశానికి ఏపి నుంచి ఎవరూ హాజరు కాలేదు. తెలంగాణ నుంచి గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ అయాచితం శ్రీధర్, 14 జిల్లాల గ్రంథాలయ చైర్మెన్లు పాల్గొన్నారు.

### దేశంలో 46,746 లైబ్రరీలు

దేశం వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 46,746 లైబ్రరీలు ఉన్నాయి. అందులో మహారాష్ట్రలో అత్యధికంగా 12,191 లైబ్రరీలు ఉన్నాయి. కేరళలో 8,415, కర్నాటకలో 6,798, తమిళనాడులో 4,622, గుజరాత్‌లో 3,464 లైబ్రరీలు ఉండగా, ఏపీలో 978, తెలంగాణలో 672 లైబ్రరీలు ఉన్నాయి. ఏపీలో 13 జిల్లా, 4 డివిజనల్, 178 సిటీ, టౌన్, 782 గ్రామీణ లైబ్రరీలు ఉన్నాయి. తెలంగాణలో ఒక స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, 31 జిల్లా, రెండు డివిజనల్, 537 సిటీ, టౌన్, 99 గ్రామీణ, రెండు ఎన్‌జీఓ, ట్రస్ట్‌లు నడుపుతున్న లైబ్రరీలు ఉన్నాయి.

### ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గ్రంథాలయ ఉద్యమం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పబ్లిక్ లైబ్రరీలు మునిసిపల్ కార్పొరేషన్లు, గ్రామ పంచాయితీలు, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలచే నిర్వహించబడు తున్నాయి. 1956లో అవిభక్త రాష్ట్రం ఏర్పడినప్పుడు ఆంధ్ర ప్రాంతంలోని 11 జిల్లాల్లో మద్రాసు పౌర గ్రంథాలయాల చట్టం, తెలంగాణ ప్రాంతంలోని తొమ్మిది జిల్లాల్లో హైదరాబాద్ పబ్లిక్ లైబ్రరీస్ చట్టం అమలులో ఉన్నాయి. సమ్మిళిత చట్టం కోసం, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ లైబ్రరీస్ చట్టం 1960లో రూపొందించబడింది. ఈ చట్టం 1964, 1969, 1987, 1989, 2016లో వరుసగా సవరించబడింది. ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత, తెలంగాణ గ్రంథాలయాల కోసం ప్రత్యేక చట్టం రూపొందించబడింది. ఆంధ్రప్రదేశ్‌లో గ్రంథాలయ ఉద్యమం అన్ని ప్రాంతాలకు విస్తరించిన ప్రజా ఉద్యమంగా మారింది. ఆంధ్రాలో పబ్లిక్ లైబ్రరీ ఉద్యమం విజయం 19వ శతాబ్దం ప్రారంభంలో జరిగింది. తరువాతి దశాబ్దాలలో ఇది క్రమంగా పెరి గింది. 1800లో పరవస్తు కుటుంబానికి చెందిన ఒక ప్రయివేట్ లైబ్రరీ ప్రజల కోసం తెరవబడింది. ఇది తరువాత ఆర్ష గ్రంథాలయంగా అభివృద్ధి చేయబడింది. రాజా రామేశ్వర రాయలు (1821-1865) లైబ్రరీ కూడా వనపర్తి, మహబూబ్‌నగర్‌లలో ప్రజలకు తెరిచారు.

### తీవ్రంగా వ్యతిరేకించిన కేరళ

లైబ్రరీలను ఉమ్మడి జాబితాకు బదిలీ చేయడాన్ని కేరళ ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది. ఈ కార్యక్రమానికి హాజరైన కేరళ స్టేట్ లైబ్రరీ కౌన్సిల్ కేంద్రం నిర్ణయంపై నిరసన వ్యక్తం చేసింది. కేరళ ఉన్నత విద్యాశాఖ మంత్రి ఆర్. బిందు కేంద్రం చర్యపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో విభేదించారు. కేరళలో లైబ్రరీ వ్యవస్థలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన పాలనా వ్యవస్థ ఉందని, లైబ్రరీ వ్యవస్థను ఉమ్మడి జాబితాలో చేర్చడంతో ప్రజాస్వామ్య స్వభావాన్ని, వైవిధ్యాన్ని తొలగించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇది రాష్ట్రాల అధికారాలు, గ్రంథాలయాల స్వాతంత్ర్యానికి భంగం కలిగించడమేనని మంత్రి అన్నారు. ఇది రాష్ట్రంలోని లైబ్రరీలు స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వస్తే గ్రంథాలయాలు స్వయం ప్రతిపత్తిని కోల్పోతాయని అన్నారు. పుస్తకాలు కొనుగోలు చేసేందుకు నిధుల పంపిణీలో కూడా వివక్ష చూపే అవకాశం ఉందని తెలిపారు. అదే సమయంలో భారతదేశ ప్రాచీన సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పడంతోపాటు గ్రంథాలయాలను ఆధునీకరించే ప్రయత్నంలో భాగంగానే ఈ చర్య తీసుకున్నట్టు కేంద్రం ప్రకటించింది.

# గిరిజనాభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పోడుభూముల పట్టాల పంపిణీలో దేశంలోనే అగ్రస్థానం : మంత్రి సత్యవతి రాథోడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజనుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని గిరిజన స్త్రీ - శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిపుత్రులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదనీ, ప్రత్యేకంగా గిరిజనులకు ప్రాధాన్యతనిస్తున్నదని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గిరిజనుల వెనుకబాటును తొలగించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని తెలిపారు. ఆదివాసులకు అన్ని మౌలికవసతులు కల్పించడానికి రూ.కోట్ల నిధులను మంజూరు చేసిందని వెల్లడించారు.

# ఆర్టీసీ కార్మికుల హయ్యర్ పెన్షన్ పెనాల్టీలు నివారించండి

- ఎమ్‌డీ సజ్జనార్‌కు ఎస్‌డబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కమిషనర్ కార్యాలయం నుంచి హయ్యర్ పెన్షన్‌కు అనుమతిస్తూ ఆర్టీసీ కార్మికులకు పంపిన డిమాండ్ నోటీసులపై పెనాల్టీలను నివారించాలని టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించినట్టు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు తెలిపారు. పీఎఫ్ కార్యాలయం నుంచి డిమాండ్ నోటీసు అందాక అనుమతి పత్రాలు ఇచ్చిన కార్మికుల ఖాతాల నుంచి తక్షణం నగదు బదిలీలు చేయాలని కోరారు. ఆలస్యం అయితే నెలకు పెనాల్టీల రూపంలో ఆర్టీసీ కార్మికులపై ఆర్థికభారం పడుతుందనీ, యాజమాన్యం దీన్ని నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 31లోపు దరఖాస్తులు సమర్పిస్తే సంస్థలోని 43,373 మంది కార్మికులపై రూ.15 కోట్లు, సెప్టెంబర్ 30 లోపు సమర్పిస్తే రూ.30 కోట్లు చొప్పున పెనాల్టీలు పడతాయని ఉదహరించారు. అందువల్ల వీటిని నివారిస్తూ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.